ప్రతి నిత్యం తాజా సమాచారంతో నిజాలు నిగ్గు తేలుస్తూ, సమకాలీన అంశాలను విశ్లేశిస్తూ ముస్తాబయి మీ ముందుకు వస్తున్న అక్షరం తెలుగు దినపత్రిక




ప్రకటనలకు (అడ్వర్టైస్‌మెంట్) కొరకు సంప్రదించండి

Publisher&Editor: 9391690609,Office :7893003409

aksharamtsnews@gmail.com https//www.facebook.com/aksharamnewspaper/



www.aksharamtelugudaily.com

సుఫల అక్షరం

సామాన్యుడి అస్త్రం తెలుగు దినపత్రిక

మంగళవారం 27 ఆగస్టు 2024 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా

పేజీలు : 12 సంపుటి : 07 సంచిక : 161 వెల : రూ.3/- కొత్తగూడెం తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, A SIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI


## నేడు యాదాద్రికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



# నిరుద్యోగులకు శుభవార్త

- -త్వరలోనే మరో 35వేల ఉద్యోగాల భర్తీ
- -విద్యార్థుల వల్లనే తెలంగాణ పోరాటం
- -నిరుద్యోగులకు అండగా ప్రభుత్వం
- -త్వరలోనే యూనివర్సిటీల్లో విసిల నియామకం
- -తెలంగాణ అభివృద్దే మా లక్ష్యం అన్న సిఎం
- -సివిల్స్ అభ్యర్థులకు లక్ష సాయం కింద చెక్కుల పంపిణీ
- -సచివాయంలో జరిగిన కార్యక్రమంలో సిఎం రేవంత్ వెల్లడి



**హైదరాబాద్,ఆగస్ట్26(అక్షరం న్యూస్):**
నిరుద్యోగ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. తెలంగాణ ఏర్పడ్డదే నిరుద్యోగుల సమస్యపై అని అన్నారు. విద్యార్థుల ఉద్యమం వల్లే రాష్ట్ర సాధన సాధ్యమైందని, నిరుద్యోగ సమస్యను శాశ్వతంగా పరిష్కరించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. 90 రోజుల్లో 30 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశా మని, మరో 35 వేల ఉద్యోగాలు త్వరలో భర్తీ చేయబోతున్నామని ఆయన ప్రకటించారు. సరైన సమయం లో నోటిఫికేషన్ ఇచ్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. గ్రూప్–1, 2, 3 కావచ్చు..ఇతర ఉద్యోగాలు కావచ్చు.. ఖాళీలను బర్తీ చేసేందుకు కట్టుబడి ఉన్నామని ప్రకటించారు. ఇక విద్యార్థులు, కంపెనీల మధ్య గ్యాప్ వస్తోందని పేర్కొన్నారు. ఇప్పుడు తాము నియామకాలు చేపడితే వాయిదా వేయాలని అంటున్నారని విపక్ష బీఆర్ఎస్‌పై మండిపడ్డారు. వాళ్ల ఉద్యోగాలు పోయాకే నిరుద్యో గులు గుర్తుకొచ్చారని ఎద్దేవా చేశారు.




## హైడ్రా కూల్చివేతలతో
# ఉలిక్కిపాటు

- -బిఆర్ఎస్‌కు నిద్దర పట్టడం లేదా?
- -రేవంత్ లక్ష్యంగా ఎదురుదాడి రాజకీయాలు
- -ప్రజలు ఈసడించుకుంటున్నా..అవే విమర్శలు



**హైదరాబాద్,ఆగస్ట్26(అక్షరం న్యూస్):**
పదేళ్లపాటు అధికారం వెలగబెట్టిన బిఆర్ఎస్‌కు నిద్రపట్టడం లేదు. ప్రధానంగా కెసిఆర్ కుటుంబానికి, వారిని నమ్ముకున్న ఒకరిద్దరు రాజకీయ నేతలకు అస్సలు నిద్రపట్టడం లేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరవాత.. సిఎం రేంవత్ రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలు, కార్యక్రమాలు, అమలు చేస్తున్న తీరు, చేపడుతున్న చర్యలతో బిఆర్ఎస్ నేతలకు నరంమీద పుండు సల్పినట్లుగా ఉంది. తట్టుకోలేక పోతున్నారు. రుణమాఫీని తట్టుకోవడం లేదు. హైడ్రా కూల్చివేతలను అస్సలు తట్టుకోవడం లేదు. ఎలాగైనా రేవంత్‌ను

# చెరువుల ఆక్రమణలను వదిలేది లేదు

### తెలంగాణ వ్యాప్తంగా గుర్తించి చర్యలు
### ఆధారాలతో ఎవ్వరైనా ఫిర్యాదు చేయొచ్చు
### హైడ్రా చర్యలను సమర్థించిన మంత్రి పొన్నం

హైదరాబాద్,ఆగస్ట్26(ఆర్ఎన్ఎ): గ్రేటర్ హైదరాబాద్‌పరిధిలో హైడ్రా చేపట్టిన అక్రమ కట్టడాల కూల్చివేతల పై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా.. ముందు రాజధాని నగరంలో, తరువాత అన్ని జిల్లాల్లో చెరువులు ఆక్రమణకు గురయ్యాయో వివరాలు సేకరించి వాటిని పునరుద్ధరించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. భౌగోళిక పరిస్థితుల్లో వాతావరణ కాలుష్యం నుండి వాతావరణాన్ని పరిరక్షించుకోవడానికి, పర్యావరణాన్ని కాపాడుకోవడానికి గతంలో ఉన్న చెరువులకు ప్రభుత్వ లెక్కలకు రికార్డులకు అనుగుణంగా కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా చెరువుల పరిరక్షించుకోవాలని స్వచ్ఛంద సంస్థలకు, గతంలో ఇక్కడ చెరువు ఉండే అని తెలిసిన వారు స్థానికులు ఎవరైనా పోలీసు, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చే పని.. చెరువుల పరిరక్షణ స్థానికులదేనని అన్నారు. ప్రభుత్వానికి ఎవరి మీద రాజకీయ కక్ష సాధింపు లేదని తేల్చి చెప్పారు.



# సివిల్స్ మెయిన్స్ అభ్యర్థులకు లక్ష సాయం

### మొత్తం 135మంది అభ్యర్థుల ఎంపిక
### 113 మంది పురులు.. 22 మంది మహిళా అభ్యర్థులు



## అవినీతికి పాల్పడే
# పోలీసులపై చర్యలు

### అవసరమైతే ఉద్యోగాల నుంచి తొలగిస్తాం
### హైదరాబాద్ సిపి కఠిన హెచ్చరికలు

**హైదరాబాద్,ఆగస్ట్26(అక్షరం న్యూస్):**
లంచాలు, వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. అవినీతికి పాల్పడినట్టు రుజువైతే ఉద్యోగం నుంచి పూర్తిగా తొలగిస్తామని తేల్చి చెప్పారు. పలుమార్లు హెచ్చరించినప్పటికీ తీరుమారని అధికారులపై నిఘా పెడతామని వివరించారు. మసాజ్ సెంటర్లు, చిరు వ్యాపారుల, పాన్ షాపుల వద్ద అక్రమ వసూళ్లకు పాల్పడొద్దని హైదరాబాద్ సీపీ శ్రీనివాస రెడ్డి సూచించారు. హైదరాబాద్ పోలీసులపై అవినీతి ఆరోపణలు రావడంతో ఈ మేరకు సీపీ స్పందించారు. అవినీతికి పాల్పడిన వారిని గుర్తించి సర్వీస్ నుంచి తొలగిస్తామని వార్నింగ్ ఇచ్చారు. కానిస్టేబుల్ స్థాయి నుంచి అవినీతి ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. ఆ క్రమంలోనే పోలీసుల అవినీతి ఆరోపణలపై సీపీ ఘాటుగా స్పందించారు. సస్పెండ్ చేయడం అంటూ ఉండదని, సర్వీస్ నుంచి తొలగిస్తామని హెచ్చరించారు.



## బంగాళాఖాతంలో అల్పపీడనం
# ఏర్పడే అవకాశం

### రానున్న రోజుల్లో భారీ వర్షాలకు ఛాన్స్



**హైదరాబాద్,ఆగస్ట్26(అక్షరం న్యూస్):**
ఈ నెల 29 నాటికి తూర్పు మధ్య, పరిసర ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పాడే అవకాశం ఉందని.. ఏపీ, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి దిశగా గాలులు వీస్తున్నాయని వాతావరణ కేంద్రం పేర్కొంది. ఈ క్రమంలో తెలంగాణలో రాగల ఐదురోజుల పాటు వర్షాలు కొనసాగే అవకాశాలున్నాయని పేర్కొంది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. 27న భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని తెలిపింది. 28న ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం జిల్లాల్లో వానలు కురుస్తాయని పేర్కొంది. ఈ నెల 29, 30 తేదీల్లో పలుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పింది. ఈ మేరకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.

# యూపిఐ తరహాలో యూఎల్ఐ సేవలు

### డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ జర్నీలో యూఎల్ఐ కీలక భూమిక
### ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత్ దాస్ వెల్లడి

బెంగళూరు,ఆగస్ట్26(ఆర్ఎన్ఎ): యూపీఐ సేవల ద్వారా డిజిటల్ పేమెంట్ వ్యవస్థలో పెను మార్పులకు శ్రీకారం చుట్టిన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మరో కొత్తతరహా సేవలకు నాంది పలకనుంది. రుణాలు తీసుకోవడాన్ని సులభతరం చేయడం కోసం యూనిఫైడ్ లెండింగ్ ఇంటర్‌ఫేస్‌ను జాతీయస్థాయిలో త్వరలో లాంచ్ చేయనుంది. గతేడాదే 'ఫ్రిక్షన్‌లెస్ క్రెడిట్' పేరిట పైలట్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించిన ఆర్‌బీఐ.. అవి సత్ఫలితాలు ఇవ్వడంతో త్వరలో దేశవ్యాప్తంగా సేవలు అందించేందుకు సిద్ధమైంది. డిజిటల్ పేమెంట్ వ్యవస్థలో యూపీఐ ఏవిధమైన పాత్ర పోషిస్తోందో.. రుణ వితరణలో యూఎల్ఐ కూడా అదే పాత్ర పోషించబోతోంది. దేశ డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ జర్నీలో యూఎల్ఐ కీలక భూమిక నిర్వహించబోతోందని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు.



# నిరుద్యోగులకు శుభవార్త

విద్యార్థులను రెచ్చగొట్టి రాజకీయ లబ్ది పొందాలని చూశారని మండిపడ్డారు. 90 రోజుల్లో 30 వేల మందికి నియామక పత్రాలు అందించామని ప్రస్తావించారు. దుక్కల్లాగా ఉన్న బావ, బామర్దులు నిరుద్యోగ యువత కోసం అమరణ నిరాహారదీక్ష చేయాలని రేవంత్ విమర్శిం చారు. మా ప్రభుత్వం కష్టపడి చదువుతున్న విద్యార్థుల కోసం పని చేస్తోంది. పదేళ్లలో అధికారం కోసం పని చేసి ఇవాళ వాళ్లు రాజకీయ నిరుద్యోగులు గా మిగిలిపోయారు. మా కోసం మేము పని చేయము. మా కర్తవ్యం తెలంగాణ సమాజం కోసం కష్టపడి చేయడం అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సెక్రెటరీయేట్‌లో రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం చెక్కుల పంపిణీ కార్యక్రమంలో రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులకు ఈ సాయాన్ని అందజేశారు. మెయిన్స్‌కు అర్హత సాధించిన 135 మందికి రూ.1 లక్ష చొప్పున చెక్కులను పంపిణీ చేశారు. సింగరేణి సంస్థ సాయంతో ఈపథకం కింద సాయం అందించారు. గత ప్రభుత్వ ప్రాధాన్యతలు ఏంటో పదేళ్లు కళ్లారా చూశామని రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. రాష్ట్రం నుంచి ఎక్కువ మంది సివిల్ సర్వెంట్లు కావాలని ఆశిస్తున్నట్టు ఆయన చెప్పారు. సివిల్స్ ఉత్తీర్ణులై రాష్ట్ర ప్రతిష్టను పెంచాలని, మెయిన్స్‌లో ఉత్తీర్ణులైతే మళ్లీ ఆర్థికసాయం చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన వివరించారు. ఇక 2028 ఒలింపిక్స్‌లో తెలంగాణ అథ్లెట్లకు పతకాలు వచ్చేలా కృషి చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. సచివాలయంలోకి ఎవరూ రాకుండా గతంలో పోలీసు పహారా ఉండేదని, గత ప్రభుత్వం నిరుద్యోగుల గురించి ఆలోచన చేయలేదని విమర్శించారు. నైపుణ్యాలు లేకపోవడంతోనే నిరుద్యోగ సమస్య పట్టిపీడిస్తోందని అన్నారు. యంగ్ ఇండియా వర్సిటీ ద్వారా 2 వేల మందికి శిక్షణ ఇస్తామని, యంగ్ ఇండియా వర్సిటీలో ఏటా 20వేల మందికి శిక్షణ ఇస్తామని వెల్లడించారు. వచ్చే విద్యాసంవత్సరంలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ వర్సిటీ ఏర్పాటు చేస్తామని, ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ సిద్ధమవుతాయని అన్నారు. అయితే గత ప్రభుత్వం వర్సిటీలను నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. త్వరలో అన్ని వర్సిటీలకు నూతన వీసీలను నియమిస్తామని సీఎం రేవంత్ తెలిపారు. వర్సిటీల్లోని అన్ని ఖాళీ పోస్టులను త్వరలో భర్తీ చేస్తామని, కొందరు ఉద్దేశపూర్వకంగానే నిరుద్యోగులను రెచ్చగొడుతున్నారని, రాజకీయ లబ్ది కోసమే నిరుద్యోగులను వాడుకుంటున్నారని అన్నారు. ఉద్యోగ అర్హత పరీక్షలను వాయిదా వేస్తే నిరుద్యోగులకే నష్టమని, నిరుద్యోగులు చెప్పింది వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, తమ ప్రాధాన్యత రైతులు, విద్యార్థులేనని రేవంత్ పేర్కొన్నారు.

నిరుద్యోగ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని రేవంత్‌రెడ్డి అన్నారు. 'చదువుకు తగిన నైపుణ్యాలు లేకపోవడంతో చాలా మంది ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 100 నియోజకవర్గాల్లో 25 నుంచి 30 ఎకరాల్లో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటు చేస్తాం.అని రేవంత్‌రెడ్డి అన్నారు. రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం పథకానికి ప్రభుత్వరంగ సంస్థ సింగరేణి కాలరీస్ నిధులు సమకూరుస్తోంది. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ఎంపి రఘురామిరెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సింగరేణి సీఎండీ బలరాం తదితరులు పాల్గొన్నారు.

## హైడ్రా కూల్చివేతలతో
# ఉలిక్కిపాటు

టార్గెట్ చేయాలన్న లక్ష్యంతా విమర్శలకు దిగుతున్నారు. తమపై వచ్చిన అవినీతి ఆరోపణలను పక్కన పెట్టి ఎదురుదాడి రాజకీయాలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిఎంగా కొనసాగితే ఇక తమకు మనుగడ ఉండదన్న భావనలో, భయంలో ఉన్నారు. రాజకీయంగా నిలదొక్కుకోవాలంటే సిఎంగా రేవంత్ రెడ్డి ఉండకూడదన్నదే కెసిఆర్, కెటిఆర్, హరీష్ రావుల పాలసీగా ఉంది. అందుకే ప్రతి చిన్న విషయాన్ని భూతద్దంలో చూసి భయపడుతున్నారు. విమర్శల కు పదను పెడుతున్నారు. ఒకటి తమ అవినీతి, అక్రమాలు బయటపడకుండా చూసుకోవడంతో పాటు... రేవంత్‌పై బురదజల్లే కార్యక్రమాన్ని చేపడుతున్నారు. హైడ్రా కూల్చివేతలను స్వాగతించాల్సిన నేతలు విమర్శలు చేస్తున్నారు. పార్టీ మారడం కోసం పల్లా రాజేశ్వర రెడ్డిని వేధిస్తున్నారని హరీష్ రావు చేసిన విమర్శలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు. పల్లా రాజేశ్వర రెడ్డి కాలేజీ అక్రమంగా ఎందుకు కట్టాడో నిలదీయకుండా సిఎం రేవంత్‌రెడ్డిని నిలదీయడం వారి దౌర్భాగాన్ని సూచిస్తోంది. గత పదేళ్లుగా అక్రమాలను ప్రోత్సహించిన ఆనాటి మంత్రులు ఇప్పుడు కూడా అదే సాగాలని చూస్తున్నారు. అందుకే రేవంత్ సిఎంగా ఉన్నంత కాలం తెలంగాణలో భారత రాష్ట్ర సమితి మనుగడ కష్టమనే భావనలో ఉన్నారు. అందుకే ప్రజా సమస్యలను పక్కన పెట్టిమరీ భారాస నేతలు కేవలం రేవంత్ రెడ్డినే టార్గెట్ చేసుకున్నారు. భారాస శ్రేణులను ప్రేరేపించడానికి, కాంగ్రెస్ శ్రేణులను రెచ్చగొట్టడానికి కెటీఆర్, హరీష్ వంటి వారు వ్యూహ రచన చేస్తున్నారు. రుణమాఫీ పేరుతో ఆందోళనలకు దిగడం, పల్లా రాజేశ్వర రెడ్డిని పక్కన పెట్టుకుని విమర్శలు చేయడం వంటివన్నీ ఇందులో భాగంగానే చూడాలి. ఉద్యమ సమయంలో మాదిరిగా సమయం చూసుకొని కాంగ్రెస్‌లో అవంతర్గత చిచ్చు రాజేయాలని పన్నాగం పన్నుతున్నారని అనిపిస్తోంది. రాజకీయంగా కాంగ్రెస్ పార్టీపై, సంక్షేమం పట్ల ప్రభుత్వం పై పోరాడాల్సిన నైతిక బాధ్యతను భారాస విస్మరించి తమ తప్పులను కప్పిపు÷–చుకునేలా, రేవంత్‌ను తిట్టిపోయడమే లక్ష్యంగా రాజకీయాలు నడుపుతుందనే వాదనలు వస్తున్నాయి. ÷ూష్ట్రంలో అధికారాన్ని కోల్పోయిన భారత రాష్ట్ర సమితి నేతలు రాజకీయ విలువలకు తిలోదకాలు ఇస్తున్నట్టు విమర్శలు వస్తున్నాయి. ప్రతిపక్ష హోదాను తుంగలో తొక్కి, కాంగ్రెస్ ప్రభుత్వంపై కక్ష సాధింపు ధోరణిగా వ్యవహరించడం రాజకీయ పరిశీలకులను ఆశ్చర్య పరు స్తోంది. ప్రజా సమస్యలను అధ్యయనం చేసి, వాటి పరిష్కారానికి పోరాడాల్సిన భారాస నేతలు కేవలం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మాత్రమే టార్గెట్‌గా చేసుకోవడం రాజకీయ ఎత్తుగడలో భాగంగానే చూడాలి. గతంలో మీరే ముఖ్యమంత్రి కావాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఉచిత సలహాలు ఇవ్వడం, ప్రభుత్వం చేపట్టే ప్రతీ కార్యక్రమం పై కొర్రీలు పెట్టే ప్రకటనలు చేయడం, రేవంత్ రెడ్డి ఆయన మంత్రివర్గం పనితీరుపై పనిగట్టుకొని ఊహాజనిత ఆరోపణలు, విమర్శలు చేయడాన్ని సైతం ప్రజలు జీర్ణించుకోలేక పోతున్నారు. కోడిగుడ్డు మీద ఈకలు పీకే రకంగా బిఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారు.కెటీఆర్, హరీష్‌రావు లు అదేపనిగా రెచ్చగొట్టే ప్రకటనలు చేయడం, విమర్శలు చేయడం, మీడియా సమావేశాలు, ట్విట్టర్లు వంటివి ఉపయోగించడం ఈ మధ్య అధికమైంది. మొన్న ఆర్టీసీ బసుల్లో ఆడపడుచులపై కెటీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యాలు కూడా ఆయనలోని అసహనాన్ని బహిర్గతం చేశాయి. అయితే వ్యతిరేకత తీవ్రంగా ఆరవడవం, మహిళా కమిషన్ నోటీసులతో ఒక్కసారిగా నాలుక కరుచుకున్నారు.రైతు రుణమాఫీ చేస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా అంటూ గతంలో హరీష్ రావు ముఖ్యమంత్రికి విసిరిన సవాల్ చేసి భంగపడ్డాడు. కాంగ్రెస్ ప్రభుత్వం మూడు దశల్లో రుణమాఫీ చేసిన సంగతి తెలిసి కూడా దానిపై పెద్ద ఎత్తున తప్పుడు ప్రచారానికి భారాస తెరలేపే ప్రయత్నం చేసింది. రైతుల పేరుతో ఆందోళనలకు దిగింది. కొన్ని ప్రాంతాల్లో ముఖ్యమంత్రి రాజీనామా చేయాలంటూ ఏకంగా ప్లెక్సీలు ఏర్పాటు చేయడం భారాస అసమనానికి పరాకాష్టగా కనిపిస్తోంది. మొన్న రేవంత్ రెడ్డి అధికారిక అమెరికా పర్యటనను కూడా కెటీఆర్ రాజకీయం చేయాలని ప్రయత్నించడం రేవంత్ పై వ్యక్తి గత కక్షకు అద్దం పడుతోందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు కూడా అంగీకరిస్తున్నారు. అంతేకాదు, రేవంత్ రెడ్డి మానసికంగా స్థిరంగా లేరని కేటీఆర్ చేసిన ఘాటైన మాటలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా పరిగణిస్తుంది. భారాస నేతలు చెచ్చిన రెచ్చగొట్టే వ్యాఖ్యలు ఫలితమే సిద్దిపేటలో హరీష్ రావు కార్యాలయంపై దాడిగా చూడాలి. భారాస నేతలు ఈ స్థాయిలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు, కార్యక్రమాలు చేస్తున్నారో అందుకు ధీటుగా కాంగ్రెస్ శ్రేణులు ప్రతిఘటించే చర్యలకు దిగడం నిజంగా ఆందోళన కలిగించే అంశం. ప్రతిపక్షం నుంచి ఇదే పరిస్థితి కొనసాగితే రాష్ట్రంలో రాజకీయ వాతావరణం ఏమో గానీ శాంతి భద్రతలకు భంగం వాటిల్లే ప్రమాదం ఉంది. ఏతావాతా రాజకీయాల్లో ఇప్పుడు సిఎంగా రేవంత్ ఉండడాన్ని బిఆర్ఎస్ నేతలు జీర్ణించుకోవడం లేదు. తమ ఉనికికి ముప్పుగా తయారైన రేవంత్‌ను తప్పించే వరకు ఎత్తులు వేస్తూనే ఉంటారు. యాగీ చేస్తూనే ఉంటారు.


### హైడ్రా అంటేనే హడలిపోతున్న ఆక్రమణదారులు

హైడ్రా.. ఇప్పుడు ఈ పేరు వింటే చాలామంది హడలిపోతున్నారు. హైదరాబాద్‌తో పాటు రెండు తెలుగు రాష్ట్రాల్లో దీనిపైనే చర్చ జరుగుతోంది. ఆక్రమణల తొలగింపు పర్వాన్ని హైడ్రా గత కొన్ని వారాల ముందు నుంచే చేపట్టగా.. హీరో నాగార్జునకు చెందిన హైదరాబాద్‌లోని ఎన్ కన్వెన్షన్‌ను కూడా హైడ్రా కూల్చివేయడంతో ఇప్పుడు అందరి దృష్టి దీనిపైనే ఉంది. రాజకీయ పార్టీలు కూడా విభిన్న రీతిలో దీనిపై స్పందిస్తున్నాయి. కాగా హైడ్రా బుల్డోజర్లు ఎప్పుడు తమ కట్టడాలు కూల్చేస్తాయో అని హైదరాబాద్‌లోని చాలా మంది టెన్షన్ పడుతున్నారు. హైడ్రాతో ప్రభుత్వం పొలిటికల్ గేమ్ ఆడుతోందని విపక్షాలు విమర్శిస్తుంటే.. ఎన్ని ఒత్తిళ్లు ఉన్నా.. తగ్గేదేలే అని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తేల్చేశారు. అటు ఆక్రమణల తొలగింపునకు హైడ్రా చేపడుతున్న కూల్చివేతలకు కొన్ని వర్గాల నుంచి మద్ధతు లభిస్తోంది. కెసిఆర్ హయాంలోనే ఎన్ కన్వెషన్ కూలుస్తారని అనుకున్నారు. కానీ ఏదో మతలబు జరగడంతో ఆగిపోయింది. నాగార్జున కూడా ఇక తనకు ధోకా లేదని,కెసిఆర్‌తో అంటకాగారు. ఈ క్రమంలో ఇప్పుడు హైడ్రా నిర్ణయాలపై రాష్ట్ర వ్యాప్తంగా మద్దతు లభిసతోంది. ఎవరు ఆక్రమణ దారులైనా చర్యలు తీసుకోండని ప్రజల్లో సానూకూలత వస్తుంది. రేవంత్ సర్కార్ నిర్ణయాలకు ప్రజలు జేజేలు పలుకుతున్నారు.

ఈ క్రమంలో హైడ్రాకు మద్దతుగా గండిపేట వెల్ఫేర్ సొసైటీ సపోర్ట్ వాక్ నిర్వహించింది. ఈ సపోర్ట్ వాక్‌లో హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ప్రజలు మద్దతు తెలిపారు. ఈ వాక్‌లో భారీగా స్థానికులు, విద్యార్థులు, యువత, సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు. చెరువులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ మనది హైడ్రా మనందరిదీ అనే నినాదాలు చేశారు. హైదరాబాద్ లో అక్రమకట్టడాలను హైడ్రా కూల్చివేస్తుండటంతో.. అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారి గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. తమ కట్టడాలను కూడా కూల్చివేస్తారా? అని భయపడుతున్నారు. హీరో నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ సెంటర్ తోపాటు పలువురి అక్రమకట్టడాలను హైడ్రా అధికారులు కూల్చివేశారు. దీంతో సోషల్ మీడియాలో హైడ్రా కూల్చివేతలపై పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. చెరువులను కబ్జా పెట్టి నిర్మించారంటూ పలువురు.. అక్రమ నిర్మాణాలకు సంబంధించిన వీడియోలను పోస్ట్ చేస్తున్నారు. ఇందులో ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసికి చెందిన బిల్డింగ్‌లు కూడా ఉన్నాయి. బండ్లగూడలోని ఫాతిమా ఒవైసీ కాలేజీని హైడ్రా కూల్చివేస్తుందని వార్తలు వస్తుండటంతో ఆయన స్పందించారు. 'పేదలకు ఉచిత విద్యనందించేందుకు 12 బిల్డింగ్‌లు నిర్మించా. కొందరు వీటిపై వక్రదృష్టి పెట్టారు. గతంలో నాపై కాల్పులు జరిగాయి. కావాలంటే మళ్లీ బు÷–లలెట్ల వర్షం కురిపించండి. కత్తులతో దాడి చేయండి. కానీ పేదల విద్యాభివృద్ధి కృషికి అడ్డుపడ కండి' అని అక్బరుద్దీన్ ఒవైసీ తీవ్రంగా స్పందించారు. ఇక, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డిలు తమ కాలేజీలను చెరువులను కబ్జాచేసి కట్టారని ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ క్రమంలో వాటిని కూడా హైడ్రా కూల్చివేసేందుకు సిద్ధమైతున్నట్లు సమాచారం. ఎవరు ఎంత ఒత్తిడి తెచ్చినా చెరువులు అక్రమించిన వారి భరతం పడతామని సిఎం రేవంత్ రెడ్డి కూడా స్పష్టం చేశారు. అధర్మం ఓడాలంటే యుద్ధం త ప్పదన్న కృష్ణుడి మాటలు తనకు స్ఫూర్తినిచ్చాయని సిఎం రేవంత్ రెడ్డి చెప్పారు. శ్రీకృష్ణ భగవానుడి బోధనానుసారం చెరువులను కాపాడుతున్నామని ఆయన తెలిపారు. మహానగరంలో చెరువులను చెరబట్టిన వారిపై ఉక్కుపాదం మోపుతున్నామని సిఎం రేవంత్ వెల్లడించారు. నిజాం ఆనాడే హైదరాబాద్‌ను లేక్ సిటీగా గుర్తించి గొలుసుకట్టు చెరువుల నిర్మాణాలు చేపట్టారని సిఎం రేవంత్ తెలిపారు. కరువు వచ్చిన సమయంలో గండిపేట, ఉస్మా న్ సాగర్ హైదరాబాద్ దాహార్తిని తీర్చుతున్నాయని, కానీ, కొందరు ధనవంతులు చెరువుల పక్కనే ఫాంహౌస్‌లు కట్టుకొని, ఆ నాలాలు గండిపేటలో కలిపారని, ఇప్పుడు వాటిని తాగునీటిగా ఉపయోగించేందుకు ఇబ్బందిగా మారిందని సిఎం రేవంత్ తెలిపారు. అలాంటి అక్రమ నిర్మాణాలను వదిలేస్తే ప్రజా ప్రతినిధిగా తాను విఫలమైనట్లేనని, అందుకే ఎవరు ఎంత ఒత్తిడి చేసినా మిత్రులకు ఫాంహౌజ్ లు ఉన్నా హైడ్రా అనే సంస్థను ఏర్పాటు చేసి, చెరువులను ఆక్రమించిన వారిపై ఉక్కుపాదం మోపుతున్నామని సిఎం రేవంత్ అన్నారు. ప్రకృతి విధ్వంసం చేస్తే ప్రకృతి విలయం ఎలా ఉంటుందో చూస్తున్నామ ని, ఇప్పటికే చెన్నై ఉత్తరాఖండ్, వయనాడ్‌లలో ఏం జరిగిందో చూశామని ఆయన గుర్తుచేశారు. హైదరాబాద్ ను రక్షించుకోవాల్సిన బాధ్యత మన పై ఉందని, ఇందులో భాగంగానే చెరువులను రక్షణను ప్రభుత్వం బాధ్యతగా తీసుకుందని, ఎవరు ఎంత ఒత్తిడి తెచ్చినా చెరువులు అక్రమించిన వారి భరతం పడతామని సిఎం హెచ్చరించారు. ఇకపోతే హైడ్రా తీసుకున్న చర్యలు, కాపాడిన భూముల వివరాలతో కూడిన నివేదిక ప్రభుత్వానికి చేరింది. గత రెండు నెలల నుంచి చెరువుల్లో, పార్కుల్లో, ప్రభుత్వ భూముల్లో చేపట్టిన కూల్చివేతలు, కాపాడిన భూముల వివరాలను ఆ నివేదికలో వివరించారు. ఆదివారంప్రభుత్వానికి హైడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్ తన నివేదికను అందజేశారు. ఓఆర్ఆర్ పరిధిలోని 8 మునిసిపల్ కార్పొరేషన్‌లు, 20 మునిసిపాలిటీలు, 33 పంచాయతీల పరిధిలో వచ్చిన ఫిర్యాదుల మేరకు 18 చోట్ల కూల్చివేతలు జరిపినట్లు కమిషనర్ వెల్లడించారు. జూన్ 27 నుంచి ఈనెల 24 వరకు చేపట్టిన కూల్చివేతలకు సంబంధించిన వివరాలను నివేదికలో పొందుపరిచారు. కూల్చివేతలు చేపట్టిన 18 ప్రాంతాల్లోని కబ్జాల నుంచి 43.94 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్టు ఆ నివేదికలో తెలిపారు. హైడ్రా తీసుకున్న చర్యల్లో ముఖ్యంగా చెరువుల ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లతో పాటు పార్కు స్థలాలను కబ్జా చేసి చేపట్టిన నిర్మాణాలు ఉన్నాయని, ఇందులో పలువురు రాజకీయ నేతలు, సినీనటులు, క్రీడాకారులు కూడా ఉన్నట్టు హైడ్రా నివేదికలో పేర్కొన్నారు. ఎన్‌ఓసిలు లేవు. అనుమతులు అంతకన్నా లేవు. కోర్టు కేసులు, క్రమబద్ధీకరణ లేకుండానే చెరువులను ఆక్రమించు కోవడం, నిర్మాణాలను చేపట్టడం ఈ చర్యలతో బహిర్గతమైనట్టు తెలిపినట్టు సమాచారం. వచ్చిన ఫిర్యాదులను పరిగణలోకి తీసుకుని, సమగ్రంగా విచారణ చేపట్టిన అనంతరం చర్యలు తీసుకున్నట్టు ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన సందర్భంలో తెలియజేసినట్టు అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. కొందరు కేసులని, అనుమతులు ఉన్నాయని, ఎన్‌ఓసిలు తీసుకున్నామని చెబుతూ వ్యవస్థలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నట్టు రంగనాథ్ తెలిపారనేది సమాచారం. చింతల్ చెరువులో బిఆర్ఎస్ పార్టీకి చెందిన స్థానిక నాయకుడు రత్నాకరం సాయిరాజు అక్రమంగా నిర్మించిన 54 నిర్మాణాలను నేలమట్టం చేసి 3 ఎకరాల 5 గుంటల భూమిని స్వాధీనం చేసుకున్నట్టు ఆ నివేదికలో పొందుపరిచారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని నందగిరిహిల్స్ పార్కు స్థలంలో ఎంఎల్ఎ నాగేందర్ మద్దతుదారుడు ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను తొలగించి 18 గుంటల భూమిని కాపాడినట్టు వెల్లడించారు. ఎంఐఎం పార్టీకి చెందిన బహదూర్‌పురా ఎంఎల్ఎ మహ్మద్ ముబిన్, ఎంఎల్‌సి మిరాజ్ రెహ్మత్ బేగ్‌కు చెందిన రాజేంద్రనగర్ పరిధిలోని శివరాంపల్లి బూమ్‌రుఖ్ ఉద్ దౌలా చెరువులో అక్రమంగా నిర్మించిన ఐదంతస్థుల రెండు భవనాలను, ఒకటి రెండంతస్థుల భవనంతో పాటు మరో భవనాన్ని నేలమట్టం చేసినట్టు రంగనాథ్ తన నివేదికలో వివరించారు. ఈ చెరువు పరిధిలో మొత్తం 46 అక్రమ కట్టడాలను తొలగించడం ద్వారా 12 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనంలోకి తీసుకున్నట్టు పేర్కొన్నారు. గండిపేట్ జలాశయం ఎఫ్‌టిఎల్ పరిధిలోని చిలుకూరు, ఖానాపూర్‌లలో కాంగ్రెస్‌కు చెందిన కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు సోదరుడు పల్లం ఆనంద్, కావేరి సీడ్స్ యజమాని జివి భాస్కర్‌రావు, మంథని అసెంబ్లీ ఎంఎల్‌ఏగా పోటీ చేసిన సునీల్ రెడ్డి, ప్రో కబడ్డీ యజమాని అనుపమ అధికారికంగా అనుమతులు తీసుకోకుండా నిర్మించిన 8 భవనాలు, 14 తాత్కాలిక షెడ్లు, 4 ప్రహరీలను కూల్చివేసినట్టు తెలిపారు. ఈ చర్యలతో ఖానాపూర్, చిల్కూరు ప్రాంతంలో గండిపేట్ జలాశయం ఎఫ్‌టిఎల్ పరిధిలోని 16 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నట్టు హైడ్రా నివేదికలో వివరించారు. మాదాపూర్ తమ్మిడికుంట చెరువులో అనుమతులు లేకుండా ఎఫ్‌టిఎల్ పరిధిలో సినీనటుడు నాగార్జున అక్రమంగా నిర్మించిన ఎన్‌కన్వెన్షన్‌లో రెండు నిర్మాణాలను కూల్చివేసి 4 ఎకరాల 9 గుంటల భూమిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఫిల్మ్‌నగర్ హౌసింగ్ సొసైటీకి చెందిన ప్రదేశంలోని పార్కు స్థలాన్ని ఆక్రమించి చేపట్టిన నిర్మాణాన్ని తొలగించి 16 గుంటల భూమిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. మన్సురాబాద్‌లో 2 గుంటలు, ఎంపి, ఎంఎల్ఎల కాలనీలో 6 గుంటలు, బంజారాహిల్స్ మిథిలానగర్‌లో ఎకరం 4 గుంటలు, ఫిల్మ్‌నగర్‌లోని బిజెఆర్ నగర్‌లో నాలాపై అక్రమంగా నిర్మించిన స్లాబ్‌ను కూల్చేసి 5 ఎకరాలు, గాజులరామారం మహదేవపురం వద్ద ఒక గుంట, గాజుల రామారం భూదేవిహిల్స్‌లో ఎకరం ఒక గుంట, అమీర్‌పేట్‌లో గుంట, చందానగర్ ఈర్ల చెరువులో అక్రమంగా నిర్మిస్తున్న మూడంతస్థుల భవనం ఒకటి, నాలుగు అంతస్థుల భవనాలు రెండు కూల్చేసి 16 గుంటల భూమిని స్వాధీనం చేసుకున్నామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తన నివేదికలో తెలిపారు. బాచుపల్లి ఎర్రకుంటలో 29 గుంటలు, బోడుప్పల్ రెవెన్యూ భూమిలో 3 గుంటల భూమిని స్వాధీనం చేసుకున్నట్టు ఆ నివేదికలో వివరించారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ దుర్వినియోగం
### 17 ఆస్పత్రులపై సీఐడీ కేసులు నమోదు

**హైదరాబాద్,ఆగస్ట్26:**
సీఎంఆర్ఎఫ్ స్కాంలో 17 ఆస్పత్రులపై సీఐడీ కేసులు నమోదు చేసింది. హైదరాబాద్, రంగారెడ్డి, నల్గొండ, కరీంనగర్, మహబూబ్‌బాద్‌లో ఉన్న హాస్పటల్స్‌పై కేసులు నమోదు అయ్యాయి. ఈ ఆస్పత్రులు ఫేక్ బిల్లులు పెట్టి ÷–లక్రైమ్ చేసుకున్నట్లు విచారణలో బయటపడింది. వెరిఫికేషన్‌లో హాస్పిటళ్ల బాగోతం బట్టబయలైంది. గతంలో ఇదే స్కాంలో నలుగురిని సీపీఎస్ పోలీసులు అరెస్ట్ చేసి విషయం తెలిసిందే. రెండు హాస్పిటల్స్ నుంచి 6 లక్షల ఫేక్ బిల్లులను ఆస్పత్రుల నిర్వాహకులు ÷–లక్రైమ్ చేసుకున్నారు. వీరిపై ఫోర్జరీతో పాటు చీటింగ్ కేసులు నమోదు అయ్యాయి. రాష్ట్రంలో సీఎంఆర్ఎఫ్ కుంభోణం తీవ్ర సంచలనం రేపుతోంది. రోగులకు ట్రీట్మెంట్ అందింకుండానే నకిలీ బిల్లులతో సీఎంఆర్ఎఫ్ నిధులను డ్రా చేసుకున్న పలు ఆస్పత్రులు బాగోతాన్ని సీఐడీ గుర్తించింది. రోగులు లేకుండా, వైద్యం చేయకుండా.. కేవలం కాగితాల్లోనే పెద్ద జబ్బులున్నట్లు పేర్కొంటూ తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో సీఎంఆర్ఎఫ్ నిధులను డ్రా చేస్తున్నారంటూ గత ఏడాది రెవెన్యూ శాఖ ఇచ్చిన ఫిర్యాదుతో ఈ స్కాం బయటపడింది. ఈ స్కామ్‌లో ఆసుపత్రుల సిబ్బంది, లోకల్ లీడర్లు, అధికారులు ఉన్నట్టు తెలుస్తోంది. గత ప్రభుత్వం హయాంలో జరిగిన కుంభకోణం వెలుగులోకి రావడంతో.. సీఎం రేవంత్ రెడ్డి సీఐడీ విచారణకు ఆదేశించారు. మొత్తం 17 ఆస్పత్రులపై సీఐడీ కేసులు నమోదు చేసింది.



# సివిల్స్ మెయిన్స్ అభ్యర్థులకు లక్ష సాయం

**హైదరాబాద్,ఆగస్ట్26(అక్షరం న్యూస్):**
సివిల్స్ మెయిన్స్‌కు అర్హత సాధించిన అభ్యర్థులకు తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోంది. రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం పథకం కింద రూ.1 లక్ష ప్రోత్సాహం ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. అందులో భాగంగా సోమవారం నాడు హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయంలో సివిల్స్ ప్రిలిమ్స్ క్వాల్లి÷ అయిన వారికి చెక్కులు అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సివిల్స్ మెయిన్స్ కు అర్హత సాధించిన తెలంగాణ అభ్యర్థులకు రూ.1 లక్ష రూపాయల చెక్కుల్ని అందజేశారు. మొత్తం 135 మంది సివిల్స్ అభ్యర్థులకు సీఎం రేవంత్ చెక్కులు అందజేశారు. ఇందులో 113 మంది పురుష అభ్యర్థులు కాగా, 22 మంది మహిళా అభ్యర్థులు ఉన్నారు. సామాజిక వర్గాల వారీగా చూస్తే.. జనరల్ 21 అభ్యర్థులు, ఓబీసీలు 62 మంది, ఎస్సీలు 19, ఎస్టీలు 33 మంది అభ్యర్థులు సివిల్స్ మెయిన్స్ కు అర్హత సాధించారు. వారికి రాజీవ్ గాంధీ అభయహస్తం పథకం కింద కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక సాయం అందించింది. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఎంపీ రఘురాం రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్, సింగరేణి సీఎండీ బలరాం, ఇతర అధికారులు హాజరయ్యారు. అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలో 14 మంది అభ్యర్థులు, వరంగల్ అర్బన్ నుంచి 12 మందికి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నుంచి 11 మంది, నల్గొండ నుంచి 10 మంది, ఖమ్మంలో 9, కరీంనగర్ నుంచి 8 మంది సివిల్స్ ప్రిలిమ్స్ క్వాల్లి÷ అయ్యారు. కుమురం భీమ్ ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, జోగులాంబ గద్వాల, మెదక్, నారాయణపేట, వికారాబాద్, వనపర్తి జిల్లాల నుంచి ఒక్కొక్కరు సివిల్స్ మెయిన్స్ పరీక్షలకు అర్హత సాధించారు. చాలా జిల్లాల్లో జనరల్ అభ్యర్థులు ఒక్కరు కూడా మెయిన్స్ కు క్వాల్లి÷ కాలేదు. సగం జిల్లాల్లో జనరల్ అభ్యర్థులు ప్రిలిమ్స్ నుంచి మెయిన్స్ కు అర్హత సాధించలేకపోయారు.

## చెరువుల ఆక్రమణలను వదిలేది లేదు

హైడ్రాకు ప్రజల నుండి మంచి స్పందన వస్తుంది.. ప్రభుత్వం చేస్తున్న పనిని రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు హర్శిస్తున్నారన్నారు. ఎవరికైనా అన్యాయం జరిగింది అంటే న్యాయ స్థానాలు ఉన్నాయని అన్నారు. చెరువుల పరిరక్షకులు అందరూ ఎక్కడెక్కడ అక్రమణకు గురయ్యాయో వాటి ఆధారాలు సంబంధిత అధికారులకు ఇవ్వాలన సూచించారు. 33 జిల్లాల్లో ఎక్కడైనా గ్రామాలు, మండలాలు,పట్టణాలు, మున్సిపాలిటీ చెరువులు ప్రభుత్వ స్థలాల్లో అక్రమ కట్టడాల్లో మీకు ఉన్న అవగాహన, ఆలోచనను ప్రభుత్వం దృష్టికి తీసుకురండని పిలుపునిచ్చారు. ప్రజలంతా ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.

## నేడు యాదాద్రికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
### బ్రేక దర్శనాల్లో మార్పులు చేసిన అధికారులు

**హైదరాబాద్,ఆగస్ట్26(అక్షరం న్యూస్):**
తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈ నెల 27వ తేదీన యాదాద్రి పర్యటనకు వెళ్లనున్నారు. ఈ పర్యటనలో భాగంగా శ్రీలక్ష్మీనరసింహ స్వామికి గవర్నర్ ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఈ నేపథ్యంలో యాదాద్రిలో మంగళవారం బ్రేక్ దర్శన వేళల్లో మార్పులు చేస్తున్నట్లు ఆలయ అధికారులు ప్రకటించారు. భక్తుల బ్రేక్ దర్శన సమయం ఉదయం 10 గంటల నుంచి ఉదయం 10.30 గంటలకు మార్చినట్లు పేర్కొన్నారు. అంతరాలయ దర్శన సమయం ఉదయం 9.30 నుంచి ఉదయం 10 గంటలకు మార్చినట్లు తెలిపారు. యాదాద్రి పుణ్యక్షేత్రంలో ప్రతి మంగళవారం స్థానికులకు అంతరాలయ దర్శనం కల్పిస్తున్న సంగతి తెలిసిందే.

# యూపిఐ తరహాలో యూఎల్ఐ సేవలు

బెంగళూరులో నిర్వహించిన ఓ సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆయన దీనిపై మాట్లాడారు. భూ రికార్డులు మొదలుకొని, ఇతర ముఖ్యమైన డిజిటల్ ఇన్ఫర్మేషన్ ఆధారంగా యూఎల్ఐ పనిచేస్తుందని చెప్పారు. దీనివల్ల రుణ ఆమోద ప్రక్రియ సరళతరం కానుందని తెలిపారు. రుణం పొందేందుకు డాక్యుమెంటేషన్ ప్రక్రియ అవసరం ఉండదని శక్తికాంతదాస్ వివరించారు. ముఖ్యంగా ఎంఎస్ఎంఈ, వ్యవసాయ రుణాల జారీ వేగవంతం కానుందని పేర్కొన్నారు. గతేడాది ఆగస్టు 17న ఫ్రిక్షన్‌లెస్ క్రెడిట్ పేరిట పైలట్ ప్రాజెక్ట్‌ను లాంచ్ చేశారు. ఆర్‌బీఐకి చెందిన రిజర్వ్ బ్యాంక్ ఇన్నోవేషన్ హబ్ ద్వారా దీన్ని చేపట్టారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా డిజిటల్ చెల్లింపులు సెకన్లలో జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే భారతదేశంలో రిటైల్ డిజిటల్ చెల్లింపు వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే వచ్చినయూపిఐ చెల్లింపు వ్యవస్థ విజయవంతమైంది.
ఈ నేపథ్యంలో రుణ ఆమోదం వ్యవస్థ క్రమబద్ధీకరించబడుతుందని, తద్వారా చాలా తక్కువ సమయంలో ప్రజలకు రుణాలు ఇవ్వబడతాయన్నారు. తక్కువ మొత్తంలో రుణాలు తీసుకునే వారు దీని వల్ల ఎంతో ప్రయోజనం పొందుతారని గవర్నర్ అన్నారు. పైలట్ ప్రాజెక్ట్ తర్వాత యూనిఫైడ్ లెండింగ్ ఇంటర్‌ఫేస్ ని త్వరలో దేశవ్యాప్తంగా ప్రారంభించనున్నట్లు ఆర్‌బిఐ గవర్నర్ తెలిపారు. ఈ ప్లాట్‌ఫారమ్‌లో బహుళ డేటా ప్రొవైడర్‌లతో పాటు రుణ సంస్థలు వివిధ రాష్ట్రాల భూ రికార్డులను కూడా కలిగి ఉంటాయన్నారు. దీని ద్వారా మరింత డిజిటల్ సమాచారం అందుబాటులో ఉంటుందని శక్తికాంత దాస్ చెప్పారు. దీంతో చిన్న, గ్రామీణ ప్రాంతాల వ్యక్తులకు తక్కువ సమయంలో సులభంగా రుణాలు ఇవ్వవచ్చన్నారు. ఈ వ్యవస్థ ద్వారా భారీ డాక్యుమెంటేషన్ నుంచి బయటపడతారని చెప్పారు. ముఖ్యంగా వ్యవసాయం, ఎంఎస్ఎస్ఈ రంగానికి సంబంధించిన వ్యక్తులు రుణం తీసుకోవాలనుకునే వారికి మంచి ప్రయోజనం చేకూరుతుందని అన్నారు.

## వేర్వేరు ప్రాంతాల్లో పలు విధాలుగా జన్మాష్టమి
### వైష్ణవాలయాల్లో నేడు కృష్ణాష్టమి వేడుకలు



న్యూఢిల్లీ,ఆగస్ట్26: భారతీయ సనాతన ధర్మంలో రాముడు, శివుడు, విష్ణువు, హనుమంతుడు వంటి వివిధ దేవుళ్లను మాత్రమే కాదు కనకదుర్గ, కాళికాదేవి, లక్ష్మీదేవి ఇలా రకరకాల దేవతలను కూడా పూజిస్తారు. వీరిలో శ్రీకృష్ణుడు అత్యంత ప్రీతిపాత్రుడు. చాలా మంది విదేశీయులు కూడా శ్రీకృష్ణునిపై భక్తి విశ్వాశాలను కలిగి ఉంటారు. ఎంతో భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. భగవంతుడిని ఎప్పుడైనా పూజించవచ్చు. అయితే హిందూ మతంలో కొంత మంది దేవుళ్ళను తిథుల ఆధారంగా ప్రత్యేకంగా పూజిస్తారు. ఇందుకు సంబంధించిన కొన్ని ప్రత్యేక పండుగలు ఉన్నాయి. ఉదాహరణకు చైత్రమసంలోని నవమిని శ్రీరామ నవమి అని.. భాద్రపదమాసంలోని చతుర్థిని వినాయక చవితి అని శ్రీ కృష్ణుడి పుట్టిన తిథిని జన్మాష్టమి అని ఇలా చాలా ప్రత్యేకంగా జరుపుకుంటాం. శ్రీకృష్ణుని జన్మదినాన్ని.. కృష్ణ జన్మాష్టమిగా ఘనంగా భక్తులు జరుపు కుంటున్నారు. ఇందులో వైష్ణవాలయాల్లో మంగళవారం జన్మాష్టమిని జరుపుతున్నారు. రోహిణీ నక్షత్రంతో కూడుకున్న అష్టమినే వారు పరిగణనలోకి తీసుకుంటారు. ఈ సందర్భంగా దేశంలోని వివిధ ప్రాంతాల్లో జన్మాష్టమి వేడుకలను ఎంతో హృద్యంగా జరుపుకుంటారు. మధురలోని ప్రతి అణువణువున శ్రీకృష్ణుడు ఉన్నాడని విశ్వాసం. ఇక్కడ జన్మాష్టమి పండుగను రెండు భాగాలుగా జరుపుకుంటారు. మొదటి వేడుకగా ఝులన్ ఉత్సవం, రెండవ ఉత్సవం ఘాట్. ఝులన్ ఉత్సవం సందర్భంగా, మధురలోని ప్రజలు తమ ఇళ్లలో ఊయలలను ఏర్పాటు చేస్తారు. వాటిలో బాలకృష్ణుడి విగ్రహాలను ఉంచుతారు. ఈ ఊయలలో శ్రీకృష్ణుడు ఊగుతూ భక్తులు చేసే సేవలను అందుకుంటాడు.

# గాయత్రి విద్యానికేతన్ లో వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు

**పెద్దపల్లి టౌన్ ఆగస్టు 26 అక్షరం న్యూస్**

శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను పెద్దపల్లి పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్ లో సోమవారం రోజున వైభవంగా నిర్వహించారు ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు చిన్ని కృష్ణుడు గోపికల వేషధారణలో అందంగా ముస్తాబై వచ్చి అందరినీ అలరించారు అనంతరం పలు శ్రీ కృష్ణుని భక్తి గీతాలపై పలువురు చిన్నారులు చేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి ఈ పండగ విశిష్టతను గూర్చి పాఠశాలకు చెందిన 9 వ తరగతి విద్యార్థినులు పూరెళ్ళ హన్విత మరియు చంద్రకారి లయవర్ధిని లు ఇచ్చిన ఉపన్యాసాలు పండగ గొప్పతనని అందరికీ తెలియజేశారు ఈ సందర్భంగా గాయత్రి విద్యా సంస్థల కరస్పాండెంట్ అల్లెంకి రజనీ శ్రీనివాస్ మాట్లాడుతూ ద్వాపర యుగంలో శ్రీముఖ నామ సంవత్సరం శ్రావణం మాసంలో బహుళ అష్టమి నాడు అర్ధరాత్రి రోహిణి నక్షత్రంలో శ్రీకృష్ణుడు జన్మించినట్లు పురాణాలు చెబుతున్నాయి అని తెలిపారు దేవకీ వసుదేవులకు అష్టమ 8వ సంతానంగా శ్రీకృష్ణుడు జన్మించాడని కృష్ణావతారాన్ని శ్రీమహావిష్టువు ఎనిమిదో అవతారంగా పురాణాల్లో చెప్పుకుంటారు అని అన్నారు శ్రీమహావిష్ణువు అవతారాల్లో శ్రీకృష్ణావతారం విశిష్టమైనదని అందుకే కృష్ణ పరమాత్మ ఆవిర్భవించిన దివ్య తిథినే 'కృష్ణాష్టమి'గా జరుపుకుంటారని అన్నారు కృష్ణాష్టమి నాడు కేవలం భగవానుని పూజించడమే కాదు అయనలోని కొన్ని మంచి లక్షణాలని అలవర్చుకోవాలని ప్రతి విషయంలోనూ స్వార్ధం, ఈర్ష్య, అసూయలను కొంతైనా విడనాడి మానవజన్మకు సార్ధకతని ఏర్పరచుకోవాలని శ్రీకృష్ణుడు తన లీలల ద్వారా భక్తులకు జ్ఞానోపదేశం చేశాడు ఆయన చేసిన అన్ని పనులలోను అర్థం పరమార్థం కనిపిస్తాయని ధర్మ పరిరక్షణలో రాగద్వేషాలకు అతీతంగా వ్యవహరించాడు అని తెలిపారు అనంతరం ఏర్పాటు చేసిన ఉట్టి కొట్టే కార్యక్రమం చిన్నారులు కేరింతల




మధ్య ఆహ్లాదభరితంగా సాగింది ఈ కార్యక్రమంలో గాయత్రి విద్యా సంస్థల ఛైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ దంపతులు పాల్గొని పిల్లల్ని ప్రోత్సహిస్తూ ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని తిలకించారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్ ఉపాధ్యాయ బృందం పోషకులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు

# పవిత్ర యజ్ఞం వలే బిజెపి సభ్యత్వ నమోదు చేపట్టాలి

**-ప్రతీ బూతులో 2వందల సభ్యత్వాలు..**
**-సర్పంచ్ ఎన్నికలే లక్ష్యంగా శ్రమించాలి**
**-సిర్పూర్ బిజెపి ఎమ్మెల్యే హరీష్**

**పెద్దపల్లి టౌన్ ఆగస్టు 26 అక్షరం న్యూస్**

నియోజకవర్గంలోని ప్రతీ బూతులో 2వందల సభ్యత్వాలు చేయించేలా బిజెపి శ్రేణులు పని చేయాలని భారతీయ జనతా పార్టీ సిర్పూర్ ఎమ్మెల్యే సభ్యత్వ నమోదు వర్క్ షాప్ జిల్లా ఇంచార్జీ పాల్వాయి హరీష్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు సోమవారం నందన గార్డునులో జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి విచ్చేసిన హరీష్ మాట్లాడుతూ ఒక పవిత్ర యజ్ఞం వలే సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలని తెలిపారు బిజెపి ఒక విభిన్నమైన అలోచన విధానం ప్రత్యేకమైన సిద్ధాంతం కలిగిన పార్టీయని ఇందులో పనిచేసే కార్యకర్తలు దేశహితం ధర్మహితం మాత్రమే చూస్తారని అలాంటి కార్యకర్తలు కేవలం బిజెపిలోనే కనిపిస్తారన్నారు అని అన్నారు ప్రపంచంలో అత్యంత క్రమశిక్షణ గల పార్టీగా గుర్తింపు పొందిన బిజెపిలోకి కొత్తవారిని చేర్పించాలని వారందరికీ సభ్యత్వం కల్పించాలని కోరారు జిల్లాలో 50వేల సభ్యత్వాలు అందుకోవాలన్న హరీష్ అందుకోసం సమయం కేటాయించాలని మార్గ నిర్దేశం చేశారు త్వరలో జరగబోయే సర్పంచ్ ఎన్నికలే లక్ష్యంగా కార్యకర్తలు సభ్యత్వ నమోదులో భాగస్వాములు కావాలాని సూచించారు ఈ సమావేశంలో నాయకులు కందుల సంధ్యారాణి మేరుగు




హన్మంతు గౌడ్ శిలారపు పర్వతాలు క్యాతం వెంకటరమణ పోల్సాని సంపత్ రావు ఒల్లాల తిరుపతి తంగెడ రాజేశ్వర్ రావు కావేటి రాజగోపాల్ సోమారపు లావణ్య దాడి సంతోష్ ఉప్పు కిరణ్ శిలివేరు సంపత్ సోడాబాబు ఈర్ల శంకర్ మల్లారపు అరుణ్ వేల్పుల రమేష్ మోర మనోహర్ పాల్గొన్నారు

# పెద్దపల్లి పట్టణంలో అభివృద్ధి సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు**



**పెద్దపల్లి టౌన్ ఆగస్టు 26 అక్షరం న్యూస్**

పెద్దపల్లి పట్టణ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు తెలిపారు పెద్దపల్లి పట్టణం మసీద్ చౌరస్తా నుండి అమర్ చంద్ విగ్రహం వరకు పైడబజార్ నుండి చాకలి ఐలమ్మ విగ్రహం వరకు రోడ్డు విస్తరణ ఎల్లమ్మ గుండమ్మ చెరువు హనుమాన్ టెంపుల్ చౌరస్తా నుండి ఎల్లమ్మ టెంపుల్ వరకు రోడ్ల నిర్మాణం కోసం జరుగుతున్న పనులపై మున్సిపల్ కమిషనర్ ను అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ పెద్దపల్లి పట్టణంలో అంతర్గత రోడ్లను కలుపుతూ సిసి రోడ్లు అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు వేసే ఆలోచన చేయడం జరుగుతుందని తెలిపారు ప్రధాన రహదారుల వెంట సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేస్తామన్నారు గతంలో మాదిరిగా కాకుండా రోడ్ల నిర్మాణలు డిజిటలైజేషన్ సిస్టంలో వేసేలా చర్యలు తీసుకోవాలని స్థానిక అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు పట్టణంలో ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో ఉంచుకొని రోడ్ల విస్తరణకు చర్యలు చేపడతామన్నారు వచ్చే నెలాఖరులోగా పట్టణంలోని ప్రతి వార్డులో రోడ్లు డ్రైనేజీ నిర్మాణాలు దశల వారిగా ప్రారంభించి త్వరగా పూర్తి చేస్తామని అన్నారు. రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాల్లో నాణ్యత పాటించాలని అధికారులను ఆదేశించారు పెద్దపల్లి పట్టణ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు అభివృద్ధి సంక్షేమమే అజెండాగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కోసం పని చేస్తుందని భరోసా ఇచ్చారు ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంకటేష్ కౌన్సిలర్లు మున్సిపల్ అధికారులు కాంగ్రెస్ నాయకులు పట్టణ ప్రజలు పాల్గొన్నారు

# గ్రామాలను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యం

**సిసి రోడ్ నిర్మాణ శంకుస్థాన కార్యక్రమంలో ఎమ్మెల్యే**

**ఓదెల/పెద్దపల్లి ఆగస్టు 26 (అక్షరం న్యూస్)**

గ్రామాలను అన్ని విధాల అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఎమ్మెల్యే విజయ రమణారావు అన్నారు ఈ సందర్భంగా. ఓదెల మండలంలోని కనగర్తి గ్రామం సమీపంలో కేశవపూర్ లో ఎస్ డి ఎఫ్ నిధుల దాదాపు 5 లక్షలతో అంతర్గత సిసి రోడ్ నిర్మాణ కార్యక్రమానికి సోమవారం శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే చింతకుంట విజయమ్మ రావు

అనంతరం చింతకుంట విజయ రమణారావు స్థానిక నాయకులు ఘనంగా సన్మానం చేశారు అనంతరం ఎమ్మెల్యే విజయ రమణారావు మాట్లాడుతూ రానున్న రోజుల్లో కనపర్తి గ్రామాన్ని అన్ని మౌలికమైన వసతులతో అభివృద్ధి చేస్తానని ఏకకాలంలో రైతుల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అని ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు అన్ని తూచా తప్పకుండా అమలు చేస్తున్నామని రుణమాఫీ పై ఎలాంటి అపోహలు వద్దని ప్రతిపక్షాలు చేసే విమర్శలను నమ్మకూడదని కోరారు రాష్ట్రవ్యాప్తంగా రుణమాఫీ కొన్ని చోట్ల సాంకేతిక లోపాలు వల్ల మరి కొన్నిచోట్ల బ్యాంకులా తప్పిదం వల్ల రైతుల రుణం మాఫీ కాలేదని వాటిని సవరించి పూర్తిస్థాయిలో రుణమాఫీ చేస్తామని రైతులు నిరాశ చెందవద్దని పేర్కొన్నారు హరీష్ రావు కేటీఆర్ తోడు దొంగలు పోటీ పడి ప్రభుత్వాలు విమర్శిస్తున్నారని వారి మాటలను ప్రజలు రైతులు తిప్పికొట్టాలని అన్నారు ఈ కార్యక్రమంలో చైర్మన్ ఆళ్ల సుమన్ రెడ్డి పిట్టల రవి గుండేటి ఐలయ్య యాదవ్ కాటుకూరి సమ్మి రెడ్డి కిందుల సదాశివ్



ముప్పాళ్ళ శంకర్ సొప్పారి రాజయ్య ముదిరాజ్ తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు

# ఖబర్దార్ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు...

**ఎమ్మెల్సీ అయ్యుండి ముఖ్యమంత్రిపై దిగజారి మాట్లాడడం సిగ్గు చేటు**
**ఎమ్మెల్సీగా నువ్వేమీ ఎలగ పెట్టావు**
**తెలంగాణ ఉద్యమంలో ఎంతో మందిని మోసం చేసిన నీచమైన చరిత్ర నీది**
**ఇకనైనా చౌకబారు మాటలు మానుకో**
**కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కంబాల ముసలయ్య**

**మహబూబాబాద్ /బయ్యారం/ఆగష్టు 26/అక్షరం న్యూస్...**

మహబూబాబాద్ జిల్లా,బయ్యారం మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ సెంటర్ ఎరియాలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం మండల అధ్యక్షులు కంబాల ముసలయ్య మాట్లాడుతూ, గత మూడు రోజుల క్రితం ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు,రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని చెప్పుతో కొడతా అనడంపై మండిపడ్డారు. అంతే కాదు ఒక ఎమ్మెల్సీ గా బాధ్యతమైన పదవిలో వుండి రాష్ట్ర ముఖ్యమంత్రి పై అవాకులు చేవాకులు పెల్చడం నీ దిగజారుడు తనానని నిదర్శనమని, నువ్వు ఎమ్మెల్సీవని సోయిమర్చి మాట్లాడడం సిగ్గు చెటని, నువ్వు నీ గత ప్రభుత్వం ఏమి ఎలగ బెట్టిందని, విద్యాసంస్థల అధిపతిగా నువ్వు ఎంత మంది పేద విద్యార్థులకు ఉచితంగా విద్యను అందించ్చినవో చెప్పాలని, ఉద్యమంలో సమయంలో ఎంతో మందిని మోసం చేసిన నీచమైన చరిత్ర నీదిని విమర్శించారు. కేసీఆర్ మెప్పు కోసం రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ని విమర్శించి జిల్లాలో తిరుగితే మా కాంగ్రెస్ కార్యకర్తలు వేల మంది నిన్ను చెప్పులతో కొట్టడం ఖాయమని హెచ్చరించారు. ఇకనైనా ఇలాంటి చౌకబారు మాటలు మానుకోవాలని లేదంటే కాంగ్రెస్ పార్టీ నాయకుల అగ్రహానికి గురికాక తప్పదని హితువు పలికారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు నాయిని శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ వేల్పుల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి ములుకూరి వీరారెడ్డి,సొసైటీ డైరెక్టర్ తిరుమల ప్రభాకర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షురాలు కొండపల్లి లక్ష్మి, మండల అధ్యక్షురాలు తగిర నిర్మలా రెడ్డి, నాగేశ్వరరావు, వెంకటపతి, నాగరాజు, నర్సయ్య, శ్రీధర్, వీరన్న, నాగరాజు, భూక్యా రవి నాయక్, నాగరాజు, సుధాకర్ రెడ్డి, సంపత్, వీరాస్వామి, సైదులు, వెంకట్ రెడ్డి, శ్రీనివాస్, మధుకర్ రాజు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



# హనుమాన్ చాలీసా పారాయణం భక్తులకు ఆహ్వానం...!




**రాజన్న సిరిసిల్ల /వేములవాడ, ఆగస్టు - 26 (అక్షరం న్యూస్):**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని రాజరాజేశ్వర స్వామి వారి అనుబంధ దేవాలయమైన భీమేశ్వరాలయంలో ప్రతి మంగళవారం నిర్వహిస్తున్న సామూహిక హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమం ఈరోజు (మంగళవారం) 50 వ వారం సందర్భంగా 51 సార్లు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణ నిర్వహిస్తున్న సందర్భంగా సమస్త భక్తులకు పట్టణ ప్రజలకు అందరికీ హిందూ ఉత్సవ సమితి సభ్యులు ఆహ్వానాన్ని తెలియజేశారు ఈరోజు సాయంత్రం 4 గంటల నుండి కార్యక్రమం ప్రారంభమవుతుందని కావున భక్తులందరూ భీమేశ్వరాలయానికి అధిక సంఖ్యలో చేరుకొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసి స్వామివారి కృపాకటాక్షాలకు పాత్రులు కాగలరని కోరారు కార్యక్రమానంతరం తీర్థ ప్రసాద వితరణ కలదని సభ్యులు తెలిపారు.

## కారుణ్య నియామకాల ఉత్తర్వుల అందజేత



**రామగిరి (పెద్దపెల్లి జిల్లా) ఆగస్టు 26 అక్షరం న్యూస్:**

రామగుండం-3 ఏరియాలోని వివిధ గనులు, విభాగాలలో విధులు నిర్వహిస్తూ అనారోగ్య కారణాల వల్ల మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన, మృతి చెందిన ఉద్యోగులకు సంబంధించిన 10 మందికి కారుణ్య నియామక ఉద్యోగాల ఉత్తర్వులను సోమవారం జి.ఎం. కార్యాలయంనందు నిర్వహించిన కార్యక్రమంలో ఆర్జీ-3 జీ.ఎం ఎన్.సుధాకర రావు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివినప్పటికీ ప్రభుత్వ ఉద్యోగానికి ఉన్న ప్రాధాన్యతను గుర్తించి సింగరేణి సంస్థలో బదిలీ వర్కర్ ఉద్యోగంలో చేరుతున్నారని, అయితే ఆ స్థాయికి తగ్గట్టుగా పని చేస్తూ, అధికారులు, సూపర్ వైజర్ల ఆదేశాలను పాటిస్తూ అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ, భద్రతతో విధులు నిర్వహించాలని కోరారు. సింగరేణి సంస్థలో ఉద్యోగం రావడం ఒక వరం లాంటిదని, చెడు అలవాట్లకు బానిసై విధులకు గైర్హాజరు కావద్దని, సీనియర్ ఉద్యోగుల దగ్గర క్రమశిక్షణతో పని నేర్చుకొని, కలిసి కట్టుగా పనిచేసి మున్ముందు మంచి పదోన్నతులు సాధించి కుటుంబం తో పాటు సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల ప్రతినిధులు వై.వి.రావు, కోట రవీందర్ రెడ్డి, అధికారుల సంఘం ప్రతినిధి జి.శ్రీనివాస్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, డివైపిఎం వి.సునీల్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కుంగ్ ఫూ మాస్టర్ గగ్గురి దివ్య ఆధ్వర్యంలో విద్యార్థుల ప్రతిభ...!




**రాజన్న సిరిసిల్ల /వేములవాడ, ఆగస్టు - 26 (అక్షరం న్యూస్):**



మొన్నటి రోజున ( 25/8/2024 )కరీంనగర్ లో రెవిన్యూ గార్డెన్స్ నందు ఇంటర్నేషనల్ షాలిన్ కుంగ్ ఫు వారు కుంగ్ ఫు అండ్ కరాటే ఛాంపియన్ చీప్ పోటీలను నిర్వహించారు ఈ పోటీలలో వేములవాడ మాస్టర్ గగ్గురి దివ్యవిద్యార్థులు పాల్గొని పలు బహుమతులను పొందారు ఇందులో 28 మంది విద్యార్థులు పాల్గొనగ 20 మంది బహుమతులు పొందారు వీరిలో సీనియర్ బ్లాక్ బెల్ట్ విభాగంలో లత 1 ఫస్ట్ గోల్డ్ మెడల్ బ్రౌన్ బెల్ట్ విభాగం లో గగ్గురి రోషిని 2 సెకండ్ సిల్వర్ మెడల్ హంసిని 1 గోల్డ్ మెడల్, బాయ్స్ విభాగంలో సాయి తేజ 1 ఫస్ట్ గోల్డ్ మెడల్ ని సాధించారు. కలర్ బెల్ట్స్ విభాగంలో శ్రీనిధి,చరణ్య, నమస్య, మన్విత,మధుమిత, శరత్ చంద్ర, యశ్వంత్ కుమార్, సిధాంత్ లు గోల్డ్ మెడల్స్ ని సాధించారు అలాగే చైతన్య, శ్రీ వైష్ణవి, శ్రీనిధి, రిష్మిక,చరత్ చంద్ర లు సిల్వర్ మెడల్స్ ని శ్రేహన్సీ, భావన,శ్రీ వైష్ణవి, చైతన్యలు బ్రాండియస్ 3 థర్డ్ మెడల్స్ ని సాధించారు వీరిని మాస్టర్స్, వోద్యాల శ్రీనివాస్, మరియు తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు ఎంతో ఘనంగా అభినందించారు.

## సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి...!

**ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు వినతి.**

**రాజన్న సిరిసిల్ల /వేములవాడ, ఆగస్ట్ - 26 ( అక్షరం న్యూస్ )**

: రాజన్న సిరిసిల్ల జిల్లా సమగ్ర శిక్ష జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో వేములవాడ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. గత 15 సంవత్సరాలుగా సమగ్ర శిక్ష వివిధ విభాగాల్లో చాలీచాలని జీతాలు పనిచేస్తున్నామని తెలిపారు. గతంలో కూడా ప్రభుత్వం దృష్టికి సమస్యలను పరిష్కరించాలని చాలాసార్లు విన్నవించినప్పటికీ పరిష్కారం కాలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సమగ్ర శిక్షలో వివిధ విభాగాలలో పనిచేస్తున్న ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. సానుకూలంగా స్పందించిన ఆది శ్రీనివాస్ కచ్చితంగా సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానని సమగ్ర శిక్ష ఉద్యోగులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా సిఆర్పిల సంఘం అధ్యక్షులు దేవేందర్, ప్రధాన కార్యదర్శి ఉపేందర్, ఉపాధ్యక్షులు ఆకుల శ్రీనివాస్, సభ్యులు మల్లేశం, వెంకటస్వామి, చందన్, లక్ష్మీపతి, రవి, రవికిరణ్, దేవరాజు, వినయ్, రాజేశ్వర్రావు తదితరులు పాల్గొన్నారు.



# హైడ్రాకు పెరుగుతున్న మద్దతు

### బిఆర్ఎస్ విమర్శలపై మండిపడ్డ కోదండరెడ్డి
### రాష్ట్రవ్యాప్తంగా ఆక్రమణలు కూల్చేయాలన్న నేతలు



**హైదరాబాద్,ఆగస్ట్26(అక్షరం న్యూస్):**
హైడ్రాకు రోజురోజుకూ మద్దతు పెరుగుతోంది. అటు పొలిటికల్‌గా.. ఇటు సామాన్యుల నుంచి మద్దతు పెద్ద ఎత్తున వస్తోంది. ముఖ్యంగా ఎన్ కన్వెన్షన్ కూల్చివేత హైడ్రాకు కావల్సినంత మద్దతును కూడగట్టింది. అన్ని వర్గాల ప్రజలు దీనిపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. హైడ్రాపై సొంత పార్టీలో ఇబ్బందులు వస్తాయని తొలుత సీఎం రేవంత్ రెడ్డి భావించారు. కానీ ఎమ్మెల్యేలంతా రేవంత్ నిర్ణయానికి మద్దతు పలుకుతున్నారు. తెలంగాణ సర్కార్ హైడ్రాను ఏర్పాటు చేసి చెరువులు, కుంటలు, నాలాలు రక్షిస్తోందని కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ... దూరదృష్టితో హైడ్రాను ఏర్పాటు చేసిందన్నారు. రాజకీయాలకు అతీతంగా హైడ్రా పనిచేస్తుందని తెలిపారు. ప్రొటెక్షన్ ఆఫ్ లేక్స్ కమిటీ కూడా గతంలో వేసిందే అని చెప్పుకొచ్చారు.
రాష్ట్ర విభజన కాకముంటే కాంగ్రెస్ సర్కార్ 2030 వరకు హెచ్ఎమ్‌డీఏ ద్వారా మాస్టర్ ప్లాన్ రూపొందించిందన్నారు.తాగునీటి అవసరాల కోసం కూడా మాస్టర్ ప్లాన్‌లో లేక్స్ ప్రొటెక్షన్ చేయాలని నిర్ణయం తీసుకుందన్నారు. 2014 నుంచి అధికారంలో ఉన్న బీఆర్ఎస్ అక్రమ నిర్మాణాలకుమద్దతు చేసిందని ఆరోపించారు. హైడ్రా ఏర్పాటు చేసి ప్రజల మన్నన్నలు పొందుతున్న సీఎం రేవంత్‌పై ఎంఐఎం, బీఆర్ఎస్ నేతలు అడ్డగోలుగా విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. సామాన్య ప్రజలు పూర్తిగా మద్దతు ఇస్తున్నారన్నారు. ప్రజలు కూడా ర్యాలీ చేస్తున్నారన్నారు. హుస్సేన్ సాగర్ కాపాడుకోవాలని విజయభాస్కర్ రెడ్డి కాలంలో బుద్ధపూర్ణిమ ప్రాజెక్టు, నెక్లస్ రోడ్ ఏర్పాటైందన్నారు. తొమ్మిదన్నరేళ్ల కాలంలో చెరువులను ఎందుకు కాపాడలేదని హరీష్ రావును కోందండరెడ్డి ప్రశ్నించారు. కేవలం ప్రభుత్వంపై విమర్శలు చేయడమే బిఆర్ఎస్ లక్ష్యంగా ఉందన్నారు. ప్రకృతిని కాపాడడానికి చెరువులు కాపాడాలన్నారు. హైదరాబాద్‌కు తాగునీటి అవసరాల కోసం కృష్ణ, గోదావరి నీటిని తీసుకొచ్చిందన్నారు. కాంగ్రెస్ సర్కారే రానున్న 30 ఏళ్ల వరకు తాగునీటి కోసం మాస్టర్ ప్లాన్ రూపొందించారని తెలిపారు. ధర్మం కోసం భగవత్ గీతను కూడా స్ఫూర్తిగా తీసుకున్నా అని సీఎం రేవంత్ నిన్న చెప్పారన్నారు. హెచ్ఎండీలో అధికారులు అవినీతికి పాల్పడుతున్నారని కోదండరెడ్డి వ్యాఖ్యలు చేశారు. ఇకపోతే హైడ్రా లాంటి వ్యవస్థను రాష్ట్రమంతటా విస్తారించాలని రేవంత్‌కి ఎమ్మెల్యేలు విజ్ఞప్తి చేస్తున్నారు. హైడ్రాపై అభినందనలు తెలుపుతూ రేవంత్‌కి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, విప్ అడ్లూరి లక్ష్మణ్‌లు లేఖ రాశారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో హైడ్రా తరహా వ్యవస్థ కోసం సీఎం రేవంత్‌కి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ లేఖ రాశారు. వేములవాడ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే రమేష్ బాబు ఎఫ్‌టీఎల్ పరిధిలో గెస్ట్ హౌజ్ కట్టాడని ఆది శ్రీనివాస్ లేఖలో పేర్కొన్నారు. హైడ్రాను తమ నియోజకవర్గంలో కూడా విస్తరించాలని సీఎం రేవంత్ రెడ్డికి షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రిక్వెస్ట్ చేశారు. నకిరేకల్ నియోజకవర్గంలో కూడా ఆక్రమణకు గురైన భూములను కాపాడాలని వేముల వీరేశం లేఖ రాశారు. ఆలేరు నియోజకవర్గంలో ఆక్రమణకు గురైన భూములు, అక్రమ కట్టడాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని సీఎంకి ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య లేఖ రాశారు. తమ నియోజకవర్గంలో హైడ్రా లాంటి వ్యవస్థను తీసుకు రావాలని మానుకొండూర్ కవ్వంపల్లి సత్యనారాయణ, ఎమ్మెల్యే కాలే యాదయ్య, తదితరులు రేవంత్‌కి లేఖ రాశారు. కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి జ్ఞాన సుందర్ గాంధీ భవన్‌లో మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి హైట్ కొలవగలరేమో కానీ ఆయన ఆత్మవిశ్వాసాన్ని కొలవలేరని కొనియాడారు. పేదవాడిని కొట్టడం తప్ప, పెద్ద వాళ్ళకి వ్యతిరేకంగా ఏ ప్రభుత్వం పోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఎవరికీ భయపడకుండా ముందుకి పోతోందన్నారు. హైడ్రాకి ప్రజల మద్దతు ఉందన్నారు. తెలంగాణ అంతటా హైడ్రా లాంటి వ్యవస్థను విస్తరించాలని కోరారు. రేవంత్ ఆలోచనకి ప్రతిపక్షాల మైండ్ బ్లాంక్ అవుతోందన్నారు. గత ప్రభుత్వంలో అధికారులు బీఆర్ఎస్ నాయకులు చెప్పినట్టు విన్నారని.. అందుకే ఫేక్ పట్టాలు పొందగలిగారని జ్ఞాన సుందర్ పేర్కొన్నారు. అయితే నగరంలో హైడ్రా మాత్రం నాన్ స్టాప్‌గా కూల్చివేతలు నిర్వహిస్తోంది. శేర్లింగంపల్లి మండలం రాయదుర్గంలో ప్రభుత్వ భూముల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తోంది. రాయదుర్గం సర్వేనెంబర్ 72లో ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు వెలిశాయి. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేతలు చేపట్టారు. భారీగా పోలీసుల మోహరించారు. కూల్చివేతలను స్థానికులు అడ్డుకుంటున్నారు.

# పాకిస్థాన్‌లో ఉగ్రవాదుల కిరాతకం

### ప్రయాణికులపై దుండగుల కాల్పులు
### 23 మంది దుర్మరణం చెందినట్లు గుర్తింపు

లాహోర్,ఆగస్ట్26: పాకిస్థాన్‌లో దారుణం చోటుచేసుకుంది. కొందరు సాయుధులు రహదారిని అడ్డగించి, వాహనాల నుంచి ప్రయాణికుల్ని కిందికి దింపేసి కాల్పులు జరిపారు. బలూచిస్థాన్ లోని ముసాఖెల్ జిల్లాలో సోమవారం జరిగిన ఘటనలో 23 మంది ప్రాణాలు కోల్పోయారని డాన్ మీడియా సంస్థ వెల్లడించింది ముసాఖెల్ జిల్లాలోని రరాషమ్‌లోని రహదారిపై ఈ ఘటన చోటుచేసుకుంది. కొందరు సాయుధులు దారిని అడ్డగించి, అటుగా వస్తోన్న బస్సులు, ట్రక్కుల్లో నుంచి ప్రయాణికుల్ని దింపి, వారి గుర్తింపు తనిఖీ చేశారు. తర్వాత వారిపై కాల్పులు జరపడంతో 23 మంది మృతి చెందారు. అంతేగాకుండా వాహనాలకు నిప్పుపెట్టారు. పాక్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌కు చెందిన ప్రయాణికులే లక్ష్యంగా ఈ దాడి జరిగినట్లు మీడియా పేర్కొంది. పోలీసు ఉన్నతాధికారులు కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించారు. బలూచిస్థాన్ ముఖ్యమంత్రి సర్ఫరాజ్ బుగ్టీ ఈ దాడిని తీవ్రంగా ఖండించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గతంలోనూ ఈ తరహా ఘటనలు చోటుచేసుకున్నాయి. గతేడాది అక్టోబర్‌లో పంజాబ్‌కు చెందిన ఆరుగురు కూలీలను గుర్తుతెలియని సాయుధులు కాల్చి చంపారు. బలూచిస్థాన్‌లోని కెచ్ జిల్లాలో ఆ దారుణం చోటుచేసుకుంది. అవి లక్షిత హత్యలని అప్పట్లో పోలీసులు పేర్కొన్నారు. 2015లో జరిగిన ఘటనలో 20 మంది నిర్మాణ రంగ కార్మికులు కన్నుమూశారు.

# రాష్ట్రంలో ఊరూవాడా కృష్ణాష్టమి

### ఇస్కాన్ టెంపుల్లో అంగరంగ వైభంగా వేడుకలు
### 108 పదార్థాలతో నైవేద్యాల సమర్పణ



విజయవాడ,ఆగస్ట్26: దేశ వ్యాప్తంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ప్రతి సంవత్సరం శ్రావణమాసం కృష్ణ పక్షంలోని ఎనిమిదవ తిథి నాడు రోహిణి నక్షత్రంలో శ్రీకృష్ణుడు దేవకీ మాత అష్టమ గర్భాన జన్మించాడు. కాబట్టి ఈ రోజున శ్రీకృష్ణ జన్మాష్టమిని జరుపుకుంటారు. ఈ వేడుకల కోసం ఆలయాలన్నీ అందంగా ముస్తాబయ్యాయి. విద్యుద్దీప కాంతుల నడుమ మెరుస్తున్నాయి. శ్రీకృష్ణ జన్మాష్టమి అనగానే మనకు గుర్తొచ్చేవి కన్నయ్య జన్మించిన మధుర, బృందావనం. అయితే దక్షిణాదిలోనూ జన్మాష్టమి వేడుకలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. కర్ణాటకలోని ఉడిపిలో కన్నయ్య జన్మదిన వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహిస్తారు. ఇక ఇస్కాన్ టెంపుల్ ఎక్కడుంటే అక్కడ జన్మదిన వేడుకలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. విజయవాడలోని ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇస్కాన్ టెంపుల్‌లో కొలువైన రాధా కృష్ణులను దర్శించుకునేందుకు తండోపతండాలుగా భక్తులు తరలివస్తున్నారు. మూడు రోజుల పాటు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఇస్కాన్ టెంపుల్ నిర్వహించనుంది. ఆగస్టు 25 ,26, 27 తేదీలలో శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించనున్నారు. ఆదివారం నుంచే వివిధ కార్యక్రమాలతో ఈ వేడుకలు ప్రారంభమయ్యాయి. 108 రకాల నైవేద్యాలతో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. రాధాకృష్ణులకి 2వేల కిలోలతో పుష్పాభిషేకం నిర్వహించారు. అలాగు ఇస్కాన్ దేవాలయంలో పంచామృతాలతో కలశ అభిషేకాలను సైతం కన్నయ్యకు నిర్వహించారు. జిల్లాస్థాయిలో కళాశాల విద్యార్థులతో ఉట్టి మహోత్సవ కాంపిటేషన్‌ను విజయవాడ ఇస్కాన్ టెంపుల్ నిర్వహించనుంది. రాధాకృష్ణ ఉట్టి మహోత్సవ కాంపిటీషన్‌లో గెలుపొందిన విజేతలకు ఎంపీ కేశినేని శివనాథ్ చిన్ని చేతుల మీదుగా ఇస్కాన్ యాజమాన్యం బహుమతులు అందించనుంది. కృష్ణాష్టమి సందర్భంగా ఇంద్రకీలాద్రి అమ్మవారి ఆలయంలో సాయంత్రం ఉట్టి వేడుకలు జరుగనున్నాయి. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా విజయవాడలో ఆలయాలలో రద్దీ నెలకొంది. ఇక జన్మాష్టమి రోజున ఉపవాసం ఉండటం వల్ల జీవితంలోని అన్ని కష్టాలు తొలగిపోతాయని భక్తులు నమ్ముతారు. అలాగే జన్మాష్టమి రోజున కొన్ని పరిహారం చేయడం వల్ల శ్రీకృష్ణుడు, లక్ష్మీదేవి అనుగ్రహం లభిస్తుందని విశ్వాసం. ఈ రోజు ఉపవాసంతో పాటు పరిహారాలు చేయడం వల్ల అన్ని సమస్యలు తొలగిపోతాయట.

# తెలంగాణలో వాతావరణ మార్పులు


### వైరల్ ఫీవర్స్, డెంగీ జ్వరాల విజృంభణ
### ఇప్పటికే ఆరుగురు మృత్యువాత




**హైదరాబాద్,ఆగస్ట్26(అక్షరం న్యూస్):**
తెలంగాణలో వాతావరణ మార్పులతో వైరల్ ఫీవర్స్, డెంగీ జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఆస్పత్రులకు రోగులు క్యూ కడుతున్నారు. వైరల్ ఫీవర్స్‌తో ఒకే రోజు ఆరుగురు ప్రాణాలు కోల్పోవడం ఆందోళన కలిగిస్తోంది. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం గంగాదేవిపాడు గ్రామంలో ఈడుపుగంటి సామ్రాజ్యం (67) అనే మహిళకు వారం కింద జ్వరం రావడంతో ఆస్పత్రిలో చేరారు. అక్కడి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. అటు, ఇదే మండలం బ్రహ్మళకుంటకు చెందిన బానోతు కృష్ణ (50)కు వారం కింద ప్లేట్‌లెట్స్ పడిపోవడంతో కల్లూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. రెండు రోజుల కిందటే ఇంటికి వచ్చి పొలం వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రాణాలు కోల్పోయాడు. అలాగే, కామారెడ్డి – సదాశివనగర్ మండలంలోని భూంపల్లికి చెందిన మనస్విని (11)కి జ్వరం రాగా కుటుంబ సభ్యులు కామారెడ్డి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలించాలని వైద్యులు సూచించారు. ఈ క్రమంలోనే హైదరాబాద్ తీసుకొస్తుండగా మార్గమధ్యలోనే ప్రాణాలు కోల్పోయింది. అటు, ఇదే కామారెడ్డి – సదాశివనగర్‌లో నరేశ్ (29) అనే వ్యక్తి డెంగీతో మృతి చెందాడు. అలాగే, కరీంనగర్ – ధర్మారం మండలం నందిమేడారం గ్రామానికి చెందిన నేరెళ్ల ప్రశాంత్ (26) జ్వరంతో ప్రాణాలు కోల్పోయాడు. ఇతను స్థానికంగా చికిత్స తీసుకున్నా తగ్గకపోవడంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకున్నాడు. ఈ క్రమంలోనే తీవ్ర అస్వస్థతకు గురి కాగా కరీంనగర్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే చనిపోయాడు. మరోవైపు, మహబూబాబాద్ – కొత్తగూడ మండలం హనుమాన్ తండాలో రాజేందర్, సంధ్య దంపతులు హైదరాబాద్‌లో కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ దంపతులు కుమార్తెకు 5 రోజుల కిందటే జ్వరం వచ్చి తగ్గింది. స్వగ్రామంలో పని ఉందని కూతురితో కలిసి వెళ్తుండగా.. దారిలో జ్వరం ఎక్కువై ఫిట్స్ వచ్చింది. ఈ క్రమంలోనే ఆమెను నర్సంపేటకు తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే చనిపోయినట్లు తల్లిదండ్రులు తెలిపారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వైరల్ ఫీవర్స్, డెంగీ జ్వరాలతో రోగులు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. ఇదే అదనుగా కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులు ప్రతి జ్వరాన్ని డెంగీ అని చెప్పి చికిత్స కోసం భారీగా వసూలు చేస్తున్నాయి. ఈ క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు హెచ్చరిస్తున్నారు. పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. 'డెంగీ ఉదయం పూట కుట్టే ఏడిస్ దోమల ద్వారా వ్యాపించే ఓ సాధారణ జ్వరం. ఇది కార్బో వైరస్ ద్వారా వ్యాప్తి చెందుతుంది. తీవ్ర జ్వరం, తలనొప్పి, కంటి లోపలి భాగం నొప్పి, వాంతులు, విరేచనాలు, కండరాలు, కీళ్లనొప్పులు, చర్మంపై దద్దుర్లు వంటి లక్షణాలు కన్పిస్తాయి. ప్లేట్ లెట్స్ సంఖ్య తగ్గుతుంది. అవి 20 వేలకు తగ్గినా ఇబ్బంది ఉండదు. తిరిగి అవే వృద్ధి చెందుతాయి. ప్రస్తుత సీజన్‌లో జ్వరాలతో ఎక్కువ మంది ఆస్పత్రులకు వస్తున్నారు. మరికొందరు నిర్లక్ష్యంతో సొంత వైద్యం చేసుకుంటున్నారు. అలా కాకుండా లక్షణాలు కన్పించిన వెంటనే
వైద్యున్ని సంప్రదిస్తే త్వరగా కోలుకునే అవకాశం ఉంటుంది. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి.' అని వైద్యాధికారులూ సూచించారు. మరోవైపు, రాష్ట్రంలో డెంగీ, విష జ్వరాల విజృంభణపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. 'రాష్ట్రంలో డెంగీ మరణాలు లేవని ప్రభుత్వం చెబుతోంది. కానీ ఒక్కరోజులో 5 మంది డెంగీతో చనిపోయినట్లు వార్తాకథనాలు పేర్కొంటున్నాయి. ఈ డేటాను ఎవరు ఎందుకు దాచిపెడు తున్నారని ట్విట్టర్ వేదికగా కేటీఆర్ ప్రశ్నించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరిపడా మందులు లేవని.. చాలా ఆస్పత్రుల్లో ఒక్కో బెడ్‌పై ముగ్గురు, నలుగురు ఉండి ట్రీట్మెంట్ తీసుకుంటున్నారని అన్నారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు.

# హైదరాబాద్ ఐఐటి విద్యార్థుల ప్రతిభ అద్భుతం

### డ్రైవర్‌లెస్ కారును రూపొందించిన విద్యార్థులు
### వారు ఎవరికీ తీసిపోరని ప్రశంసించిన మంత్రి శ్రీధర్ బాబు



సంగారెడ్డి,ఆగస్ట్26: హైదరాబాద్ ఐఐటి విద్యార్థుల ప్రతిభ అద్భుతమని ఐటి శ్శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. వారు ఏదైనా అద్భుతం చేయగల సమర్థులని అన్నారు. ఇతర దేశాల పరిశోధనలకు వారేమీ తీసి పోరని అన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతుంది. డ్రైవర్ లెస్ కార్లు అగ్రరాజ్యం అమెరికాలో ఇప్పటికే అందుబాటులోకి వచ్చాయి. మిగతా దేశాల్లో క్రమంగా అందుబాటులోకి రానున్నాయి. కంది ఐఐటీ క్యాంపస్‌లో విద్యార్థులు డ్రైవర్ లెస్ కారును రూపొందించారు. ఆ కారులో ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు ప్రయాణించారు. కారులో ప్రయాణం మధురానుభూతి కలిగించిందని వివరించారు. 'ఐఐటీ విద్యార్థులు రూపొందించిన డ్రైవర్ లెస్ కారు అద్భుతంగా ఉంది. సిలికాన్ వ్యాలీలో సీఎం రేవంత్ రెడ్డి, నేను డ్రైవర్ లెస్ వెహికిల్‌లో ప్రయాణించాం. ఆ ప్రయాణం కంటే ఈ రోజు చేసిన జర్నీ అద్భుతమైన అనుభూతి కలిగించింది. తెలంగాణ రాష్ట్రంలో ఐఐటీ హైదరాబాద్ రూపొందించిన ఈ టెక్నాలజీ దేశానికి గర్వకారణంగా నిలుస్తోంది. ప్రయోగ దశలో ఉన్న టెక్నాలజీ త్వరలో ఆచరణలోకి రావాలని కోరుకుంటున్నా. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ సేవలను అన్ని రంగాల్లో రావాలని అభిలషిస్తున్నా అని' మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. అమెరికాలో ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఇతర మంత్రులు, ఉన్నతాధికారులు పర్యటించారు. రాష్ట్రంలో పెట్టుబడులు తీసుకొచ్చేందుకు పర్యటన సాగింది. సిలికాన్ వ్యాలీలో సీఎం రేవంత్, మంత్రి శ్రీధర్ బాబు డ్రైవర్ లెస్ కారులో జర్నీ చేశారు. ఆ వీడియోలు సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొట్టాయి. ఆ తర్వాత ఈ రోజు కంది వర్సిటీలో డ్రైవర్ లెస్ కారులో మంత్రి శ్రీధర్ బాబు ప్రయాణించారు. మన విద్యార్థులు రూపొందించిన కారు అద్భుతంగా ఉందని ప్రశంసించారు. ఇక్కడ అద్భుత అనుభూతికి లోనయ్యానని వివరించారు.

# బండ్లగూడ స్కూల్ కూల్చొద్దని వినతి

### కావాలంటే నాపై బుల్లెట్ల వర్షం కురిపించండి
### హైడ్రా చర్యలపై అక్బరుద్దీన్ సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్,ఆగస్ట్26(అక్షరం న్యూస్):**
హైడ్రాపై మజ్లిస్ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ సంచలన వ్యాఖ్యలు చేశారు. బండ్లగూడలో గల ఫాతిమా ఓవైసీ కాలేజీని హైడ్రా కూల్చివేస్తుందనే వార్తలపై స్పందించారు. చెరువు కబ్జా చేసి ఓవైసీ బ్రదర్స్ స్కూల్ నిర్మించారని హైడ్రాకు ఫిర్యాదులు వచ్చాయి. ఆ క్రమంలో అక్బరుద్దీన్ కీలక వ్యాఖ్యలు చేశారు. 'కావాలంటే నాపై మళ్లీ బుల్లెట్ల వర్షం కురిపించండి. ఆ స్కూల్ కూల్చకండి.పేదలకు ఉచిత విద్య అందించేందుకు 12 బిల్డింగులు నిర్మించా. వీటిని కావాలని కొందరు తప్పుగా చూపిస్తున్నారు. గతంలో నాపై కాల్పులు జరిగాయి. కావాలంటే మళ్లీ బుల్లెట్ల వర్షం కురిపించండి. కత్తులతో దాడి చేయండి. పేదల విద్యాభివృద్ధి కృషికి అడ్డుపడకండి అని అక్బరుద్దీన్ సూచించారు.
హైదరాబాద్ పరిసరాల్లో ఇతరులు కబ్జా చేసిన భూముల గురించి ఫిర్యాదులు వస్తున్నాయి. ప్రతిపక్ష నేతలు కూడా ఇదే అంశాన్ని ప్రస్తావిస్తున్నారు. సీఎం రేవంత్.. మీకు దమ్ముంటే ఆ నిర్మాణాలు కూల్చివేయాలని ఓపెన్ ఛాలెంజ్ చేస్తున్నారు. పాతబస్తీలో చెరువులు కబ్జాకు గురయ్యాయని బీజేఎల్పీ నేత మహేశ్వరరెడ్డి గుర్తుచేశారు. ఆ కబ్జాలు తొలగించే దమ్ము సీఎం రేవంత్ రెడ్డికి ఉందా అని అడిగారు. చెరువు కబ్జా చేసి ఓవైసీ కాలేజీ నిర్మించారని గుర్తుచేశారు. ఆ కాలేజీని కూలుస్తారా అని అడిగారు. మజ్లిస్ పార్టీతో కాంగ్రెస్ పార్టీ సఖ్యంగా ఉంటోంది. ఈ క్రమంలో ఓవైసీ కాలేజీని కూలగొడతారా అని మహేశ్వర రెడ్డి ఛాలెంజ్ చేశారు. మహేశ్వర రెడ్డి కామెంట్ చేశారో లేదో.. ఆ వెంటనే అక్బరుద్దీన్ ఓవైసీ స్పందించారు. దయచేసి ఆ స్కూల్ కూల్చొద్దు అని కోరారు. పేద విద్యార్థుల ఆ పాఠశాల వరం లాంటిదని కోరారు. కొందరు కావాలనే తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని మండిపడ్డారు. రాజకీయ వైరంతో తాము నిర్మించిన స్కూల్ కూల్చాలని కోరడం సరికాదు. వేలాది మంది విద్యాబుద్ధులు నేర్చుకునే స్కూల్ నేలమట్టం అయితే వారి బంగారు భవిష్యత్ నాశనం అవుతుందని అభిప్రాయ పడ్డారు. కావాలంటే నన్ను టారగెట్ చేయండి.. అవసరమైతే బుల్లెట్ల వర్షం కురిపించాలని అక్బరుద్దీన్ కోరారు. కొందరు మాపై కక్షగట్టి మరి నోటీసులు ఇస్తున్నారు. మా విద్యా సంస్థలను కూల్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఒకవేళ కూల్చినా కుతుబ్‌మినార్ కంటే ఎత్తైన భవనాలు నిర్మిస్తాం. 40 వేల మంది విద్యార్థులకు ఉచితవిద్య అందజేస్తున్నాం. నాపై కక్ష ఉంటే నన్ను కాల్చండి.. నాపై దాడులు చేయండి. నేను చేస్తున్న మంచి కార్యక్రమాలను మాత్రం అడ్డుకోవద్దు అని' అక్బరుద్దీన్ ఓవైసీ సూచించారు.తాజాగా శేరిలింగంపల్లి మండలం రాయదుర్గంలో ప్రభుత్వ భూముల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలను హైడ్రా అధికారులు కూల్చివేశారు. రాయదుర్గం సర్వే నంబర్ 3, 4, 5, 72లోని ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా కట్టిన భవనాలను కూల్చివేస్తున్నారు. అయితే తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా చర్యలు చేపట్టారంటూ జీహెచ్ఎస్‌సీ టౌన్ ప్లానింగ్ అధికారులను స్థానికులు అడ్డుకున్నారు. తమ ఇళ్లను కూల్చవద్దంటూ ఆందోళనకు దిగారు. అధికారులతో స్థానికులు వాగ్వాదానికి దిగారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అధికారుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి పోలీసులు భారీగా చేరుకున్నారు. పోలీసుల ఆధ్వర్యంలో కూల్చివేతల పర్వం సాగుతోంది.

# బోయిన్‌పల్లి పరిధిలో భారీగా డ్రగ్స్ పట్టివేత

హైదరాబాద్,ఆగస్ట్26(అక్షరం న్యూస్): నగరంలోని బోయిన్‌పల్లి పరిధిలో పోలీసులు భారీగా డ్రగ్స్‌ను పట్టుకున్నారు. రూ. 8.5 కోట్ల విలువైన 8.5 కిలోల ఎఫిటమైన్ డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి కారు, 3 సెల్‌ఫోన్‌ల్లు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం రాత్రి ముగ్గురు వ్యక్తులు జిన్నారం నుంచి ఎఫిటమైన్ డ్రగ్స్‌ను తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వాటిని బోయిన్‌పల్లి మీదుగా సికింద్రాబాద్ ప్యారడైజ్ వద్ద డెలివరీ చేసేందుకు కారులో వెళ్తున్నట్లు హెచ్‌న్యూ(హైదరాబాద్ నార్కోటిక్స్ వింగ్) పోలీసులు గుర్తించారు. బోయినపల్లి పోలీసుల సాయంతో డెయిరీ ఫామ్ రోడ్డు వద్ద నిందితుల వాహనాన్ని అడ్డగించారు. కారు డ్రైవర్ వినోద్, నాగరాజు, శ్రీశైలంను అదుపులోకి తీసుకున్నారు. కారు డిక్కీలో ఉంచిన ఎఫిటమైన్ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు రాజేంద్రనగర్ పోలీసులు డ్రగ్స్ సీజ్ చేశారు. 50 గ్రాముల ఎండీఎంఏ, 25 గ్రాముల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటిని బెంగళూరు నుంచి తీసుకొచ్చి హైదరాబాద్‌లో విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఈ ఘటనలో నైజీరియాకు చెందిన మహిళను అరెస్టు చేశారు. మరో నలుగురు పరారీలో ఉన్నారు. దంపతులతో పాటు మరో ముగ్గురు కలిసి డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు సమాచారం.బోయిన్‌పల్లి వద్ద వాహన తనిఖీల్లో ఎఫిటమైన్ డ్రగ్స్ పట్టుబడిందని హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. ముగ్గురు నిందితుల నుంచి 8.5 కిలోల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. దీనివెనుక ఇంకెవరైనా ఉన్నారా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# కోల్‌కతా వైద్యురాలి హత్యాచారం

### పాలీగ్రాఫ్ పరీక్షలో భిన్న కథనాలు
### తాను వెళ్లేవరకు మరణించిన స్థితిలో డాక్టర్
### నిందితుడు సంజయ్‌రాయ్ వెల్లడించినట్లు కథనాలు

కోల్‌కతా,ఆగస్ట్26: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోల్‌కతా వైద్యురాలిపై హత్యాచార ఘటనలో ప్రధాన నిందితుడు సంజయ్‌రాయ్‌కి ఇటీవల పాలీగ్రాఫ్ పరీక్షలు నిర్వహించారు. జ్యుడీషియల్ కస్టడీలో భాగంగా ప్రస్తుతం అతడు కోల్‌కతాలోని ప్రెసిడెన్సీ జైల్లో ఉండగా అక్కడే ఈ లై డిటెక్టర్ పరీక్ష చేపట్టారు. ఇందులో నిందితుడు ఏం చెప్పారన్న వివరాలను అధికారులు గోప్యంగా ఉంచారు. అయితే, పాలీగ్రాఫ్ పరీక్షలో నిందితుడు అసత్యం, పొంతన లేని సమాధానాలు చెప్పినట్లు తెలుస్తోంది. తాను వెళ్లేసరికే వైద్యురాలు చనిపోయిందని అతడు చెప్పినట్లు సమాచారం. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీలో ఆగస్టు 9న ఈ దారుణం వెలుగుచూసిన సంగతి తెలిసిందే. ఆ మరుసటి రోజే సివిక్ వాలంటీర్ అయిన సంజయ్ రాయ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ప్రస్తుతం కేసును దర్యాప్తు చేస్తున్న సీబీఐ కోర్టు ఆదేశాలతో నిందితుడికి పాలీగ్రాఫ్ పరీక్ష నిర్వహించింది. ఈ పరీక్ష సమయంలో సంజయ్ అనాలోచితంగా, ఆత్రుతగా ఉన్నట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. అధికారులు అడిగిన ప్రశ్నలకు అవాస్తవాలు, సరిపోలని సమాధానాలు చెప్పినట్లు తెలుస్తోంది. దర్యాప్తు బృందం ఆధారాలు చూపించి నప్పుడు.. ఆ సమయంలో తాను అక్కడ లేనని నిందితుడు చెప్పాడట. అంతేగాక, తాను సెమినార్ హాల్‌కు వెళ్లేసరికి వైద్యురాలు అప్పటికే చనిపోయి ఉందని, భయంతో తాను అక్కడి నుంచి పారిపోయానని సంజయ్ చెప్పినట్లు సదరు కథనాలు వెల్లడించాయి. మరోవైపు, నిందితుడికి పాలీగ్రాఫ్ పరీక్ష నిర్వహించే సమయంలో అతడి తరపు డిఫెన్స్ లాయర్ లేకపోవడం చర్చనీయాంశమైంది. దీనిపై న్యాయవాది స్పందిస్తూ.. పరీక్ష ఎక్కడ నిర్వహిస్తామన్నది అధికారులు తమకు ముందస్తు సమాచారం ఇవ్వలేదని, ఇది మానవహక్కుల ఉల్లంఘన కిందకే వస్తుందని ఆరోపించారు. కాగా.. వైద్యురాలిపై అఘాయిత్యానికి పాల్పడింది తానేనంటూ అంతకు ముందు కోల్‌కతా పోలీసుల ఎదుట నిందితుడు నేరం అంగీకరించినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఇటీవల సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీకి చెందిన వైద్యబృందం నిందితుడి మానసిక తీరును విశ్లేషించింది. ఘటన సమయంలో ప్రతీ నిమిషం చోటుచేసుకున్న విషయాలను నిందితుడు గుక్కతిప్పకుండా మొత్తం ఎపిసోడ్‌ను వివరించాడని, అతడిలో పశ్చాత్తాపమే లేనట్లు కన్పించిందని కేసు దర్యాప్తులో పాల్గొన్న ఓ సీబీఐ అధికారి చెప్పినట్లు కథనాలు వెలువడ్డాయి. అయితే, ఆ తర్వాత అతడిని కోర్టులో హాజరుపర్చగా.. సంచలన ఆరోపణలు చేశాడు. తానే తప్పు చేయలేదని, కావాలనే తనను ఇందులో ఇరికించారని న్యాయస్థానంలో కన్నీళ్లు పెట్టుకున్నాడు.

# యువతి న్యాయ పోరాటానికి అండగా మహిళా నాయకులు

## రాష్ట్ర మహిళ కమిషన్ కు పిర్యాదు చేస్తాం..
## కాంగ్రెస్ మహిళ నాయకురాలు స్వరూప



**హనుమకొండ/భీమదేవరపల్లి/ఆగస్టు 26(అక్షరం న్యూస్):** ఒక ఆడబిడ్డను ప్రేమించి సహజీవనం చేసిన వ్యక్తి ఇప్పుడు తప్పించుకునేందుకు ప్రయత్నం చేయడం అన్యాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ములుకనూరు గ్రామానికి చెందిన బొల్లంపల్లి రంజిత్ నన్ను ప్రేమించి, సహజీవనం చేసి అతని తల్లిదండ్రులు అన్నయ్య రాజు మాటలకు లొంగి తనను వదిలించుకోవాలని చూస్తున్నాడని బాధితురాలు చిడిపి చంద్రకళ ఆరోపించారు. గత కొన్ని రోజులుగా రంజిత్ కోసం న్యాయ పోరాటం చేస్తున్నానని చెప్పారు. నాకు, నా పోరాటానికి అండగా ఉండి మద్దతు తెలిపిన మండల దళిత సంఘాల నాయకులకు, మహిళా సంఘాలకు, ప్రజా సంఘాలకు, వివిధ రాజకీయ పార్టీలకు, పోలీసులకు, జర్నలిస్టులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. నేను ఒక ఆడబిడ్డగా సమాజాన్ని, న్యాయస్థానాన్ని, చట్టాన్ని నమ్మి నా పోరాటాన్ని మొదలు పెట్టానని వాపోయింది. అందులో భాగంగా సమాజం, చట్టం నాకు అండగా నిలబడి డబ్బు, బలంతో తన పలుకుబడితో సమాజాన్ని నన్ను బొల్లంపల్లి రంజిత్ మోసం చేశాడని ఆవేదన వ్యక్తం చేసింది. కానీ అంతిమంగా నేను న్యాయస్థానంలో న్యాయ పోరాటం చేసి నన్ను మోసం చేసిన రంజిత్ ను, అతని కుటుంబ సభ్యులకు శిక్షపడేలా చేసి నాలాగా మరే మహిళలకు ఇటువంటి అన్యాయం జరగకుండా సమాజం గుర్తించేలా నా పోరాటం కొనసాగిస్తానని తెలిపింది.

## రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



**జ్యోతి నగర్ ఆగస్టు 26 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్**

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ యాదవ సంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి పురస్కరించుకొని కూరగాయల మార్కెట్ సమీపంలోని సంఘం కార్యాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్, మనాలి టాకుర్ హాజరై పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ కార్యక్రమాలు నిర్వహించారు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి వేడుకలకు గోపు ఐలయ్య యాదవ్, కౌశిక హరి లత లింగస్వామి, మహంకాళి స్వామి బొంతల రాజేష్ సుదర్శన్ పెద్దపల్లి ఏసిపి గజ్జి కృష్ణ యాదవ్ ఎల్లయ్య యాదవ్ తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని యాదవ సంఘం అధ్యక్షులు పాతపల్లి రవికుమార్ ప్రధాన కార్యదర్శి మెండే లింగయ్య యాదవ్ నిర్వహించారు. రాత్రి గోదావరిఖని చౌరస్తాలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఘనంగా ఏర్పాటు చేశారు.

## ఎన్టిపిసిలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



**జ్యోతి నగర్ ఆగస్ట్ 26 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్**

కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఎన్ టి పి సి పారిశ్రామిక ప్రాంతంలోని పలు కాలనీలలో దేవాలయాలలో వైభవంగా వేడుకలు నిర్వహించారు. సోమవారం సాయంత్రం ఎన్ టి పి సి పెర్మనెంట్ టౌన్షిప్ కాలనీలోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో శ్రీకృష్ణుడి విగ్రహానికి ప్రత్యేక అలంకరణ జరిపి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు, కృష్ణుని జన్మదినం సందర్భంగా మహిళలు భక్తి గీతాలు ఆలపిస్తూ భజన కార్యక్రమాలు నిర్వహించారు, ఆలయ పూజారి రుద్రపట్ల శ్రీకాంత్ శర్మ, సతీష్ శర్మలు కమిటీ నాయకులు శ్రీపతిరావు, కొలని కవితా రెడ్డి తో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు, అదేవిధంగా కృష్ణానగర్ కాలనీలోని రాధాకృష్ణ దేవాలయంలో మహిళలు భజనలు భక్తి గీతాలతో పాటు చిన్నారులచే ఉట్టిగొట్టే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు, మాతృ మందిర్ విద్యాలయంలో జరిగిన కృష్ణాష్టమి వేడుకలకు బిజెపి రామగుండం నియోజకవర్గ ఇన్చార్జ్ కందుల సంధ్యారాణి పాల్గొని వేడుకలను ఘనంగా నిర్వహించారు, మేడిపల్లి రోడ్డులో హిందూ వాహిని ఆధ్వర్యంలో కృష్ణాష్టమి సందర్భంగా ఉట్టి కొట్టే కార్యక్రమం ఘనంగా జరిగింది, అదేవిధంగా గౌతమి నగర్ కాలనీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు

## రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన తాడూరి శ్రీమాన్ కు సన్మానం

### సత్కరించిన బులియన్ మార్కెట్, స్వర్ణకార సంఘాలు

### బీసీల చైతన్యానికి ఐక్యతకు కృషి చేసిన నాయకుడు అంటూ పలువురి అభినందన.



**పెద్దపల్లి, ప్రతినిధి ఆగస్టు 26 అక్షరం న్యూస్**

ఆర్ కృష్ణయ్య నాయకత్వంలోని బీసీ సంక్షేమ సంఘానికి రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన తాడూరు శ్రీమాన్ నారాయణ ను సోమవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో స్వర్ణకార సంఘం, వెండి బంగారు వర్తక సంఘాలు ఘనంగా సత్కరించాయి. జిల్లాలో బీసీల ఐక్యత కోసం బీసీల చైతన్యం కోసం విశేష కృషి చేసిన తాడూరికి ఉమ్మడి జిల్లా ఇన్చార్జి బాధితులతో పాటు రాష్ట్ర కార్యదర్శి పదవి కట్టబెట్టిన సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపారు స్థానిక స్వర్ణకార భవన్లో ఏర్పాటుచేసిన సమావేశంలో తాడూరిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ బులియన్ మార్కెట్ అధ్యక్షులు కట్టా సదానందం, పెద్దపల్లి స్వర్ణకార సంఘం అధ్యక్షులు విజయగిరి శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు కట్ట రాజనందం, దురిశెట్టి శ్రీనివాస్, మునిగంటి కృష్ణ కాసర్ల నరసింహా చారి, దేవరకొండ వెంకటేశ్వర్లు, కట్టా శ్రీనివాస్, మడుపు రాజేష్, బస్వ పాత్రని శంకరాచారి సహా సహా స్థానిక మున్సిపాలిటీ కౌన్సిలర్ భూతగడ్డ సంపత్ మాజీ ఎంపీటీసీ సభ్యులు బొడ్డుపల్లి శ్రీనివాస్ ఇంకా పలువురు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల ఇండ్ల స్థలాల హామీ ఎప్పుడు నెరవేరుస్తారు...?

### తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో జర్నలిస్టుల కీలక పాత్ర బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి : యెర్రా కామేష్



**భద్రాద్రి జిల్లా/ కొత్తగూడెం/ ఆగస్టు.26/ అక్షరం న్యూస్**

జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయిస్తామని ఇచ్చిన మాటకు కట్టుబడి వెంటనే నెరవేర్చాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడ్వకేట్ యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో జర్నలిస్టుల పాత్ర కూడా కీలకంగా కొనసాగిందని గుర్తు చేశారు, కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు రాష్ట్రంలో అధికారంలోకి వస్తే వారికి ఇంటి స్థలాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడిచినా ఇంతవరకు ఆ ఊసే ఎత్తడం లేదని, ఇది సరైన పద్ధతి కాదని మండి పడ్డారు. ప్రభుత్వానికీ ప్రజలకు మధ్య వారిదిగా పని చేస్తూ వృత్తి పరంగా అనేక ఒడి దుడుకులు ఎదుర్కొంటున్న విలేకరులు జీత, భత్యాలు లేక కుటుంబాలకు విద్య,వైద్యం అందించలేక ఆర్థికంగా చితికి పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు మంజూరు చేయాలని, లేనిపక్షంలో తమ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోత్ వీరు నాయక్, వంగా రవిశంకర్, వినయ్, బాబీ, మురళి తదితరులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

### ట్రాఫిక్ పోలీస్ స్టేషను సందర్శించిన కొత్తగూడెం డిఎస్పీ : అబ్దుల్ రెహమాన్



**భద్రాద్రి జిల్లా/ కొత్తగూడెం/ ఆగస్టు.26/ అక్షరం న్యూస్**

కొత్తగూడెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ను సోమవారం రోజు డిఎస్పి షేక్ అబ్దుల్ రహమాన్ సందర్శించారు. ఈ సందర్భంగా ముందుగా స్టేషన్ లోని పలు రికార్డులను స్టేషన్ ఆవరణంలోని వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పట్టణంలోని ట్రాఫిక్ పాయింట్లపై ఆరా తీశారు. ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై ప్రత్యేకమైన దృష్టి పెట్టాలని, ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించిన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పట్టణ పరిధిలో ట్రాఫిక్ పాయింట్లు పెంచి, ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉన్నచోట బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా సరైన వాహన పత్రాలు లేక పట్టుబడిన వాహనాలను కోర్టు వారి ఆదేశాల మేరకు వీలైనంత తొందరగా డిస్పోజల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్.ఐ.కె నరేష్, అదనపు ఎస్సై మదర్, ఏఎస్ఐ రఫీ, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా చిన్నారి కష్వి శ్రీ కృష్ణ, గోపిక వేషధారణ

**వికారాబాద్, ఆగస్టు 26,అక్షరం న్యూస్ -**

ఈరోజు శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు సందర్భంగా వికారాబాద్ జిల్లా కేంద్రంలోని సాకేత్ నగర్ లో నివాసం ఉండే సి.సతీష్ కుమార్ తన మనమరాలు చిన్నారి కష్వి ని శ్రీ కృష్ణ మరియు గోపిక వేషధారణలో కుటుంబ సభ్యులు తాతయ్య సి.సతీష్ కుమార్ నాయనమ్మ సి.రంజన కొడుకు శ్రీ సందీప్ కుమార్, కోడలు సి.నిఖిత మరియు తన చిన్న కుమారుడు సి విజయ్ కుమార్ చిన్నారి కష్వి ని అందంగా అలంకరించి శ్రోతలకు, దృశ్యకారులకు కనువిందుగా చేశారు.కష్వి ని అంగ రంగ వైభవంగా అలంకరించి కుటుంబ సభ్యులందరూ ఆనంద పరవశులయ్యారు. చిన్నారి కష్వి ని వేషధారణలో చూడముచ్చటగా కనువిందు చేశారు.శ్రీ కృష్ణ మరియు గోపికవేషధారణలో ఉన్న చిన్నారి కష్వి ని చూసి తాతయ్య, నాయనమ్మ ,కుమారుడు, కోడలు, చిన్న కుమారుడు, కుటుంబ సభ్యులు అందరూ అపురూపంగా చూసుకొని ఆనందం పరవాశులయ్యారు. చుట్టుపక్కల ఇండ్లవారు చిన్నారి కష్వి ని చూసి పరవశించి.శుభాశీస్సులు అందజేశారు.తాతయ్య, సి.సతీష్ కుమార్,నాయనమ్మ సి.రంజన, తన మనవరాలికి దిన దిన ప్రవర్ధమానమై శోభాయమానమై వర్ధిల్లాలని ఆశీర్వచనాలు అందజేశారు.



## ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



**జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్) ఆగస్టు 26:** మండల కేంద్రంలోని అంగ న్వాడీ కేంద్రంలో సోమవారం శ్రీకృష్ణా ష్టమి వేడుకలను ఘనం గా నిర్వహించారు. ఈ సంద ర్భంగా చిన్నారులు చిన్ని కృష్ణుడు, రాధ, గోపిక వేషదా రణలో ఆలరించారు. మన సంస్కృతి సాంప్రదాయాలను తెలుపాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు శ్రీలత, వెంకటలక్ష్మి, సంధ్యారాణి, మౌని క, మంజుల, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పొంగులేటి చొరవతో,ధ్వజస్తంభం పునః ప్రతిష్ట కార్యక్రమాలు...



**మహబూబాబాద్ /గార్ల /ఆగష్టు26/అక్షరం న్యూస్...**

మాజీ ఎంపీ సురేందర్ రెడ్డి, మర్రిగూడెం వేట వెంకటేశ్వర స్వామి ధ్వజస్తంభం విషయంలో, వారి చొరవతో,అమెరికా నుండి ఎన్నో ప్రయాసాల ఓర్చి గుడి విషయంలోచెప్పలేనంత అభివృద్ధికి పాటుబడ్డ, సురేందర్ రెడ్డి,బంధువులైన పులి గోపాల్ రెడ్డి, పులి ప్రమీల రెడ్డి, ఆగస్టు 26 న రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డిని సంప్రదించగా, విషయాలు తెలుసుకొని, సంబంధిత ఎండోమెంట్ అధికారులు, మరియు స్థానిక ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య తో సంప్రదించి విషయాలు తెలుసుకుని ఏదేమైనా ప్రస్తుతం గార్ల శివారు మర్రిగూడెంలోని వేట వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ధ్వజస్తంభ కార్యక్రమాలు సజావుగా నడపాలని,సమస్యలుంటే తదుపరి పరిష్కారం చేసుకోవాలని,తెలియపరచి, ధ్వజస్తంభ కార్యక్రమాలు నడిపించుకోవాలని నడిచేటట్లు చేసుకోవాలని, భక్తుల మనోభావాలు ఇబ్బందుల గురి చేయవద్దని,నిర్ణయించుకున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ని కలిసిన వారు తెలిపారు.మంత్రిని కలిసిన వారిలో పుల్లూరు వెంకట్ రెడ్డి, జరుపుల భీముడు, గుండా వెంకటరెడ్డి, భానోత్ అర్జున,

## విశ్వభారతిలో రాధాకృష్ణుల వేషధారణతో చిన్నారుల సందడి



**జ్యోతి నగర్ ఆగస్టు 26 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్**

శ్రీకృష్ణ జన్మాష్టమి పండుగను పురస్కరించుకొని సోమవారం ఎన్టిపిసి విశ్వభారతి, నవోదయ, సెయింట్ జోసెఫ్ పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ద్వారకామయుడు, లోక రక్షకుడు అయినటువంటి శ్రీ కృష్ణ భగవానుని జన్మదినాన్ని విద్యాసంస్థల్లో శ్రీకృష్ణ విద్యార్థిని విద్యార్థులు శ్రీకృష్ణుని బలరాముని గోపికల వేషధారణతో అలంకరించుకొని పాఠశాలల్లో సందడి చేశారు ఈ సందర్భంగా యాజమాన్యం ఏర్పాటు చేసిన ఉట్లు కొట్టే కార్యక్రమం చిన్నారుల కేరింతల మధ్య చాలా ఘనంగా నిర్వహించారు. తమ చిన్నారుల్ని కృష్ణుని రాధాగోపికల వేషధాలులతో చూసుకుని తల్లిదండ్రులు తమ పిల్లలనే భగవంతునిగా ఊహించుకొని సంతోషించారు. సంస్కృతి సంప్రదాయాలను రాబోయే తరాలకు అందించే ఉద్దేశంతో అన్ని మతాల కార్యక్రమాలు పండుగల, ఉత్సవాల సమయంలో ఏర్పాటు చేస్తున్నామని చైర్మన్ బందారపు యాదగిరి గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వ భారతి స్కూల్ ప్రిన్సిపల్ ప్రవీణ్ కుమార్, నవోదయ హెడ్మాస్టర్ తిరుపతి గౌడ్, సెయింట్ జోసెఫ్ హెడ్మాస్టర్ నోయల్ జెసెఫ్ ఇంకా ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాలు విజయవంతం చేశారు.

## కృష్ణవేణిలో కృష్ణాష్టమి వేడుకలు

**రామగిరి (పెద్దపెల్లి జిల్లా) ఆగస్టు 26 అక్షరం న్యూస్:**

రామగిరి మండలం కల్వచర్ల గ్రామం లో గల కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ఆద్వర్యంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను సాయిబాబా గుడి ఆవరణలో గల శ్రీ రామ-సాయి కళ్యాణ మండపం నందు అంగ రంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు కృష్ణ-గోపిక వేషధారణలో ఆట-పాటలతో అలరించారు మరియు చిన్ని కృష్ణ-గోపిక వేషధారణలో డ్యాన్స్ లు, ఉట్టి కొట్టే కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ చందుపట్ల. తిరుపతి రెడ్డి, ప్రిన్సి పాల్ బర్ల.శ్రీనివాస్, డైరెక్టర్స్ శ్రీధర్ బాబు, అనిల్ కుమార్ రెడ్డి,రంజిత్ రెడ్డి, ఉపాధ్యాయని, ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## ఏరియా సెక్యూరిటి అధికారిగా పదవీ బాధ్యతల స్వీకరణ



**రామగిరి (పెద్దపెల్లి జిల్లా) ఆగస్టు 26 అక్షరం న్యూస్:**

సింగరేణి సంస్థ రామగిరి మండలం సెంటినరీ కాలనీఆర్.జి-3 ఏరియా సెక్యూరిటి అధికారిగా నియమితులైన అబ్దుల్ షబ్బిరుద్దీన్ ఆర్.జి-3 ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.సుధాకరరావు కి రిపోర్ట్ చేసి బాధ్యతలను స్వీకరించారు. అబ్దుల్ షబిరుద్దీన్ ఇంతకు ముందు మణుగూరు ఏరియా సెక్యూరిటి అధికారిగా పనిచేసి ఆర్.జీ -3 ఏరియా కు బదిలీపై వచ్చారు.ఈ సందర్భంగా పలువురు అధికారులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

# ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సి.ఎం. ఆర్.ఎఫ్ చెక్కులు పంపిణి చేసిన రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్

### నియోజకవర్గంలోని ప్రజలకు ఏ ఆపద వచ్చిన నిత్యం అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ..



**జ్యోతి నగర్ ఆగస్టు 26 పెద్దపల్లి జిల్లా అక్షర న్యూస్**

లిరామగుండం మరియు అంతర్గాం మండలం పాలకుర్తి మండలం సంబంధించినలి అనారోగ్యం కారణంగా వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొంది ఆర్థిక సహాయం కింద సి.ఏం సహాయక నిధి చెక్కులను రూ 61, 70000(అరవై ఒక్క లక్ష డెబ్బై వెలు) విలువ గల సి.ఎం.ఆర్.ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులతో కలిసి రామగుండం శాసనసభ్యులు రాజ్ పంపిణీ చేశారు. సి.ఎం.ఆర్.ఎఫ్ చెక్కులు రామగుండం 108 లబ్ధిదారులు , పాలకుర్తి మండలం 32 లబ్ధిదారులు, అంతర్గాం మండలం 30 మంది లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేయడం జరిగింది రామగుండం మండలం మరియు అంతర్గం పాలకుర్తి మండలం చెందిన వారు అనారోగ్యం కారణంగా వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందగా వారికి అయినటువంటి ఖర్చులను సిఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న వారికి రామగుండం రూ.45,00000 ) నలభై అయిదు లక్షలు పాలకుర్తి మండలం (8,76000 ఎనిమిది లక్షల డెబ్బై ఆరువేల మరియు అంతర్గాం మండలం (802000)ఎనిమిది లక్షల రెండు వేలు)(విలువ గల సి.ఎం.ఆర్.ఎఫ్ చెక్కులను పంపిణీ చేయడం జరిగిందిలికాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన ప్రభుత్వంరామగుండం నియోజకవర్గం జరిగే అభివృద్ధి కార్యక్రమాలకు ప్రతి ఒక్కరు కూడా సహకరించాలి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి పథకాన్ని పేదవారికి అందేలా చూడాలని ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ అన్నారు.రామగుండం నియోజకవర్గం లో అర్హులైన ప్రతి ఒక్కరికి కూడా ఇల్లు ఇస్తాం ఎవరు కూడా అధైర్య పడదు ధైర్యంగా ఉండండి అని హామీ ఇచ్చారు.

అని అలాగే గత బి.అర్.ఎస్ ప్రభుత్వం రైతులకు చేసిన రుణమాఫి పెద్ద బోగస్ అని విమర్శించారు..పేదల పక్షాన కొట్లాడే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని రైతులకు ఏకకాలంలో 2 లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేయడం జరిగింది అన్నారు రానివల్ల కూడా వస్తువులలో అందుతుంది అన్నారు 2014 సంవత్సరంలో ఏర్పాటైన బీఆర్ఎస్ గవర్నమెంట్ రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేస్తామని రైతులను మోసం చేసిందని,టిఆర్ఎస్ గవర్నమెంట్ హయాంలో,రైతులు పండించిన వడ్లను రైస్ మిల్లర్లతో కుమ్మక్కై కమిషన్ల రూపంలో రైతుల రక్తాన్ని తాగారని అన్నారు. దేశంలో ఉన్న బిజెపి పార్టీ కూడా ఏ రాష్ట్రంలో ఏకకాలంలో రుణమాఫీ చేయలేదని, అది కాంగ్రెస్ పార్టీకే సాధ్యమైందని అన్నారు. దాదాపు 31 వేల కోట్ల రూపాయలను రైతులకు రుణమాఫీ చేయడం జరిగిందని అన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ చెప్పిన ఆరు గ్యారంటీలను అమలు చేయడం జరుగుతుందని అన్నారు..త్వరలోనే నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇల్లు ఇచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్పొరేటర్లు మాజీ కార్పొరేటర్లు వివిధ విభాగాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.





## వనపట్ల సుబ్బయ్య"అసిపె" దీర్ఘ కావ్యం పుస్తాకవిష్కరణ.

**నాగర్ కర్నూల్ ఆగష్టు 26(అక్షరం న్యూస్)**

ప్రముఖ కవి వనపట్ల సుబ్బయ్య రచించిన" అసిపె " దీర్ఘ కావ్యాన్ని ఆయన తండ్రి గారైన బాలయ్య సోమవారం కవి స్వగ్రామం నాగర్ కర్నూల్ మండల పరిదిలోని వనపట్ల గ్రామంలో ఆవిష్కరించారు. (అసిపె అంటే మంగలి పొది, క్షవరం పెట్టె)అసిపె దీర్ఘకావ్యంలో మంగలివృత్తి గురించి రాసిన సమగ్ర కావ్యం.క్షవరం,వాయిద్యం,వైద్యం,మంత్రసానిగా వివిధ సేవలందించిన మంగళ్ల సాధకబాధకాలను ఏ కరువు పెడుతూ, సమాజంలో మంగళ్లు చేసిన అనేక సేవలను వివరించే కావ్యం. ఒక వృత్తి జీవితాన్ని ఒక కులం ఎదుర్కొన్న సంక్షోభ పరిస్థితులను ఒకే కవితలో వ్యక్తపరచడం గొప్పగా ఉంది. మంగళ్ల ఆత్మ గౌరవాన్ని సంస్కృతిని ప్రతిధ్వనిస్తూ, కులవృత్తి జీవన చరిత్రను కవిత్వంగా రాయడం,వివిధ కోణాల్లోంచి వివిధ ఉద్యమల్లో మంగలి వారిపాత్రను,నాదస్వర సంగీత ప్రాశస్త్యాన్ని సమగ్రంగా కవిత రాయడమే గాకుండా తరతరాలుగా హక్కులుగా రావలసిన వాటాలను ప్రభుత్వాలు తీసుకోవలసిన చర్యలను రాయడం అభినందనీయమని కార్యక్రమంలో పాల్గొన్న పలువురు కవులు అన్నారు.అసిపె దీర్ఘకావ్యాన్ని బాలయ్యకు అంకితమిచ్చారు. ఈ కార్యక్రమంలో కందికొండ మోహన్ ,మన్యపురెడ్డి హెచ్ రమేష్ బాబు,వహీద్ ఖాన్ , ఎదిరెపల్లి కాశన్న ,ముచ్చర్ల దినకర్.వెన్నచెర్ల సుబ్బయ్య మొల్గర చిన్నకృష్ణ,నర్సింహ్మ,సుదాకర్,గొడుగు బాలపీరు,శ్రీనువాసులు సిద్దూ రేణుక తదితరులు పాల్గొన్నారు.

## సిపి శ్రీనివాస్ ను కలిసిన తార ఆర్ట్స్ అకాడమీ సభ్యులు

### కృతజ్ఞతలు తెలిపి, జ్ఞాపిక అందజేత



**జ్యోతి నగర్ ఆగస్టు 26 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్**

రామగుండం పోలీస్ కమీషనర్ ఎం.శ్రీనివాస్ ను తార ఆర్ట్స్ అకాడమీ సభ్యులు సోమవారం కమీషనరేట్ కార్యాలయంలోని ఆయన ఛాంబర్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల ఎన్టిపిసి టిటిఎస్ లోని ఈడిసీలో తాము నిర్వహించిన జాతీయస్థాయి కళోత్సవాలు, 'నల్లవజ్రం' పురస్కార ప్రదానోత్సవానికి సహకరించినందుకుగాను కృతజ్ఞతలు తెలిపారు. శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. తమ సంస్థ ఆధ్వర్యంలో అక్టోబర్ లో లక్షద్వీప్ లో నిర్వహించబోయే 'భారత్ నృత్యోత్సవ్' కు అతిథిగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సంకె రాజేష్, కళోత్సవాల నిర్వహణ కమిటీ సభ్యులు మేకల శ్రీధర్ యాదవ్, కే.స్వామి, మేజిక్ రాజా, చంద్రపాల్, గోలివాడ ప్రసన్న కుమార్, ఏ.ఆర్ ఎసిపి సి.ప్రతాప్, సిఐ ఎస్.మల్లేశం ఉన్నారు. అలాగే అనివార్య కారణాలతో కార్యక్రమానికి హాజరు కాలేకపోయిన అవార్డు గ్రహీతలు మాదాసి రామ్మూర్తి, బల్మూరి అమరేందర్ రావు, చంద్రపాల్, జే.సత్యనారాయణ, చిలుముల శంకర్, ఇంజం సాంబశివరావుకు 'నల్లవజ్రం' పురస్కారాలను అందజేశారు.

## మాతృ మందిర్ లో ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు....!

### ముఖ్య అతిథులుగా బిజేపి రామగుండం ఇంచార్జి కందుల సంధ్యారాణి..



**జ్యోతి నగర్ ఆగస్టు 26 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్**

కృష్ణాష్టమి పండుగను పురస్కరించుకుని సోమవారం కృష్ణానగర్ మాత్రుమందిర్ మరియు సరస్వతి శిశు మందిరం లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు.ఈ కార్యక్రమానికి రామగుండం బిజేపి నాయకులు కందుల సంధ్యారాణి ముఖ్య అతిథులుగా హాజరై, జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు... శ్రీకృష్ణుని లీలలకు సంబంధించిన పలు రకాల పాటలు, పద్యాలు చిన్నారులు పాడారు. విద్యార్థులు ఉట్టి కొట్టే కార్యక్రమంలో కందుల సంధ్యారాణి ఉత్సాహంగా పాల్గొ న్నారు..ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.....కృష్ణాష్టమి వేడుక చాలా విశిష్టమైన చరిత్ర గలదని శ్రీకృష్ణుని తల్లి ప్రేమకు నిర్వచనం గా ప్రేమ ఆప్యాయతకు ప్రతిబింబమని అన్నారు.శ్రీకృష్ణుని చిలిపి చేష్టలు ఆలోచింపజేస్తాయని ఆనందాన్ని వెదజల్లుతాయని శ్రీకృష్ణ జన్మ వృత్తాంతం చాలా కీలకమైన ఘట్టమని వివరించారు. ధర్మ పోరాటానికి శ్రీకృష్ణుడు చేసిన కృషి నేటికీ నిదర్శనం అని తెలియజేశారు...ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటుగా విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు....

## బాలికల ఆశ్రమ పాఠశాల నందు ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు..

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా / దమ్మపేట మండలం/ ఆగస్టు 26/ అక్షరం న్యూస్ :-**

దమ్మపేట మండల పరిధిలోని అంకంపాలెం లో గల ప్రభుత్వబాలికల ఉన్నత పాఠశాల నందు సోమవారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ప్రధానోపాధ్యాయురాలు శారద ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా, స్కూల్ హెచ్ఎం బాలికలకు శ్రీకృష్ణ, గోపికల యొక్క వేషధారణ లు వేయించి ప్రత్యేక ఆకర్షణగా నిలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యా యురాలు శారదా మాట్లాడుతూ పాఠశాలలోని విద్యార్థినులు నా బిడ్డలతో సమానమని వారికి శ్రీకృష్ణుని యొక్క వృత్తాంతాన్ని తెలియజేశానని ఈ వేషధారణలో పిల్లలు ఎంతో పులకించిపోయారని, రాబోవు రోజులలో విద్యార్థినిలకు ఆధ్యాత్మిక, నైతిక విలువల గురించి, ప్రత్యేక శిక్షణా తరగతులు ఏర్పాటు చేసి విద్యతోపాటు దైవభక్తిని కూడా తెలియపరుస్తానని ఆమె తెలియజేశారు.కృష్ణాష్టమి వేడుకలలో పాఠశాల విద్యార్థిని లు, పాఠశాల సిబ్బందిపాల్గొన్నారు.



# విద్యుత్ ప్రమాదాల పట్ల ఉద్యోగులకు సిబ్బందికి అవగాహన

## సూపెరింటెండింగ్ ఇంజనీర్ బొంకూరి సుదర్శన్



**పెద్దపల్లి టౌన్ ఆగస్టు 26 అక్షరం న్యూస్**

నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ పరిధిలోని పెద్దపల్లి సర్కిల్ పరిధిలో విద్యుత్ ప్రమాదాల పట్ల సిబ్బందికి అవగహన కల్పిస్తూ వారికి సేఫ్టీ పరికరాలు అందిస్తున్నామని సూపెరింటెండింగ్ ఇంజనీర్ బొంకూరి సుదర్శన్ తెలిపారు ఈ సందర్భంగా ఒక ప్రకటన విడుదల చేశారు ఓ%డ%యం ఉద్యోగులు భద్రతా పట్ల అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని ఎప్పటికప్పుడు సూచనలు జారీ చేస్తూ వారికి భద్రత పరికరాలు అందచేస్తున్నామని తెలిపారు విద్యుత్ ప్రమాదాలను నివారించడానికి క్షేత్ర స్థాయిలో పనిచేసే ఉద్యోగులందరూ ఈ క్రింది నివారణ చర్యలు తీసుకోవాలని కోరారు సెక్షన్ ఇంఛార్జి ప్రతిరోజూ 15 నిమిషాలు పనికి ముందు భద్రతా చర్యల గురించి సిబ్బందితో చర్చించాలని అనుమతి కలిగిన అధికారి తగిన జాగ్రత్తతో మాత్రమే లైన్ క్లియర్ ఇవ్వాలి ఫోన్ ద్వారా లైన్ క్లియర్లను ఇవ్వడాన్ని నివారించాలి అన్నారు విధుల్లో ఉన్న ఎస్ఎల్ఐ/ఎల్ఐ బ్రేక్ డౌన్ వర్క్ లొకేషన్ వద్ద ఉండాలని మరియు లైన్ డిశ్చార్జ్ చేయబడిందని మరియు పనిని నిర్వహించడానికి సురక్షితంగా ఉండేలా చూసుకోవాలి అని తెలిపారు ఫీల్డ్ సిబ్బందికి అన్ని భద్రతా పరికరాలను అందుబాటులో ఉంచాలి అని తప్పనిసరిగా వినియోగించేటట్లు చేయాలన్నారు హెచ్ టి/ఎల్టి లైన్ల పనిని ప్రారంభించే ముందు చేతి తొడుగులు ఎర్త్ డిశ్చార్జ్ రాడ్ మరియు వోల్టేజ్ డిటెక్టర్ తప్పనిసరిగా తీసుకెళ్లాలని మరియు తప్పనిసరిగా వినియోగించేటట్లు చేయాలని లైన్ సమీపంలో వోల్టేజ్ డిటెక్టర్ను ఉంచడం మరియు ఎర్త్ డిశ్చార్జ్ రాడ్ ను తాకడం ద్వారా లైన్ డెడ్ గా ఉందని నిర్ధారించుకోవాలి అని అన్నారు లైన్కు రెండు వైపులా సరైన ఎర్తింగ్ కోసం అన్ని దశల్లో ఎర్త్ డిశ్చార్జ్ రాడ్ ను ఉపయోగించాలి అని అన్నారు 33 కేవి 11 కేవి లైన్ యొక్క సింగిల్ లైన్ నమూనా రేఖ చిత్రాన్ని ప్రతి సెక్షన్ ఆఫీసు వద్ద ఏబి స్విచ్ డబుల్ పాయింట్ ఆఫ్ సప్లై హెచ్ టి, లైన్ క్రాసింగ్ లొకేషన్ను సూచిస్తూ ప్రదర్శించాలని మరియు ప్రతి సిబ్బందికి వద్ద ఒక కాపీని అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు బ్రేకర్లు మరియు రిలేల యొక్క సరైన పనితీరును నిర్ధారించడం మరియు విశ్వసనీయ రక్షణ కోసం ఫీడర్ మరియు ఎల్వి బ్రేకర్స్ రిలేలలో తగిన ఈ/ఎల్ %డ% ఓ/ఎల్ సెట్టింగ్లను మార్చాలి అన్నారు సెక్షన్ ఆఫీసర్ మరియు సబ్ డివిజన్ ఆఫీసర్ ఏడిఈ వద్ద బ్రేక్ డౌన్ల సమాచారం మరియు నిర్వహణ పనులు చేసిన ఫీల్డ్ సిబ్బంది పేర్లు ఉండాలన్నారు మెయింటెనెన్స్ అవుట్ వర్క్ జరుగుతున్న చోట సెక్షన్ ఆఫీసర్ ఏడీఈ ఆకస్మిక తనిఖీ చేయాలని మరియు భద్రతా ప్రక్రియలో ఏదైనా ఉల్లంఘన ఉన్నట్లు గుర్తించినట్లయితే చర్యలను తీసుకోవాలని డివిజనల్ ఇంజనీర్/టెక్నికల్/ సర్కిల్ ఆఫీస్ నోడల్ సేఫ్టీ ఆఫీసర్ ఓ%డ%యం సిబ్బంది భద్రతా నిబంధనలకు లోబడి పనిచేస్తున్నారో లేదో ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని తెలిపారు టీజీ ఎన్పీడీసీఎల్ లో తాజా ప్రమాణాల భద్రతా విధానాలతో ఉద్యోగులకు తగు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తూ సిబ్బందికి అన్ని రకాల భద్రత పరికరాలు అనగా హెల్మెట్ గ్లోవ్స్ పోర్టబుల్ ఎర్తింగ్ షార్ట్ సర్క్యూట్ కిట్లు సేఫ్టీ షూస్ ఇన్సులేటెడ్ టూల్స్ వోల్టేజ్ డిటెక్టర్ మొదలైనవి అందచేస్తూ వారికీ నియమిత కాల వ్యవధిలో సమీక్షలు నిర్వహిస్తూన్నామని తెలిపారు విద్యుత్ ప్రమాదాలను నివారించడానికి ఫీల్డ్ సిబ్బంది నుండి సీనియర్ అధికారుల వరకు ఉద్యోగులందరి నుండి సమిష్టి కృషి అవసరమని సమర్థవంతంగా తగ్గించడానికి అన్ని అంశాలలో భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడం చాలా ముఖ్యమని అన్నారు నిరంతర శిక్షణ మరియు భద్రతా పద్ధతులను బలోపేతం చేయడం వలన సంస్థలోని భద్రతా ప్రమాణాలను పెంచగలుగుతున్నామని తెలిపారు.

## దమ్మపేట మండలంలో విస్తృత పర్యటన చేసిన ఎమ్మెల్యే జారే..





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ దమ్మపేట మండలం/ ఆగస్టు 26/ అక్షరం న్యూస్ :- దమ్మపేట మండలంలో అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ సోమవారం విస్తృతంగా పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా మండల పరిధిలోని పెద్ద గొల్లగూడెం బాలికల పాఠశాలను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పాఠశాల యొక్క విద్యార్థులకు వడ్డించే భోజనం యొక్క మెనూ ఆయన స్వయంగా సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందించే ఆహార నియమావళి పిల్లలకుసక్రమంగా అందించాలని, ఎటువంటి లోటుపాట్లు రాకుండా చూసుకోవాలని ఆయన అధ్యాపకు సూచించారు. అంతేకాకుండా విద్యను అభ్యసించే విద్యార్థినులకు ఎటువంటి లోటుపాట్లు రాకుండా చూసుకోవాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే స్వయంగా పాఠశాలలోని పిల్లలతో మమేకమై ముచ్చటించారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు పట్టివేత



**రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /ఆగస్ట్ -26(అక్షరం న్యూస్ )**

ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ముస్తాబాద్ ఎస్ఐ గణేష్ ఒక ప్రకటన లో తెలిపారు.అవునూర్ మానేరు వాగు నుండి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు ను మోహిని కుంట వద్ద ఉదయం పట్టుకున్నట్లు ఎస్ ఐ ఒక ప్రకటన లో తెలిపారు. రవాణా చేస్తున్న పులి రాకేష్,రేసు ప్రశాంత్,బొంపల్లి భాస్కర్,ఈర్ల నరేష్ లను అరెస్ట్ చేసి వారిని రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు ట్రాక్టర్ల ను సిజ్ చేసినట్లు తెలిపారు. అక్రమ ఇసుక రవాణాను సహించేది లేదని, నిబంధనలు ఉల్లంఘించి ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు

## విద్యార్థులే ఆపద్బాంధవులయ్యారు కష్టకాలంలో ఓదార్పుతో పాటు భరోసానిస్తున్న స్నేహితులు రాజన్న



**సిరిసిల్ల / ముస్తాబాద్/ ఆగస్టు- 26 (అక్షరం న్యూస్ )**

2001-2002 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు తమతో చదువుకున్న ఒక సహచరుని కుటుంబంలో బాధను పంచుకొని ఆ కుటుంబానికి ఆర్థిక సాయం అందించి మానవత్వం చాటుకున్నారు.. ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామానికి చెందిన ఎం డీ రంజాన్ తండ్రి ఇటీవల మృతి చెందాడు.. దింతో పాటు రంజాన్ భార్య, తల్లి ఇద్దరు కూడా అనారోగ్యం పాలయ్యారు. వారి ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న పూర్వ విద్యార్థులు తమ వంతుగా సహాయం చేయాలని ముందుకు వచ్చితల ఇంత పోగు చేసి వారి ఇంటికి వెళ్లి ధైర్యం చెప్పి మేమున్నామని భరోసా ఇచ్చి రూ 27800 రూపాయలు ఆర్థిక సహాయం అందించారు తమలో తమకే కాదు వారి కుటుంబంలో ఎవరికి కష్టమొచ్చినా అందరు కలిసి అండగా నిలుద్దామని సంకేతాలిచ్చారు రంజాన్ మిత్రులు. స్నేహితుల ఔదార్యానికి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో తాజా మాజీ ఎంపీటీసీ కొండని బాలకిషన్, మురికి భాను చందర్, నవీన్, కంచం శ్రీనివాస్, జంగా బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

### ఏఐటీయూసీ కార్యదర్శి కే. చందు యాదవ్



**మాదాపూర్ ఆగస్టు 26 అక్షరం న్యూస్ ప్రతినిధి**

శ్రీకృష్ణ జన్మాష్టమి పురస్కరించుకొని మాదాపూర్ డివిజన్లో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. చిన్నారులతో చిన్ని కృష్ణుని వేషధారణలతో అలరించారు. చందు యాదవ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భగవద్గీత గీత సారాంశం చదివి జ్ఞానం పెంచుకోవాలని, శ్రీకృష్ణుడు సాక్షాత్తు శ్రీమన్నారాయణ అవతారం ఎత్తి మనుషులు ధర్మం వైపు నిలిచే విధంగా మార్గదర్శకం చేశారు అని చందు యాదవ్ అన్నారు. ఈ వేడుకలలో చందు యాదవ్, రాధాకృష్ణ యాదవ్, మహిపాల్ యాదవ్, సూర్యనారాయణ, బాలరాజ్, శశిధర్, బ్రహ్మయ్య, సత్యనారాయణ, నాగరాజు, విష్ణు వీర కేశవల్లు పలువురు పాల్గొన్నారు.

## కృష్ణాష్టమి వేడుకల్లోపాల్గొన్న కార్పొరేటర్ షాపురం శ్రీనివాస్‌రెడ్డి



**రంగారెడ్డి / రాజేంద్రనగర్ / గండిపేట్ / ఆగస్టు 26/ అక్షరం న్యూస్ :**

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ షాపురం పుష్ప శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు టింకు రెడ్డి కుమార్తె గోపికగా అలంకరించారు. దీంతో చిన్నారి గోపికల చేసిన చిలిపిచేష్టలు అందరినీ ఎంతో ఆకట్టుకున్నాయి.

## ఖమ్మం కలెక్టర్ ఆఫీస్ వద్ద జరిగే మహాధర్నాను జయప్రదం చేయండి...



**ఖమ్మం/ తల్లాడ ఆగస్టు 26 (అక్షరంన్యూస్)**

తెలంగాణ రైతు సంఘం తల్లాడ మండల కార్యదర్శి నల్లమోతు మోహన్ రావు దొడ్డ కృష్ణయ్య భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రైతు సంఘం ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ ఆఫీస్ వద్ద ది 27 08 2024 మంగళవారం ఉదయం 10 గంటలకు షరతులు లేని రెండు లక్షల రుణమాఫీ కోరుతూ జరిగే ధర్నాను జయప్రదం చేయటానికి తల్లాడ మండలంలోని రుణమాఫీ కానీ రైతులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మండలం లోని సగం మంది రైతులకు ఇంతవరకు రుణమాఫీ కాలేదు ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీలో రుణమాఫీ పథకం ఉందని అప్పు ఉన్న ప్రతి రైతుకు రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తామని తమ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చిన ఫలితంగా గత పది సంవత్సరాల నుండి బీఆర్ఎస్ ప్రభుత్వం రుణమాఫీ సక్రమమైన పద్ధతిలో చేయకపోవడం వలన కాంగ్రెస్ పార్టీ కీ ఓట్లు వేసి గెలిపించే అధికారంలోకి తీసుకు వచ్చిన రైతాంగానికి ఈ ప్రభుత్వం కూడా మోసం చేసే ప్రయత్నం చేస్తుందని తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులందరూ రుణమాఫీ కోసం కలిసి పోరాడి 31 రకాల నిబంధనలను తొలగించి రుణమాఫీ పొందటం కోసం ప్రభుత్వం పై పోరాటాల ద్వారా ఒత్తిడి తెచ్చి సాధించుకోవాలని పిలుపునిచ్చారు.

## ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

### - పాల్గొన్న కౌన్సిలర్ ఉషారాణి



**రంగారెడ్డి / రాజేంద్రనగర్ / గండిపేట్ / ఆగస్టు 26/ అక్షరం న్యూస్ :**

చదువుతో పాటు మన పండుగల విశిష్టతను భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని నార్సింగ్ మున్సిపాలిటీ 17వ వార్డు కౌన్సిలర్ ఉషారాణి అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని నాగార్జున గ్రూప్ ఆఫ్ స్కూల్స్ విద్యానికేతల్లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కౌన్సిలర్ ఉషారాణి గండిపేట్ మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అశోక్ యాదవ్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉషారాణి మాట్లాడుతూ.. పిల్లలకు మానవతా విలువలు నేర్పాలని సూచించారు. కార్పొరేట్ విద్యను నేర్పాలని ఉద్దేశంతో విద్యార్థులను ఒత్తిడి చేయకుండా వారికి విషయ పరిజ్ఞానాన్ని అందించాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఫాన్సీ డ్రెస్ కాంపిటీషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గెలుపొందిన వారికి ప్రిన్సిపల్ నీరజ సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పూర్ణిమ భరత్ కుమార్, ప్రిన్సిపల్ నీరజ తదితరులు పాల్గొన్నారు.

## సంజీవయ్య ఆశయాలను కొనసాగిస్తాం ..



**ఖమ్మం/తల్లాడ ఆగస్టు 26 (అక్షరంన్యూస్)**

తల్లాడ మండలం గోపాలపేటలో కొమ్మినేని సంజీవయ్య ఆరవ వర్ధంతి సభ గోపాలపేట సిపిఎం శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్తూపం వద్ద పేరసాని సత్యనారాయణ జండా ఎగరవేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో పార్టీ మండల కార్యదర్శి వర్గ సభ్యులు గోపాలపేట మాజీ సర్పంచ్ నల్లమోతు మోహన్ రావు మాట్లాడుతూ సంజీవయ్య మరణించి ఆరు సంవత్సరాలైనా పార్టీకి పేద ప్రజలకు ఆయన చేసిన సేవలు మరువలేని తాను నమ్మిన సిద్ధాంతం కోసం తాను చిన్ననాటి నుండి పట్టిన ఎర్రజెండాను దించకుండా తన చివరి శ్వాస వరకు సిద్ధాంతం కోసం పేదల కోసం పనిచేసి సంజీవయ్య ధన్యజీవి అయ్యారని వారి ఆశయాల కోసం మనమందరం పనిచేయటమే ఆయనకిచ్చే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో వారి కుమారులు కొమ్మినేని వెంకటేశ్వర్లు, కొమ్మినేని రాంబాబు, నాయకులు పేరసాని వెంకటయ్య, కూచిపూడి రమేష్ కొమ్మూరి గోపాలరావు, పేరసాని రాజేశ్వరరావు, సుంకర కృష్ణయ్య, సుంకర నాగేశ్వరరావు, కూచిపూడి గోపాలరావు, నున్నా శ్రీనివాసరావు, సాయిని నాగేశ్వరరావు, పోట్ల నరసింహారావు, మాసారపు నరసింహారావు, పోట్ల వెంకటయ్య, రాయల వెంకటయ్య మాసారపు రాఘవయ్య, సాయిని లక్ష్మయ్య, దొడ్డ పిన్ని పాపయ్య, తుల్లూరి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘం ఎన్నికల ప్రచారం ప్రారంభం...

### ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి చేస్తా...మిట్టపల్లి కిరణ్ కుమార్..



**ఖమ్మం/వైరా ఆగస్టు 26 (అక్షరంన్యూస్)**

వైరా మండల ఆర్యవైశ్య సంఘం ఎన్నికల ప్రచారం సోమవారం ప్రారంభించారు.. మండల అధ్యక్షుడు పదవికి పోటీ చేస్తున్న అభ్యర్థి మిట్టపల్లి కిరణ్ కుమార్ తో పాటు పలువురు నాయకులు కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి తమకు ఒకటో నెంబర్ గుర్తుపై మీ ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు... ఆర్య వైశ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.. యువకుడునైనా నాకు అవకాశం ఇస్తే నిస్వార్థంగా పనిచేసి సంఘం అభివృద్ధికి దోహదపడతానని మిట్టపల్లి కిరణ్ కుమార్ హామీ ఇచ్చారు. బ్యాలెట్ లో ఒకటో నెంబర్ గుర్తుపై మీ అమూల్యమైన ఓటు ముద్ర వేసి తనను గెలిపించాలని కోరారు.. ఈ ప్రచార కార్యక్రమంలో యండ్రపూడి శివశంకర్, నూకల ప్రసాదరావు , కొల్లా రాంబాబు, సముద్రాల మురళి కృష్ణ, చల్లా వెంకటరమణ, మిట్టపల్లి విజయ్ కుమార్, తెల్లాకుల సందీప్, దారా కృష్ణ, బోనాల సాయి నిఖిల్, తదితరులు పాల్గొన్నారు.

## బచ్‌పన్ స్కూల్లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు




**రంగారెడ్డి / రాజేంద్రనగర్ / గండిపేట్ / ఆగస్టు 26/ అక్షరం న్యూస్ :**

రాజేంద్రనగర్ సర్కిల్లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. సర్కిల్ పరిధిలోని అత్తాపూర్ లోని ఢిల్లీ బచ్‌పన్ స్కూల్లో కృష్ణాష్టమి వేడుకలను కనుల పండుగగా నిర్వహించారు. చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జ్యోతి రెడ్డి మాట్లాడుతూ.. ఇలాంటి పండుగలను నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి పండుగను ఇదేవిధంగా జరుపుకుంటూ మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నాగేశ్వరి,ఉపాధ్యాయులు రష్మీ జోషి, హైమ, మీనాక్షి, భారతి, కుల్దీప్ కౌర్, పూజా శర్మ, జ్యోతికృష్ణ, వైష్ణవి, సుమన్, కళ్యాణి, స్వప్న, అనూష, పూజ, మహేశ్వరి, స్కూల్ సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పరిశీలించిన ఎమ్మెల్యే: మదన్ మోహన్





**కామారెడ్డి జిల్లా/ఎల్లారెడ్డి/ఆగస్టు 26/అక్షరం న్యూస్:**

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో నిర్మిస్తున్న300 డబుల్ బెడ్ రూమ్ఇండ్లను సోమవారం ఎమ్మెల్యే మదన్ మోహన్ అధి కారులు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు సంబంధిత కాంట్రాక్టర్లతో మాట్లాడి జరుగుతున్న పనుల గురించి అ డిగి తెలుసుకున్నారు. కరెంట్ డ్రైనేజ్ తది తర మిగిలి ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు.ఇండ్లను పూర్తిచే యడానికి మరో 40 లక్షల నిధులు అవసర మని అధికారులు కోరగా కలెక్టర్ తో మా ట్లాడి స్పెషల్ డెవల ప్మెంట్ ఫండ్స్ (ఎస్ డి ఎ ఫ్ )ద్వారా త్వరలోనే నిధులను మంజూ రు చేయిస్తానని అన్నారు ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ డ బుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీలో ఎటు వంటి అవకతవకలు జరగకుండా నిజమైన లబ్దిదారులకు డబుల్ బెడ్రూమ్ ఇండ్లను మరో 15-20 రోజులలో అందజేస్తామని తె లిపారుఈ కార్యక్రమంలో సంబంధిత ఏఈ, డిఈ మున్సిపల్ అధికారులు, కాంట్రాక్టర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తది తరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్తూ మార్గమ ధ్యంలో రెండవ వార్డులో నిర్మాణంలో ఉన్న సిసి రోడ్డు డ్రైనేజీ పనుల గురించి కాంగ్రెస్ పార్టీ నాయకుడు మంచిర్యాల విద్యాసాగ ర్ కాలనీవాసులనుఅడిగి తెలుసుకున్నారు

# ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కోళ్లమద్ది గ్రామ కమిటీ ఎన్నిక

**రాజన్న సిరిసిల్ల/గంభీరావుపేట/ఆగస్టు 27(అక్షరం న్యూస్)**

మాల మహానాడు ఆఫ్ ఇండియా సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం ఆధ్వర్యంలో కోలమద్ది గ్రామంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సభ్యులుగా ఏకగ్రీవ ఎన్నిక చేయడం జరిగింది.మండల నాయకులు లక్కం బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో అధ్యక్షులు ఇటుకల నర్సింలు,భూపతి సురేందర్,ఉపాధ్యక్షులుగా ఏడబోయిన నారాయణ,ప్రధాన కార్యదర్శి ఏడబోయిన దిలీప్,కోశాధికారి భూపతి, మహిపాల్ సంయుక్త కార్యదర్శి తలారి బాబు.రాజు.సలహాదారు భూపతి శేఖర్.ఏడబోయిన కిషన్.ఏడబోయిన రాములు.తలారి దేవరాజు,ఏడబోయిన ఎల్లయ్య,భూపతి మధుసూదన్,ఎడబోయిన శంకర్, ఏకగ్రీవంగా,ఎన్నుకోవడం జరిగింది.

# నాటు సారా విక్రేతలు అరెస్టు



**ములుగు/నూగూరు వెంకటాపురం/ఆగస్టు 26/ అక్షరం న్యూస్:-**

మండల పరిధిలోని నూగూరు గ్రామ శివారులో నాటు సారా కలిగి ఉన్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు పట్టుకున్నారు.ఎస్సై కొప్పుల తిరుపతిరావు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం సాయంత్రం నూగూరు గ్రామ శివారులో నమ్మదగిన సమాచారం మేరకు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా..చత్తీస్ ఘడ్ నుండి వెంకటాపురం వైపు ద్విచక్ర వాహనంపై ప్లాస్టిక్ సంచులు,టిన్నులతో వస్తున్న ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించగా వెంబడించి పట్టుకున్నామ న్నారు.వారి వద్ద ఉన్న సంచులు టిన్నులను తనిఖీ చేయగా సుమారు 110 లీటర్ల నాటు సారా లభ్య మైందని అన్నారు.ఛత్తీస్ ఘఢ్ లో కొనుగోలుచేసి వెంకటా పురంలో విక్రయించ డానికి తీసుకు వస్తున్నారని అన్నారు.పట్టుబ డిన నాటు సారా విలువ సుమారు 44 వేల రూపాయలుగా ఉంటుందన్నారు.వీరి వద్ద లభించిన ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేశామని అన్నారు.

# చెట్టును ఢీకొట్టిన ఆర్ టి సి బస్సు

**అతివేగం డ్రైవర్ నిర్లక్ష్యమే కారణం**

**కండక్టర్ తో సహా 6గురు ప్రయాణికులకు స్వల్ప గాయాలు**

**కామారెడ్డి జిల్లా/ ఎల్లారెడ్డి/ఆగస్టు 26/అక్ష రంన్యూస్:**

ఆర్టీసీ బస్సు చెట్టుకు ఢీకొని కం డక్టర్ తో సహా 6గురు ప్రయాణికులకు స్వ ల్ప గాయాలైన సంఘటన ఎల్లారెడ్డి మండ ల కేంద్రంలోని హాజీపూర్ వద్ద సోమవారం చోటుచేసుకుంది. ఎల్లారెడ్డి పట్టణ ఎస్సై బొ జ్జ మహేష్ తెలిపిన వివరాల ప్రకారం ఎల్లా రెడ్డి మండలంలోని హాజీపూర్ గేటు మూల మలుపు కల్వర్టు వద్ద కామారెడ్డి నుండి ఎ ల్లారెడ్డి వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం అతివేగం వల్ల చెట్టుకు ఢీ కొట్టింది దీంతో బస్సులో ప్రయాణిస్తున్న 6గురు ప్ర యాణికులతో పాటు కండక్టర్ కు స్వల్ప గా యాలైనట్లు ఆయన తెలిపారు గాయపడి న వారిని వెంటనే చికిత్స నిమిత్తంప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రమాదంలో గాయప డిన ప్రయాణికురాలి కుమారుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు






# హైదరాబాద్ ఐఐటీ దేశానికే గర్వకారణం -: మంత్రి శ్రీధర్‌బాబు



**సంగారెడ్డి:-అక్షరం న్యూస్:**

కందిలోని ఐఐటీ హైదరాబాద్‌ను తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు సందర్శించారు. అక్కడి విద్యార్థులు రూపొందించిన డ్రైవర్ రహిత కారును పరిశీలించి..అందులో ప్రయాణించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. డ్రైవర్‌లెస్ కారు అద్భుతంగా ఉందని, దీన్ని రూపొందించిన హైదరాబాద్ ఐఐటీ దేశానికే గర్వకారణమని అన్నారు. ప్రయోగదశలో ఉన్న ఈ డ్రైవర్‌లెస్ సాంకేతికత త్వరలో ఆచరణలోకి రావాలని ఆకాంక్షించారు. ఏఐ సేవలను అన్ని రంగాల్లో వినియోగించుకుంటున్నట్లు చెప్పారు.

## ప్రభుత్వం ఎవరిపైనా కక్ష సాధింపు చర్యలకు దిగలేదు: మంత్రి పొన్నం




**హైదరాబాద్ అక్షరం న్యూస్:**

చెరువుల ఆక్రమణలపై ప్రభుత్వం సీరియస్‌గా ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్‌లో అక్రమ కట్టడాల కూల్చివేతలపై ఆయన స్పందించారు. "చెరువుల ఆక్రమణలపై ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. ఆక్రమణకు గురైన చెరువుల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నాం. వాతావరణ కాలుష్యం నుంచి పర్యావరణాన్ని కాపాడుకోవాలి. చెరువులపై ప్రభుత్వ లెక్కలు, రికార్డుల మేరకు కార్యక్రమాలు చేపడుతున్నాం.రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జల వనరులను పరిరక్షించుకోవాలి. చెరువుల రక్షణపై ప్రభుత్వం దృష్టికి స్థానికులే తేవాలి. ప్రభుత్వం ఎవరిపైనా రాజకీయ కక్ష సాధింపు చర్యలకు దిగలేదు. హైడ్రాకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. ప్రభుత్వం చేస్తున్న పనిపై రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు" అని పొన్నం ప్రభాకర్ తెలిపారు.

# సారూ.. చెరువు కనిపించట్లేదు.. వెతికిపెట్టండి

**మహేశ్వరం: -అక్షరం న్యూస్:**

తుమ్మల చెరువు జాడ కనిపించట్లేదని పహాడీషరీఫ్ పోలీసు స్టేషన్‌లో గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడలో 8 ఎకరాల్లో ఉండాల్సిన చెరువు కనిపించట్లేదని అందులో పేర్కొన్నారు.కబ్జా చేసి వెంచర్లు వేశారని ఆరోపించారు. దీంతో పంటలు మునుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు స్పందించి చెరువు ఆచూకీ కనిపెట్టాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల చుట్టూ తిరిగి విసిగిపోయామని గ్రామస్థులు ఆరోపించారు.మల్కం చెరువు వద్ద ఆక్రమణల కూల్చివేత.. రాయదుర్గం మల్కం చెరువు వద్ద ఆక్రమణల కూల్చివేతలను చేపట్టారు. ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను శేరిలింగంపల్లి రెవెన్యూ సిబ్బంది కూల్చివేసింది. పోలీసు బందోబస్తు మధ్య ఎకరా భూమిలో ఉన్న ఆక్రమణలు తొలగించారు.

# 'హైడ్రా'కు పెరుగుతున్న ఎమ్మెల్యేల మద్దతు..



**హైదరాబాద్ అక్షరం న్యూస్:**

హైడ్రాకు రోజురోజుకూ మద్దతు పెరుగుతోంది. అటు పొలిటికల్‌గా.. ఇటు సామాన్యుల నుంచి మద్దతు పెద్ద ఎత్తున వస్తోంది. ముఖ్యంగా ఎన్ కన్వెన్షన్ కూల్చివేత హైడ్రాకు కావల్సినంత మద్దతును కూడగట్టింది.అన్ని వర్గాల ప్రజలు దీనిపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. హైడ్రాపై సొంత పార్టీలో ఇబ్బందులు వస్తాయని తొలుత సీఎం రేవంత్ రెడ్డి భావించారు. కానీ ఎమ్మెల్యేలంతా రేవంత్ నిర్ణయానికి మద్దతు పలుకుతున్నారు. హైడ్రా లాంటి వ్యవస్థను రాష్ట్రమంతటా విస్తారించాలని రేవంత్‌కి ఎమ్మెల్యేలు విజ్ఞప్తి చేస్తున్నారు. హైడ్రాపై అభినందనలు తెలుపుతూ రేవంత్‌కి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, విప్ అడ్లూరి లక్ష్మణ్‌లు లేఖ రాశారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో హైడ్రా తరహా వ్యవస్థ కోసం సీఎం రేవంత్‌కి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ లేఖ రాశారు.వేములవాడ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే రమేష్ బాబు ఎఫ్‌టీఎల్ పరిధిలో గెస్ట్ హౌజ్ కట్టాడని ఆది శ్రీనివాస్ లేఖలో పేర్కొన్నారు. హైడ్రాను తమ నియోజకవర్గంలో కూడా విస్తరించాలని సీఎం రేవంత్ రెడ్డికి షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రిక్వెస్ట్ చేశారు. నకిరేకల్ నియోజకవర్గంలో కూడా ఆక్రమణకు గురైన భూములను కాపాడాలని వేముల వీరేశం లేఖ రాశారు. ఆలేరు నియోజకవర్గంలో ఆక్రమణకు గురైన భూములు, అక్రమ కట్టడాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని సీఎంకి ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య లేఖ రాశారు. తమ నియోజకవర్గంలో హైడ్రా లాంటి వ్యవస్థను తీసుకు రావాలని మానుకొండూర్ కవ్వంపల్లి సత్యనారాయణ, ఎమ్మెల్యే కాలే యాదయ్య, తదితరులు రేవంత్‌కి లేఖ రాశారు. కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి జ్ఞాన సుందర్ నేడు గాంధీ భవన్‌లో మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి హైట్ కొలవగలరేమో కానీ ఆయన ఆత్మవిశ్వాసాన్ని కొలవలేరని కొనియాడారు. పేదవాడిని కొట్టడం తప్పా, పెద్ద వాళ్ళకి వ్యతిరేకంగా ఏ ప్రభుత్వం పోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఎవరికీ భయపడకుండా ముందుకి పోతోందన్నారు. హైడ్రాకి ప్రజల మద్దతు ఉందన్నారు. తెలంగాణ అంతటా హైడ్రా లాంటి వ్యవస్థను విస్తరించాలని కోరారు. రేవంత్ ఆలోచనకి ప్రతిపక్షాల మైండ్ బ్లాంక్ అవుతోందన్నారు. గత ప్రభుత్వంలో అధికారులు బీఆర్ఎస్ నాయకులు చెప్పినట్టు విన్నారని.. అందుకే ఫేక్ పట్టాలు పొందగలిగారని జ్ఞాన సుందర్ పేర్కొన్నారు. అయితే నగరంలో హైడ్రా మాత్రం నాన్ స్టాప్‌గా కూల్చివేతలు నిర్వహిస్తోంది. శేర్లింగంపల్లి మండలం రాయదుర్గంలో ప్రభుత్వ భూముల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తోంది. రాయదుర్గం సర్వేనెంబర్ 72లో ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు వెలిశాయి. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేతలు చేపట్టారు. భారీగా పోలీసుల మోహరించారు. కూల్చివేతలను స్థానికులు అడ్డుకుంటున్నారు.

# కాంగ్రెస్ అంటేనే మొండి చెయ్యి: కేటీఆర్..



**హైదరాబాద్ అక్షరం న్యూస్:**

రైతు రుణమాఫీ అంశంలో బీఆర్ఎస్ నేతల ఆరోపణలు ఆగడం లేదు. పూర్తి రుణ మాఫీ చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా మంత్రులు, ఎమ్మెల్యేలు చెప్తున్నారు.కానీ రుణమాఫీ ఓ బోగస్ అంటూ ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. ముఖ్యంగా బీఆర్ఎస్ నేతలు కేటీఆర్(%ఖు=%), హరీశ్ రావు(%ఝుతీఅంష్ట్ర ఝశీ%) ఇప్పటికే ఈ పథకంపై అనేక విమర్శలు చేశారు. ఇంకా రైతులకు పూర్తిగా మాఫీ చేయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రైతుల ఖాతాల్లో నగదు వేసినట్లు గొప్పలు చెప్పుకుంటుందని మండిపడుతున్నారు. తాజాగా రుణమాఫీ అంశంపై కేటీఆర్ మరోసారి స్పందించారు.

సమాధానం చెప్పే నాథుడే లేడు..! రుణమాఫీ అయిన రైతులకన్నా కంటతడి పెట్టిన కుటుంబాలే ఎక్కువంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. అన్నివిధాలా అర్హత ఉన్నా ఎందుకు మాఫీ కాలేదో చెప్పేవారు లేరంటూ ఆయన ఆగ్రహించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. " కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండు పంట సీజన్లు గడిచినా రైతుభరోసా ఇంకా షురూ చెయ్యలేదు. జూన్‌లో వేయాల్సిన రైతు భరోసా ఆగస్టు దాటుతున్నా లబ్ధిదారుల ఖాతాల్లో వెయ్యలేదు. కౌలు రైతులకు ఇస్తానన్న రూ.15వేలు ఇంకా ఇవ్వలేదు. వ్యవసాయ కూలీలకు రూ.12వేల హామీ ఇంకా అమలే చెయ్యలేదు. కాంగ్రెస్ అంటేనే మొండి చెయ్యి చూపించే పార్టీ అని మరోసారి తేలిపోయింది" అని అన్నారు.రుణమాఫీ చేసే దిశగా చర్యలు.. మరోవైపు రుణ మాఫీ అందని రైతుల కోసం తెలంగాణ సర్కార్ వేగంగా చర్యలు చేపడుతోంది. అందుకు ఓ ప్రత్యేకమైన యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. లబ్ధిదారుల వివరాలను సేకరిస్తూ సమస్యల పరిష్కార దిశగా ముందుకెళ్తుంది. కుటుంబ నిర్ధారణ కాని రైతుల ఖాతాలు 4,24,873, ఆధార్‌లో తప్పులున్నవి 1,24,545 ఉన్నాయి. మొత్తం కలిపి 5,49,418 మంది రైతులకు ఇంకా రుణమాఫీ అందాలి. దీనిపై వ్యవసాయశాఖ స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. ఆదివారం నుంచి రుణమాఫీకి కొత్త పోర్టల్ అందుబాటులోకి వచ్చింది. ఇదివరకు రుణమాఫీకి సంబంధించి 'క్రాప్‌లోన్ వీవర్'(సీఎల్‌డబ్ల్యూ) వెబ్‌సైట్ ఉండేది. ఇప్పుడు రైతుభరోసా వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చి.. క్రాప్‌లోన్ వీవర్(సీఎల్‌డబ్ల్యూ)-2024 పోర్టల్‌ను రూపొందించారు. మండల వ్యవసాయ అధికారులకు లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్‌లు ఇచ్చారు.యాప్‌లో ఇలా నమోదు చేసుకోవాలి..ఇంకా రుణమాఫీ లబ్ధి అందని రైతుల అభ్యంతరాలను పోర్టల్‌లో ఏవోలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

# అసలేంటీ 'హైడ్రా', ఏం చేస్తుంది.? దీని లక్ష్యం ఏంటి.?





హైదరాబాద్: (అక్షరంన్యూస్)

హైడ్రా.. ఇప్పుడు ఎక్కడ చూసినా ఇదే చర్చ నడుస్తోంది. ఏ ఇద్దరు కలిసి కాసేపు మాట్లాడుకున్నా హైడ్రాకు సంబంధించిన ప్రస్తావన వస్తోంది. దూసుకొస్తున్న బుల్డోజర్లు, నేల మట్టమవుతోన్న భవనాలు పేపర్లలో, టీవీల్లో ఇప్పుడివే.తాజాగా నటుడు నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ సెంటర్ కూల్చివేతతో ఈ అంశం పీక్స్‌కి చేరింది. రాజకీయంగా ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఇంతకీ అసలు ఏంటీ హైడ్రా.? దీని పని ఏంటి.? ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కురుక్షేత్ర యుద్ధంతో పోల్చిన హైడ్రా అసలు లక్ష్యం ఏంటి.? లాంటి ఆసక్తికర విషయాలు ఇప్పుడు తెలుసుకుందాం.ఏంటీ హైడ్రా..హైడ్రా అంటే 'హైదరాబాద్ డిజాస్టర్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్'. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనల నుంచి ఇది ఏర్పాటైంది. ఒకప్పుడు చెరువులు, కుంటలతో కళకళలాడిన హైదరాబాద్ మహా నగరం నేడు కాంక్రీట్ జంగిల్‌గా మారింది. చినుకు పడితే చాలు రోడ్లు చెరువులను తలపించేలా మారుతున్నాయి. ఈ సమస్యకు ప్రధాన కారణం చెరువులను ఆక్రమించి, నాలాలాను మూసేసి నిర్మాణాలు చేపట్టడమే అని ప్రభుత్వం అంటోంది. హైదరాబాద్ వరదలకు శాశ్వత పరిష్కారం చూపించే దిశగానే హైడ్రాను ఏర్పాటు చేశామని రేవంత్ రెడ్డి తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు వరకు ఈ హైడ్రాను విస్తరించారు.హైడ్రాకు ఛైర్మన్‌గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహరిస్తుం డగా.. సీనియర్ ఐపీఎస్ అధికారి ఏవీ రంగనాథ్ కమిషర్‌గా వ్యవహరిస్తున్నారు. అక్రమ నిర్మాణాలు నిర్మోహటంగా కూల్చేసే పనిలో పడింది హైడ్రా. ఇందులో భాగంగానే ఇప్పటికే పలువురు రాజకీయ నాయకులతో పాటు ఇతర రంగాల్లో ఉన్న ప్రముఖుల నిర్మాణాలను సైతం కూల్చేశారు. ఈ కూల్చివేతలు ఇంకా కొనసాగుతాయని వెనకడగు వేసేది లేదని చెబుతున్నారు. ఇప్పటి వరకు ఏం చేశారు..ప్రభుత్వ లెక్కల ప్రకారం హైడ్రా ఇప్పటి వరకు 166 ఆక్రమ నిర్మాణాలపై చర్య తీసుకుంది. మొత్తం 43.54 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. వీటిలో అత్యధికంగా గాజులరామారంలోని చింతల్ చెరువు ఒడ్డున 54 నిర్మాణాలను కూల్చేశారు. ఆ తర్వాత రాజేంద్ర నగర్‌లోని భూమ్రుక్ డౌలాలో 45 నిర్మాణాలు ఉన్నాయి. ఇక హైదరాబాద్‌కు తాగు నీటిని అందిస్తున్న గండిపేట్ చుట్టూ 24, ఖాన్‌పూర్‌లో 14, చిల్కూర్ ప్రాంతంలో 10 నిర్మాణాలను అధికారులు నేలమట్టం చేశారు.రాజకీయాలకు అతీతంగా..సాధారణంగా ఇలాంటి అంశాలు రాజకీయంగా వివాదానికి దారి తీస్తాయని తెలిసిందే. అయితే హైడ్రా విమర్శలను ఎదుర్కొంటూ ముందుకు సాగుతోంది. ఎలాంటి ఒత్తిడులు వచ్చినా తగ్గేది లేదంటోంది. నిన్నటి నిన్న సీఎం రేవంత్ రెడ్డి.. అక్రమ నిర్మాణాలను కూల్చి వేయడాన్ని కురుక్షేత్ర యుద్ధంతో పోల్చిన విష యం తెలిసిందే. గీతలో కృష్ణుడు చెప్పిన పనినే తాము చేస్తున్నామని అన్నారు.

హైడ్రా చేస్తున్న పని తమ పార్టీలో కూడా కొందరికి నచ్చక పోవచ్చని కానీ చర్యలు తీసుకో వడం మాత్రం ఆగదని స్పష్టం చేసి రాజకీయంగా హీట్ పెంచారు .కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎమ్ఐఎం పార్టీలకు చెందిన వారి నిర్మాణా లను కూడా హైడ్రా కూల్చి వేసింది. చింతల్‌లో చెరువును స్థానిక బీఆర్ఎస్ నాయుడు ఆర్ సాయి రాజు, బీఆర్ఎస్‌లో గెలిచి కాంగ్రె స్‌లోకి వెళ్లిన దానం నాగేందరకు సంబంధించి నందగిరి కొండల్లో ఉన్న నిర్మాణాలను, రాజేంద్ర నగర్‌లో ఏఐఎంఐఎం ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్, ఎమ్మెల్సీ మీర్జా రహమత్ బేగ్‌లకు సంబంధించిన అక్రమ నిర్మాణాలను కూల్చి వేశారు. దీంతో రాజకీయాలకు అతీతం హైడ్రా పనిచేస్తుందని చెప్పకనే చెప్పారు.హైడ్రా చర్యలు ముమ్మాటికీ రాజకీయ కక్షసాధింపు అని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ తాను లీజుకు తీసుకున్న జన్వాడలోని ఫామ్ హౌజ్ నిబంధనలకు విరుద్ధంగా ఉంటే కూల్చేయండని స్టేట్‌మెంట్ ఇచ్చారు. కాంగ్రెకు చెందిన మాజీ ఎంపీ కెవిపి, గుత్తా సుఖేందర్ రెడ్డితో పాటు ఇతర కాంగ్రెస్ నాయకుల అక్రమ నిర్మాణాలను కూల్చేయాలని డిమాండ్ చేశారు. కేవలం కొందరి ఆస్తులపైనే దాడులు చేయడం ఏంటని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది.ఇక బీజేపీ విషయానికొస్తే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి.. అక్రమ నిర్మాణాలకు గతంలో అనుమతి ఇచ్చింది కాంగ్రెస్ కాదా అంటూ ప్రశ్నించారు. అనుమతులు ఇచ్చిన అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇక మెదక్ ఎంపీ రఘునందన్.. నాగార్జున కన్వెక్షన్ సెంటర్ కూల్చడం సరైందేనని, ఇతర అక్రమ నిర్మాణాలను సైతం కూల్చేయాలన్నారు. ఇక బీజేపీలో మరో సీనియర్ లీడర్.. ఎంపీ ఈటల రాజేందర్ సైతం ఈ విషయమై స్పందించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలు పేదలను భయభ్రాంతులకు గురి చేసేలా ఉన్నాయన్నారు. తాను అద్భుత పాలకుడినని, ఆయన నిక్కచ్చిగా ఉండే ఆఫీసర్ అని చూపించే ప్రయత్నాలు చేస్తున్నారా అని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక తన గుర్తింపు కోసం హడావుడి చేస్తున్నారని ఆరోపించారు.ఇక ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సైతం హైడ్రాకు సంబంధించి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లోని నిర్మాణాలు అన్నింటిని కూల్చేస్తామనడం సరికాదని అసదుద్దీన్ పేర్కొన్నారు. ఆ పరిధుల్లో ప్రైవేటు కట్టడాలతోపాటు ప్రభుత్వ నిర్మాణాలు కూడా ఉన్నాయని చెప్పారు. మరి వాటిని కూడా కూల్చేస్తారా? అని ప్రశ్నించారు. నెక్లెస్ రోడ్డు పరిస్థితి ఏమిటీ? తొలగిస్తారా? అని అడిగారు. జీహెచ్ఎంసీ కార్యాలయాన్ని కూల్చేస్తారా? అని ప్రశ్నించారు. ఇప్పుడు జీహెచ్ఎంసీ ఉన్న చోట గతంలో ఓ కుంట ఉండేదని వివరించారు. ఉస్మాన్ సాగర్ వద్ద ఉన్న కేంద్ర ప్రభుత్వ సంస్థ సీసీఎంబీ ఉందని, దాన్ని కూడా కూల్చేస్తారా? అని ప్రశ్నించారు. మరి హైడ్రా తన దూకుడును ఇలాగే కొనసాగిస్తుందా.? లేదా అనేది తెలియాలంటే కాలమే నిర్ణయించాలి.

# సునీతా విలియమ్స్‌కు 'స్పేస్ ఎనీమియా' ముప్పు.. ఏంటా సమస్య?



వాషింగ్టన్: అంతరిక్ష కేంద్రంలో ఉన్న ఇద్దరు నాసా వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్‌మోర్ భూమికి తిరిగివచ్చేందుకు వచ్చే ఏడాది వరకు ఆగాల్సి వచ్చింది.జూన్ 5న వీరిని తీసుకెళ్లిన స్టార్‌లైనర్ ప్రొపల్షన్ వ్యవస్థలో తీవ్ర సమస్యలు తలెత్తడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు నాసా వెల్లడించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఎక్కువ రోజుల పాటు అంతరిక్ష కేంద్రంలో ఉంటే అనారోగ్య సమస్యలు ఎదురవుతాయని నిపుణుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆమె స్పేస్ ఎనీమియా బారిన పడే ముప్పు ఉంది. అసలు ఏంటా సమస్య..?అంతరిక్షంలో ఉన్న సమయంలో వ్యోమగాముల్లో ఎర్రరక్తకణాలు క్షీణించే స్థితినే స్పేస్ ఎనీమియా అంటారు. 'మైక్రో–గ్రావిటీ'కి ఎక్కువ కాలం గురైనప్పుడు ఎర్రరక్తకణాల ఉత్పత్తితో పోలిస్తే అవి క్షీణించే రేటు వేగంగా ఉంటుంది. భూమిపై మనిషి శరీరంలో ఒక సెకనుకు రెండు మిలియన్ల రక్తకణాల ఉత్పత్తి, క్షీణత జరుగుతుంది. ఆరు నెలల అంతరిక్ష మిషన్లలో భాగంగా.. ఆ క్షీణత సంఖ్య సెకనుకు 3 మిలియన్ల వరకు ఉంటుందని ఓ అధ్యయనం పేర్కొంది. ఆ అధ్యయనం వివరాలు నేచర్ మెడిసిన్‌లో ప్రచురితమయ్యాయి.ఒక వ్యోమగామి అంతరిక్షంలోకి ప్రవేశించిన వెంటనే ఈ స్పేస్ ఎనీమియాకు గురవడం మొదలవుతుందని నాసా నివేదిక చెబుతోంది. ఎర్రరక్తకణాలను నాశనం చేయడం ద్వారా మైక్రోగ్రావిటీ పరిస్థితుల్లో శరీరం ఆక్సిజన్ అవసరాలను తగ్గించుకుంటుంది. శరీరంలో సమతుల్యతను కాపాడే క్రమంలో వాటి సంఖ్య తగ్గిపోతూ ఉంటుంది. దాంతో అలసట, నిస్సత్తువ, శారీరక, మానసిక పనితీరు దెబ్బతినడం వంటి లక్షణాలు కనిపించొచ్చు. అలాగే గుండె పనితీరు దెబ్బతినే అవకాశమూ ఉంది.మిషన్‌లో భాగంగా స్పేస్‌లో ఉన్నంతకాలం ఎర్రరక్తకణాలు తగ్గుతూనే ఉంటాయని, ఈ పరిస్థితి హిమోలిసిస్ అంటారని అధ్యయనకర్తలు తెలిపారు. వ్యోమగాములు భూమిపైకి తిరిగివచ్చిన తర్వాత కూడా ఈ పరిస్థితి కొనసాగుతుందని వెల్లడించారు. అయితే ఈ క్షీణతను ఎదుర్కొనేందుకు అధికంగా పోషకాహారం తీసుకోవాల్సి రావొచ్చని, ఈ పరిస్థితి వారి ఆరోగ్యంపై శాశ్వత ప్రభావం చూపొచ్చని ఆందోళన వ్యక్తం చేశారు.బోయింగ్ క్రూ ఫ్లైట్ టెస్ట్‌లో భాగంగా నాసా గత జూన్‌లో ఈ ప్రయోగాత్మక పరీక్ష చేపట్టింది. అయితే వారంలోగా వ్యోమగాములు భూమిపైకి తిరిగిరావాల్సి ఉంది. కానీ, ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ యాత్రలో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. వాహక నౌక థ్రస్టర్లలో లోపాలు తలెత్తటంతో పాటు హీలియం లీకేజీ సమస్యగా పరిణమించింది. దీంతో అందులో ప్రయాణించడం సురక్షితం కాదని నాసా తేల్చింది. అప్పటి నుంచి సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నాలు జరిగాయి. అవి విఫలం కావడంతో ఆమె వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు అక్కడే ఉండనున్నారు. సునీతా, విల్‌మోర్‌లు స్పేస్ స్టేషన్‌లో ఉండి మరిన్ని పరిశోధనలు, నిర్వహణ, సిస్టమ్ టెస్టింగ్ చేయనున్నారు. దాంతో నెలలపాటు అక్కడే ఉండనున్న సునీత( స్పేస్ ఎనీమియాతో పాటు ఎముకలు సాంద్రతను కోల్పోయే ప్రమాదం, దృష్టిలో మార్పులు ఎదుర్కొనే ముప్పు ఉందని వైద్య నిపుణులు వెల్లడించారు.

# ఆదివారం వచ్చిందంటే ఆ గ్రామంలో నాన్-వెజ్ బంద్.. కారణం తెలిస్తే



జగిత్యాల జిల్లా - (అక్షరంన్యూస్)

ఆదివారం వచ్చిందంటే చాలు ఏ గ్రామంలో అయినా రుచికరమైన మాంసం వంటకాలతో ఘుమఘుమల వాసనలు.. ఇక మద్యం ప్రియులు అయితే మాంసం, మందుతో ఆదివారం ఎంజాయ్ చేస్తారు.తెలంగాణలోని ప్రతి గ్రామంలో ఇదే పరిస్థితి ఉంటుంది. కానీ ఆదివారం మద్యాన్ని, మాంసానికి దూరంగా ఉండి భక్తిభావంతో ఆదర్శంగా నిలిచే ఓ ఊరు ఉందని మీకు తెలుసా..జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గ్రామానికి ఓ ప్రత్యేకత ఉంది. పెద్దపూర్ గ్రామంలో ఆదివారం రోజున మాంసం, మద్యానికి దూరంగా ఉంటారు. ఆదివారం రోజున కేవలం కూరగాయలు, పప్పులతోనే శాఖాహార భోజనం చేస్తారు. ఈ గ్రామంలో మల్లన్న స్వామిని అరాధ్యంగా కొలుస్తుంటారు. మల్లన్న స్వామి దేవునికి ఇష్టమైన ఆదివారం రోజున నిష్టతో ఉండి ఆదివారం పూజలు చేస్తుంటారు. మల్లన్న స్వామిని మొక్కుకున్న వారికి ఇంట్లో కొంగు బంగారంగా మారుతాడు.గ్రామంలో ఆదివారం వచ్చిందంటే ప్రతి ఇంట్లో తలస్నానాలు చేసి పిల్లాపాపలతో కుటుంబం అంతా వచ్చి ప్రత్యేక పూజలు చేస్తారు. గ్రామంలో ఆదివారం రోజు ఎంతో నిష్టగా ఉంటారు. ఈ రోజున గ్రామంలో ఏ శుభకార్యాలు నిర్వహించరు. శుభకార్యాలు తప్పని పరిస్థితులలో చేయాల్సి వచ్చినా శాఖాహార కూరగాయల భోజనాలతో వడ్డిస్తారు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా పదిహేను సంవర్సారాలుగా మద్యం, మాంసానికి దూరంగా ఉంటూ అదర్శంగా నిలుస్తున్నారు. గ్రామంలో ప్రతి ఏటా హోళీ పండుగ తరువాత వచ్చే ఆదివారం రోజున మల్లన్న స్వామికి పెద్ద ఎత్తున 30 వేల వరకు బోనాలు సమర్పిస్తుంటారు. ఈ బోనాల ఉత్సవానికి మన రాష్ట్రంతో పాటుగా మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాల నుండి వేలాదిగా భక్తులు తరలివస్తారు.

# కిమ్ చేతికి 'సూసైడ్ డ్రోన్'..

## ప్రయోగాన్ని స్వయంగా పర్యవేక్షించిన నియంత!




సియోల్: నిత్యం క్షిపణులు, శక్తిమంతమైన బాంబుల పరీక్షలతో వార్తల్లో నిలిచే ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ ) చేతికి మరో కొత్త ఆయుధం చిక్కింది.అదే సూసైడ్ డ్రోన్. వీటి పనితీరును కిమ్ శనివారం స్వయంగా పర్యవేక్షించారు. వీటికి సంబంధించిన చిత్రాలను ఆ దేశ అధికారిక మీడియా సోమవారం విడుదల చేసింది.తమ యుద్ధ సన్నద్ధతను మరింత మెరుగుపర్చుకోవడానికి సూసైడ్ డ్రోన్ల తయారీని వేగవంతం చేస్తామని కిమ్ వెల్లడించారు. ఎక్స్ ఆకారపు రెక్కలు ఉన్న ఓ తెల్లటి డ్రోన్.. దక్షిణ కొరియాకు చెందిన కే–2 యుద్ధ ట్యాంకును పోలి ఉన్న లక్ష్యాన్ని ధ్వంసం చేసినట్లు ఫొటోల్లో కనిపిస్తోంది. సాధారణ డ్రోన్లు లక్ష్యానికి కొంత దూరంలో ఉండి క్షిపణుల ద్వారా దాడి చేస్తాయి. తాజాగా ఉత్తర కొరియా ప్రయోగించినవి మాత్రం అవే నేరుగా లక్ష్యంలోకి దూసుకెళ్లి విధ్వంసం సృష్టిస్తాయి.ఉత్తర కొరియా నుంచి దక్షిణ కొరియా, అమెరికాకు తరచూ అణ్వస్త్ర ప్రయోగ బెదిరింపులు వస్తున్న విషయం తెలిసిందే.

ఈనేపథ్యంలో ఈ ఇరు దేశాలు కలిసి సంయుక్త సైనిక విన్యాసాలు నిర్వహిస్తున్నాయి. తద్వారా తమ ఆత్మరక్షణ సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు మెరుగుపర్చుకుం టున్నాయి. యుద్ధ సన్నద్ధతను పరీక్షించుకుంటున్నాయి. ఈ తరుణంలో కిమ్ సూసైడ్ డ్రోన్ల ప్రయోగాలు తెరపైకి రావడం గమనార్హం.వివిధ దూరాలను ప్రయాణించగలిగే సామర్థ్యం ఉన్న పలురకాల డ్రోన్లను శనివారం పరీక్షించినట్లు కేసీఎన్ఏ వెల్లడించింది. భూమితో పాటు సముద్రంలోని లక్ష్యాలను సైతం ఈ డ్రోన్లు ఛేదిస్తాయని పేర్కొంది. లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో దాడి చేయడానికి ముందు ఈ డ్రోన్లు వివిధ మార్గాల్లో ప్రయాణించాయని తెలిపింది. అంతర్జాతీయ సైనిక సామర్థ్యాలు, ఆత్మరక్షణ వ్యవస్థలను పరిశీలిస్తే డ్రోన్ల వంటి అత్యాధునిక సాంకేతికత ఎంత అవసరమో తెలుస్తోందని కిమ్ అన్నారు. ఈ నేపథ్యంలో వీటిని వీలైనంత త్వరగా సైన్యంలో చేర్చాలని అధికారులను ఆదేశించారు.యావత్ ప్రపంచం రష్యా–ఉక్రెయిన్, ఇజ్రాయెల్–హమాస్ దృష్టి సారించిన తరుణంలో కిమ్ తమ అణ్వస్త్ర సామర్థ్యాన్ని బలోపేతం చేసుకోవడంపై దృష్టి సారించారు. తరచూ అమెరికా, దక్షిణ కొరియాకు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అమెరికాలోని లక్ష్యాలను సైతం చేరుకునే దీర్ఘశ్రేణి క్షిపణులను రూపొందిస్తున్నారు. అదే సమయంలో పొరుగున ఉన్న దక్షిణ కొరియాను లక్ష్యంగా చేసుకునే స్వల్పశ్రేణి ఆయుధాలను సైతం సిద్ధం చేసుకుంటున్నారు.అమెరికాలో ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఆ దేశంపై ఒత్తిడి పెంచాలనేదే కిమ్ లక్ష్యమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. తద్వారా తమ దేశాన్ని అణ్వస్త్ర దేశంగా గుర్తించాలని కిమ్ ఆశిస్తున్నారని పేర్కొన్నారు. ఫలితంగా ఆర్థిక, సైనికపరమైన ఆంక్షల నుంచి ఉపశమనం పొందాలనేది ఆయన లక్ష్యమని వివరించారు.

# తెలుగు రాష్ట్రాలకు జ్వరం.. 104 టెంపరేచర్..

## -10, 15 రోజులైనా వదలని ఫీవర్.. డేంజర్ బెల్స్ మోగుతున్నాయా?

హైదరాబాద్: (అక్షరంన్యూస్)




ఒళ్లు చాలా వేడిగా ఉంటుంది. టెంపరేచర్ చూస్తే.. 104 డిగ్రీలు కనిపిస్తుంది. అదీ జ్వరం వచ్చిన తొలి రోజే ఇలా ఉంటే.. అలాంటి వారికి టెన్షన్ పెరిగిపోతుంది.ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో పరిస్థితి ఇదే. అందుకే ఫీవర్ వచ్చినవారికి వెన్నులో వణుకు పుడుతోంది. మామూలుగా అయితే జ్వరం లక్షణాలను బట్టి అది ఏ రకం ఫీవరో ఓ అంచనాకు వస్తారు. దానిని బట్టి ట్రీట్ మెంట్ ఇస్తారు.కానీ ఇప్పుడొస్తున్న జ్వరాలు.. ఏ రకమైనవో.. వాటి లక్షణాలు ఏమిటో.. వాటికి ఎలాంటి ట్రీట్ మెంట్ ఇవ్వాలో కూడా కొందరు వైద్యులకు అంతుబట్టని పరిస్థితి ఎదురవుతోంది. తెలుగు రాష్ట్రాల్లో ఈ విధమైన కేసులు వెలుగుచూస్తున్నాయి. సాధారణంగా వర్షాకాలంలో జ్వరాలు విజృంభిస్తాయి. ఇంట్లో అపరిశుభ్ర వాతావరణం, వీధుల్లో పారిశుధ్యం లోపించడం, వాతావరణంలో మార్పులు.. ఇలాంటి వాటివల్ల ఎక్కువ మంది జ్వరం బారిన పడతారు. కానీ ఈసారి ఇలా ఫీవర్ బారిన పడ్డవారిలో విచిత్రమైన లక్షణాలు కనిపిస్తున్నాయి. అవి రోగులను కలవ రపెడుతున్నాయి. ఈ కేసులు వైద్యులకు సవాల్ గా మారుతున్నాయి.

# 'సూర్యఘర్'కు దరఖాస్తు ఎలా? 78 వేల రాయితీ ఎలా పొందాలి?



ఇళ్ల పైకప్పులపై సౌర ఫలకాలు ఏర్పాటు చేసుకుని సౌర విద్యుత్తు పొందడానికి సబ్సిడీ ఇచ్చేందుకు కేంద్ర కేబినెట్ పచ్చజెండా ఊపింది. 2023-24 నుంచి 2026-27 వరకు నాలుగేళ్లు నడిచే ఈ పథకానికి రూ.75,021 కోట్లు కేటాయించింది. ఈ మేరకు ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఇంతకీ ఈ పథకం కింద రాయితీ ఎంత? ఎలా దరఖాస్తు చేసుకోవాలి?పీఎం సూర్యఘర్ ఉచిత విద్యుత్ పథకం కింద రాయితీని రెండు భాగాలుగా విభజించి కేంద్రం ఇవ్వనుంది. 2 కిలోవాట్ల సామర్థ్యానికి 60%, అంతకు పైబడిన యూనిట్లకు 40% మొత్తాన్ని రాయితీ కింద అందిస్తారు. మూడు కిలోవాట్ల సౌర విద్యుదుత్పత్తి కేంద్రం ఏర్పాటు చేయడానికి రూ.1.45 లక్షలు ఖర్చయితే అందులో కేంద్రం గరిష్ఠంగా రూ.78 వేలు అందిస్తుంది. మిగిలిన మొత్తాన్ని పూచీకత్తు అవసరం లేని బ్యాంకు రుణం రూపంలో సమకూరుస్తుంది. రెపోరేట్‌కు అదనంగా 0.5% వడ్డీని దానిపై వసూలు చేయనుంది. ప్రస్తుతం ఇది 7% ఉంది.కరెంట్ అమ్ముకోవచ్చు..ఇంటిపై ఏర్పాటు చేసుకునే సోలార్ వ్యవస్థ ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌లో తొలి 300 యూనిట్లు లబ్ధిదారుడు ఉచితంగా వాడుకోవచ్చు. మిగిలిన 600 యూనిట్లను నెట్ మీటరింగ్ ద్వారా విక్రయించుకోవచ్చు. దీనివల్ల నెలకు రూ.1,265 ఆదాయం వస్తుంది. అందులో రూ.610ని బ్యాంకు రుణవాయిదా కింద జమ చేసుకుంటారు. దీనివల్ల ఏడేళ్లలో ఆ రుణం తీరిపోతుందని కేంద్రమంత్రి అనురాగ్ ఠాకుర్ తెలిపారు. 1 కిలోవాట్‌కు రూ.30వేలు, 2 కిలోవాట్ల వ్యవస్థ ఏర్పాటు చేసుకున్నవారికి రూ.60 వేలు, 3 కిలోవాట్ల ప్లాంట్ ఏర్పాటు చేసుకున్నవారికి రూ.78వేలు గరిష్ఠ రాయితీ అందుతుందని చెప్పారు.

నెలకు 0-150 యూనిట్ల విద్యుత్ వినియోగించే వారికి 1-2 కిలోవాట్ల రూఫ్‌టాప్ వ్యవస్థ ఏర్పాటు చేసుకుంటే సరిపోతుందని సూర్యఘర్ వెబ్‌సైట్‌లో పేర్కొన్నారు. 150-300 యూనిట్లు చొప్పున వినియోగించే వారు 2-3 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. 300 యూనిట్లకు పైబడి విద్యుత్‌ను వినియోగించే వారు 3 కిలోవాట్, ఆ పైబడి సామర్థ్యం కలిగిన సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. 3 కిలోవాట్లకు మించి సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నా గరిష్ఠంగా రూ.78వేలు మాత్రమే సబ్సిడీగా చెల్లిస్తారు.ఉమ్మడిగానూ..నివాసుల సంక్షేమ సంఘాలు, బృందంగా నివాసాలు ఏర్పాటు చేసుకున్నవారు ఉమ్మడి ప్రాంతంలోని విద్యుద్దీపాలు, వాహనాల ఛార్జింగ్ స్టేషన్ల కోసం 500 కిలోవాట్ల వరకు రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థ ఏర్పాటు చేసుకోవచ్చని కేంద్రమంత్రి ఠాకుర్ చెప్పారు. ఇందుకోసం ఒక్కో కిలోవాట్‌కు రూ.18 వేల వరకు రాయితీ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ప్రతి జిల్లాలో ఒక సౌర నమూనా గ్రామాన్ని తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. ఈ విషయంలో బాగా పనిచేసే పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థలకు ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. 2025 కల్లా దేశంలోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలన్నింటిపైనా రూఫ్‌టాప్ సోలార్ విద్యుదుత్పత్తి వ్యవస్థ ఏర్పాటుచేస్తామని, రాయితీ మొత్తాన్ని పూర్తిగా కేంద్రమే ఇస్తుందని తెలిపారు. ఈ పథకం వల్ల 17 లక్షల మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభిస్తుందన్నారు.దరఖాస్తు ప్రక్రియ ఇలా.. పోర్టల్‌లో పేరును రిజిస్టర్ చేసుకోవాలి.

ఇందుకోసం మీ రాష్ట్రం, విద్యుత్ సరఫరా చేసే కంపెనీని ఎంచుకోవాలి. మీ విద్యుత్ కనెక్షన్ కన్స్యూమర్ నంబరు, మొబైల్ నంబరు, ఈ-మెయిల్ ఐడీని ఎంటర్ చేయాలి. కన్స్యూమర్ నంబర్, మొబైల్ నంబర్‌తో లాగిన్ అవ్వాలి. అక్కడ 'రూఫ్‌టాప్ సోలార్' కోసం అప్లయ్ చేసుకోవాలి.దరఖాస్తు పూర్తి చేసి డిస్కమ్ నుంచి అనుమతులు వచ్చేవరకు వేచి చూడాలి. అనుమతి వచ్చిన తర్వాత మీ డిస్కమ్‌లోని నమోదిత విక్రేతల నుంచి సోలార్ ప్లాంట్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఇన్‌స్టలేషన్ పూర్తయిన తర్వాత, ఆ ప్లాంట్ వివరాలను పోర్టల్‌లో సమర్పించి నెట్ మీటర్ కోసం దరఖాస్తు చేసుకోవాలి.నెట్ మీటర్‌ను ఇన్‌స్టాల్ చేశాక, డిస్కమ్ అధికారులు తనిఖీలు చేస్తారు. అనంతరం పోర్టల్ నుంచి కమిషనింగ్ సర్టిఫికేట్ ఇస్తారు.ఈ రిపోర్ట్ పొందిన తర్వాత మీ బ్యాంకు ఖాతా వివరాలతో పాటు క్యాన్సిల్డ్ చెక్‌ను పోర్టల్‌లో సబ్మిట్ చేయాలి. 30 రోజుల్లోగా మీ ఖాతాలో సబ్సిడీ జమ అవుతుంది.

# ఆల్‌టైమ్ గరిష్ఠాలకు సూచీలు..
# సెన్సెక్స్ 1200 పాయింట్లు జంప్



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాలు నమోదు చేశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి పాజిటివ్ సంకేతాలు, దేశీయంగా ఆర్థిక వ్యవస్థలో సానుకూల వాతావరణం సూచీల పరుగుకు కారణమయ్యాయి.దీంతో సెన్సెక్స్, నిఫ్టీ రెండు సూచీలు సరికొత్త జీవనకాల గరిష్ఠాలను నమోదు చేశాయి. సెన్సెక్స్ 1200 పాయింట్లకు పైగా లాభపడగా.. నిఫ్టీ 22,300 పాయింట్ల ఎగువన ముగిసింది.సెన్సెక్స్ ఉదయం 72,606.31 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఆద్యంతం లాభాల్లోనే కొనసాగింది. ఓ దశలో 73,819.21 వద్ద జీవనకాల గరిష్ఠాలను తాకి కొత్త రికార్డును నమోదు చేసిన సూచీ.. చివరికి 1245 పాయింట్ల లాభంతో 73,745.35 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 355.95 పాయింట్లు లాభంతో 22,338.75 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 82.90గా ఉంది. సెన్సెక్స్‌లో టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఎల్అండ్‌టీ, టైటాన్, ఇండస్ ఇండ్ బ్యాంక్ షేర్లు రాణించాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీ, ఇన్ఫోసిస్, సన్‌ఫార్మా, టెక్ మహీంద్రా షేర్లు మాత్రమే నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 83.03 వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు ధర 2055.60 వద్ద ట్రేడవుతోంది.ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో భారత ఆర్థిక వ్యవస్థ అంచనాలకు మించి రాణించింది. వ్యవసాయ రంగం నెమ్మదించినా, తయారీ రంగంలో రెండంకెల వృద్ధి నమోదవడం, గనుల తవ్వకం, నిర్మాణరంగాలు మెరుగైన పనితీరును ప్రదర్శించడంతో మూడో త్రైమాసికంలో స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ) 8.4% వృద్ధి చెందింది. మరోవైపు 2023-24 మొత్తం మీద వృద్ధి రేటు 7.3 శాతంగా నమోదు కావొచ్చని ఎన్ఎస్ఓ అంచనా వేసింది. ఈ గణాంకాలు సూచీల్లో ఉత్సాహం నింపాయి.మరోవైపు అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల సంకేతాలూ దేశీయ సూచీలకు అండగా నిలుస్తున్నాయి. త్వరలో అమెరికాలో వడ్డీరేట్ల కోతపై ఫెడరల్ రిజర్వ్ స్పష్టతనిచ్చే అవకాశం ఉందనే ఊహాగానాలు జోరుగా వినిపిస్తున్నాయి. అలాగే ద్రవ్యోల్బణం సైతం దిగొచ్చే సూచనలు ఉన్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈనేపథ్యంలో గురువారం అక్కడి మార్కెట్లు రాణించాయి. ఆసియా- పసిఫిక్ సూచీలు మిశ్రమంగా ట్రేడవగా.. యూరోపియన్ మార్కెట్లు పాజిటివ్‌గా ట్రేడింగ్‌ను ఆరంభించాయి.రేపు ప్రత్యేక సెషన్: ప్రముఖ స్టాక్ ఎక్స్ఛేంజీలైన బీఎస్ఈ, ఎన్ఎస్ఈ శనివారం ప్రత్యేక ట్రేడింగ్ సెషన్‌ను నిర్వహించనున్నాయి. ఈక్విటీ, ఈక్విటీ డెరివేటివ్స్ సెగ్మెంట్‌లో ట్రేడింగ్ జరగనుంది. ప్రైమరీ సైట్‌లో ఏదైనా అవరోధం లేదా వైఫల్యం ఎదురైనప్పుడు సన్నద్ధతను తెలుసుకోవడానికి గానూ ఈ సెషన్ నిర్వహించనున్నట్లు రెండు స్టాక్ ఎక్స్ఛేంజీలు వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నాయి.

# ఏటీఎమ్ సాగుతో... ఏడాదంతా సిరులే!



కూలీలకు ఏ రోజు కూలి డబ్బులు ఆ రోజు అందుతుంటాయి. ఉద్యోగులకు నెలకోసారి జీతం వస్తుంది. కానీ, రైతులు మాత్రం ఏడాదిలో ఒకట్రెండు సార్లు పంటను అమ్ముకున్నప్పుడే డబ్బులు కళ్లజూస్తారు.అయితే కొందరు అన్నదాతలు ఎనీ టైమ్ మనీ(ఏటీఎమ్) పొందేలా కొత్త రకం వ్యవసాయానికి శ్రీకారం చుట్టి- ఏడాది పొడవునా ఆదాయం పొందుతున్నారు. మరి రైతును రాజుగా మారుస్తున్న ఆ ఏటీఎమ్ సాగు విధానం ఏంటో చూద్దామా!చాలామంది రైతులు తోటివారు ఏం పండిస్తే అదే తామూ సాగు చేయాలను కుంటారు. లేదంటే తమకి తెలిసిన పంటల్నే వేస్తుంటారు. అయితే మార్కెట్‌లో ఏ పంట డిమాండ్ ఆ పంటదే. ఒక్క పంటే వేస్తే- ఒక్కో సీజన్‌లో దానికి రేటు పడిపోవచ్చు. అదే ఎక్కువ రకాలు సాగు చేస్తే ఒకటి కాకపోయినా ఇంకో దానిలో మంచి లాభాలే వస్తాయి కదా! అందుకే పండ్ల తోటల్లోనూ, కొబ్బరి తోటల్లోనూ ఒకట్రెండు అంతర పంటలు వేయడం చూస్తుంటాం. అర ఎకరంలో పదికి మించి పంటలు పండించడం ఎక్కడైనా చూశారా? ఏటీఎమ్ పద్ధతిలో సాగు చేసే రైతన్నల పొలాలకు వెళితే ఆ పంటల వైవిధ్యం కనిపిస్తుంది.ఈ విధానంలో పూలు-పండ్ల జాతులు, తీగజాతులు, దుంప జాతులు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, కలప జాతుల్నీ కలిపి ఒకేసారి సాగు చేస్తుంటారు. ఎందుకంటే కొన్ని పంటలు నెలరోజుల్లోనే కాపుకొస్తే, మరికొన్ని రెండు నెలలకు, మరికొన్ని మూడు నెలలకు వస్తాయి. అలా దశలవారీగా చేతికొచ్చే పంటల్ని ఎంపిక చేసుకుని వరస క్రమంలో సాగు చేయడం ఒక పద్ధతి. వరస క్రమం లేకుండా ఖాళీ ఉన్న చోట ఏదో ఒక మొక్కని వేసి నేలని కప్పేయడం మరో విధానం. ఎలా చేసినా నీడ వల్ల తేమ ఎక్కువగా ఉంటుంది. రాలిన ఆకులు కుళ్లిపోయి భూసారాన్ని పెంచుతాయి. ఏటీఎమ్ విధానంలో సాగు చేసేవారు ముందుగా పొలం చుట్టూ ఎత్తుగా పెరిగే మొక్కజొన్న, కంది, చెరకు, జొన్న, కొర్రల వంటివి బోర్డరు పంటగా వేస్తారు. లోపల పండ్ల జాతుల్నీ లేదంటే చందనం, శ్రీగంధం, మహోగని వంటి కలప ఆధారిత మొక్కల్నీ ప్రధాన పంటగా వేస్తూ మిగతావి సాగు చేస్తారు. ఎలా చేసినా నిత్యం దిగుబడి వచ్చేలా పంటల్ని ఎంపిక చేసుకోవడం ముఖ్యం.తక్కువ నీళ్లు చాలు...బోర్డరు పంటల్ని నాటుకున్న తరవాత ఎత్తుగా పెరిగేవీ- మధ్యస్థంగా ఎదిగేవీ- వంగ, బెండ, గోరు చిక్కుడులా గుబురుగా పెరిగేవీ-సన్నగా పాకే చిక్కుడు తీగ జాతినీ- అవి పాకడానికి వీలుగా మునగ, కరివేపాకు వంటివాటినీ ఎంపిక చేసుకుంటున్నారు రైతులు. ఆ పక్కనే బంతి, చామంతి, కనకాంబరం, మల్లె... ఇలా సీజన్ల వారీగా నిత్యం కోతకొచ్చే పువ్వుల్నీ సాగు చేస్తున్నారు. వీటి మధ్యలోనే భూమిలో పండే ఉల్లి, అల్లం, పసుపు, వేరుసెనగలు కూడా సరైన ఎంపిక. మధ్య మధ్యలో పసుపు వేయడం వల్ల అందులోని యాంటీసెప్టిక్ గుణాలు ఎన్ని రకాల పంటలు వేసినా వాటి వేళ్లకు తెగుళ్లు ఆశించకుండా కాపాడతాయి. రకరకాల పంటలు ఉండటం వల్ల పరాగ సంపర్కం బాగా జరిగి దిగుబడి కూడా పెరుగుతుంది. నీళ్లు చాలా తక్కువగా ఉండే ప్రాంతాల్లోనైతే 'వానకు ముందు విత్తే'(ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్) పద్ధతిని ఎంచుకుంటారు. వేసవిలోనే బంకమట్టి, ఇతర ఎరువులు, బూడిద పూత వేసిన విత్తనాలను నాటి పైన కాయగూరలూ, ఇతర వ్యర్థాలూ, సెనగ పొట్టుతో నేలని కప్పెట్టి ఉంచుతారు. కుళ్లకుండా భూమి పొరలోనే తాజాగా ఉన్న విత్తనాలు వర్షంపడగానే మొలకెత్తుతాయి. వ్యర్థాల వల్ల ఆ భూమి తేమగా ఉంటుంది. ఈ విధానంలో నువ్వులు, ఆముదాలు, చిరుధాన్యాలు, గోరుచిక్కుడు, మొక్కజొన్న, వేరుసెనగ, గుమ్మడి, అల్లం, పసుపు వంటి వాటిని పండిస్తారు.

# అవిసె గింజలు...
# ఒక్క చెంచా చాలు!

'పాలల్లో లేదా పెరుగులో చెంచా అవిసెగింజలపొడి వేసుకుని తీసుకుంటే ఒంటికి ఎంత మంచిదో తెలుసా...' 'వేడివేడి అన్నంలో కాస్త అవిసెగింజల కారప్పొడీ నెయ్యీ వేసుకుని తిని చూడండి...', 'వారానికోసారి అవిసెగింజల జెల్‌ను తలకు రాస్తే జుట్టురాలడం బాగా తగ్గుతుంది...' అంటూ ఆరోగ్యానికీ అందానికీ ప్రాధాన్యమిచ్చేవారే కాకుండా వంటకాల్లో వెరైటీలు కోరుకునేవారూ అవిసెగింజల్ని తెగ వాడేస్తున్నారిప్పుడు.దానికి తగినట్లుగా వాటితో చేసిన ఉత్పత్తులూ రకరకాలుగా వచ్చేయడంతో ఒకప్పటితో పోలిస్తే.. ఇప్పుడు వీటి వాడకం బాగా పెరిగిందనే చెప్పొచ్చు. ఇంతకీ వీటి ప్రత్యేకత ఏంటో చూసేద్దామా మరి.నెలవారీ నిత్యావసర సరకుల జాబితాలో పోపు దినుసులతోపాటు నువ్వులూ పల్లీలూ పుట్నాలూ పెసలూ... అంటూ రకరకాలను చేర్చేస్తుంటాం. ఈ మధ్య ఆ జాబితాలో అవిసెగింజల పేరూ రాసేస్తున్నారు చాలామంది గృహిణులు. నిజానికి ఇవి ఎప్పటినుంచో అందుబాటులో ఉన్నా వీటి వాడకంపైన బోలెడు సందేహాలూ అపోహలూ ఉండడంతో ఈ గింజల్ని పక్కన పెట్టేసినవారే ఎక్కువ. అయితే... కొంతకాలంగా పోషకాహార నిపుణులు అవిసెగింజల వల్ల కలిగే ప్రయోజనాలను తరచూ తెలియజేయడం, తయారీదారులూ వీటితో రకరకాల పదార్థాలను తీసుకురావడంతో... ఈ మధ్య అవిసెల వాడకం బాగా పెరిగిందనే చెప్పొచ్చు. విదేశాల్లో పుట్టిన ఈ గింజలకు ఇక్కడా ఇంతటి గుర్తింపు లభించడం వెనుక వీటివల్ల ఒనగూడే ఆరోగ్య ప్రయోజనాలే ప్రధాన కారణం మరి.అసలేంటీ మొక్క...గోధుమవర్ణంలో ఉండి, నువ్వుల్లా కనిపించే అవిసెగింజల్ని ఆంగ్లంలో ఫ్లాక్స్‌సీడ్స్ అని పిలుస్తారు. ఈ గింజల శాస్త్రీయ నామం లినమ్ ఉసిటాటిసిమమ్ (ఉసిటాటిసిమమ్ అంటే లాటిన్‌లో 'చాలా ఉపయోగకరం' అని అర్థం). ఈజిప్టులో ఈ మొక్కను దాదాపు ముప్పైవేల సంవత్సరాల క్రితం నుంచీ పెంచుతుంటే... మనదేశంలో అయిదువేల సంవత్సరాల క్రితం అందుబాటులోకి వచ్చిందట. ప్రారంభంలో ఈ మొక్కల నుంచి నారను సేకరించి దుస్తుల తయారీకోసం ఉపయోగించేవారట. మనం ఇప్పుడు వాడుతున్న లినెన్ వస్త్రం ఈ అవిసెగింజల నారనుంచే వచ్చింది. మొదట్లో ఆ నారతో దుప్పట్లూ, లోదుస్తులూ, కర్టెన్లూ తదితరాలనే తయారుచేసినా... ఫ్యాషన్ ప్రపంచంలో ఇప్పుడు లినెన్‌కి ఎంతో డిమాండు ఉంది. రోజులు మారేకొద్దీ వాటి నుంచి అందే పోషకాలూ, కలిగే ఆరోగ్య ప్రయో జనాలపైన అవగాహన పెరగ ిడంతో ఈ గింజల్నీ, నూనెనూ




వంటకాల్లో వాడే వారి సంఖ్యా పెరిగింది. దాదాపు మూడున్నర అడుగుల ఎత్తులో ఉండే ఈ మొక్కలకు వచ్చే పూలు సాధారణంగా నీలంరంగులోనే ఉన్నా... కొన్నిచోట్ల తెలుపు, పసుపు, ఎరుపు వర్ణాల్లోనూ పూస్తాయి. మొక్కలకు గుత్తులు గుత్తులుగా పూసే చిన్నచిన్న మొగ్గల్లోనే అవిసెగింజలు ఉంటాయి. ఆ మొగ్గల్ని ఎండబెట్టి గింజల్ని వేరుచేస్తారు.ఎన్నెన్నో పోషకాలు.. .సాధారణంగా అవిసెగింజలు గోధుమ, పసుపు రంగుల్లో ఉంటాయి. వీటిల్లో ఒమేగా త్రీ ఫ్యాటీ ఆమ్లాలతోపాటు పీచు, విటమిన్లు, మినరల్స్, యాంటీఆక్సిడెంట్స్, మాంసకృత్తులు, కాపర్.. వంటి ఎన్నో పోషకాలు లభిస్తాయి.అవిసెగింజల్లో ఒమేగా త్రీ ఫ్యాటీ యాసిడ్స్ ఎక్కువశాతం ఉంటాయి. ప్రతిరోజూ టేబుల్‌స్పూను అవిసెగింజల పొడిని తీసుకోవడం వల్ల సుమారు 1.8 గ్రాముల ఒమేగా త్రీ ఫ్యాటీ యాసిడ్స్ శరీరానికి అందుతాయి. ఈ గింజల్ని కానీ, నూనెను కానీ తీసుకోవడం వల్ల గుండె కొట్టుకునే వేగం క్రమబద్ధం కావడంతోపాటూ హృద్రోగాలూ అదుపులో ఉంటాయని పరిశోధకులు తేల్చారు. అందుకే మొదట్లో వీటిని కేవలం గుండె ఆరోగ్యంకోసమే వాడేవారట. క్రమంగా పరిశోధనలు జరిగేకొద్దీ... మరెన్నో ప్రయోజనాలు కలుగుతాయని తేలడంతోపాటూ ఇతర అనారోగ్యాలూ నయమవుతాయని నిరూపితమైందని చెబుతారు పోషకాహార నిపుణురాలు డాక్టర్ లతాశశి. అవిసెగింజల్లో పీచు- సాల్యుబుల్(కరిగే), ఇన్‌సాల్యుబుల్(కరగని) రకాల్లో ఉండటం విశేషం. ఈ పీచు పదార్థం జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరిచి, జీర్ణసంబంధ సమస్యలు తలెత్తకుండా చేస్తుంది. అవిసెగింజల్లోని సాల్యుబుల్ ఫైబర్ చెడుకొలెస్ట్రాల్‌ను తగ్గించి తద్వారా గుండె జబ్బులతోపాటూ స్థూలకాయం, మధుమేహం, అధిక రక్తపోటు, మెటబాలిక్ సిండ్రోమ్ వంటి సమస్యలు అదుపులో ఉండేలా చేస్తుంది. బరువూ తగ్గుతారు. దీన్ని చాలా తక్కువ మోతాదులో తీసుకున్నా కూడా పొట్ట నిండిన భావన కలగడమే అందుకు కారణం.ఇతర ఆహార పదార్థాలతో పోలిస్తే అవిసెగింజల్లో లిగ్నాన్లు 75 నుంచి 800 రెట్లు ఎక్కువగా ఉంటాయట. ఈ లిగ్నాన్లు ఆస్టియోపోరోసిస్‌ను నివారించి మెనోపాజ్ లక్షణాలనూ తగ్గిస్తాయని అంటారు. అదేవిధంగా రొమ్ము, ప్రోస్టేట్, కొలొన్, ఊపిరితిత్తులు.. తదితర క్యాన్సర్ కారకాలను నియంత్రించడంలో అవిసెగింజలు కీలకంగా పనిచేస్తాయి. అందుకే మెనోపాజ్ దశకు చేరుతున్న మహిళలు అవిసెగింజల్ని తరచూ తీసుకోవాలని సూచిస్తారు వైద్యులు.అవిసెగింజల్లోని పాలిఫెనాల్స్ కణాలకు రక్షణకవచాల్లా పనిచేసి...ఎన్నోరకాల అనారోగ్యాలను దరిచేరకుండా కాపాడతాయి. అలాగే వీటిల్లోని థయామిన్ మనం తీసుకునే ఇతర పోషకాలను శక్తిగా మార్చేందుకు తోడ్పడితే మెగ్నీషియం నాడీవ్యవస్థకూ, కండరాల వృద్ధికీ, రోగనిరోధకశక్తికీ ఉపయోగపడుతుంది. వీటిలో అధికంగా ఉండే ఇనుముతో ఎర్రరక్తకణాలూ వృద్ధి చెందుతాయి.

# పలు కుటుంబాలకు మంత్రి పొంగులేటి పరామర్శ




**ఖమ్మం/తల్లాడ ఆగస్టు 26 (అక్షరంన్యూస్):** కొత్తగూడెం/ఖమ్మం : తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఉమ్మడి ఖమ్మంజిల్లాలో సోమవారం పర్యటించారు. పర్యటనలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధి మేదరబస్తీలో కౌన్సిలర్ పూర్ణ తండ్రి ఇటీవల చనిపోగా వారి కుటుంబాన్ని , ఖమ్మం జిల్లాలోని ఖమ్మం నగరం అల్లీపురం కొత్తగూడెం ప్రాంతానికి చెందిన శీతల రామసంగం తండ్రి ఇటీవల చనిపోగా వారి కుటుంబాన్ని, సహకారనగర్ లో కిలారు రామకృష్ణ తండ్రి ఇటీవల చనిపోగా వారి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వారి ఆత్మలకు శాంతి కలగాలని దేవున్ని ప్రార్థించారు. ఇంకా పలువురు మృతుల కుటుంబాలను కూడా మంత్రి పొంగులేటి పరామర్శించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదంలో గాయపడిన వెనిగళ్ళ నాగేశ్వరరావుని పరామర్శించి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.





## మహర్షి పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు



**రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /ఆగస్ట్ - 25(అక్షరం న్యూస్ ):** ముస్తాబాద్ మండల కేంద్రం లోని మహర్షి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ముందుగా శ్రీ కృష్ణుడి విగ్రహం ఏర్పటు చేసి పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులు గోపిక, శ్రీకృష్ణ వేషధారణలతో ఆకట్టుకున్నారు. అనంతరం విద్యార్థులు పాల ఉట్టిని కొట్టి వేడుకలు జరుపుకున్నారు. కృష్ణాష్టమి విశిష్టతను, కృష్ణుని జన్మ వృత్తాంతం, బాల్యం నుంచి కంస వద తదితర అంశాలపై ఉపాధ్యాయులు పిల్లలకు వివరించారు. పాఠశాలల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థులకు పండుగలు, భారతీయ సంస్కృతి సంప్రదాయాలు తెలుస్తాయని అన్నారు ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



## ఘనంగా మదర్ థెరిస్సా జయంతి వేడుకలు



**హనుమకొండ/భీమదేవరపల్లి/ఆగస్టు 26(అక్షరం న్యూస్):** మదర్ థెరిస్సా ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు పాటుపడాలని అంబేద్కర్ సంఘం మండల కన్వీనర్ బొల్లంపల్లి రాజు అన్నారు. భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో బొల్లంపల్లి రాజు ఆధ్వర్యంలో మదర్ థెరిస్సా జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మదర్ థెరిస్సా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక సుధాకర్ హాస్పిటల్ లో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బిక్షపతి, మాజీ సర్పంచ్ మాడుగుల కొమురయ్య, పల్లపు గంగాధర్, మేకల అజయ్ కుమార్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం..

**- ఎస్.ఎస్. బి. ఎం. మహాసేన**



**సుల్తానాబాద్ ( పెద్దపల్లి జిల్లా) ఆగస్టు 26 అక్షరం న్యూస్:** సుల్తానాబాద్ ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ వర్గాల కులాలను విడదీయొద్దు అంటూ సోమవారం రోజున ఎస్ ఎస్ ఎం బి ఎం మహాసేన జాతీయ అధ్యక్షులు కొంగర అనిల్ కుమార్ పిలుపుమేరకు సెప్టెంబర్ 27 న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సుల్తానాబాద్ లో మండల అధ్యక్షులు కలువల జగన్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కుల గణనను చేపట్టాలని, ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ మహాసేన ఆధ్వర్యంలో కేంద్రాన్ని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 27 శుక్రవారం రోజున ఢిల్లీలో జంతర్ మంతర్ వేదికగా మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అందరూ కదలి రావాలని కోరారు. అనంతరం కలువల జగన్ జాతీయ అధ్యక్షులు కొంగర అనిల్ కుమార్ కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కొమ్మ గల్ల బాబు, సుల్తానాబాద్ పట్టణంలో మండల అధ్యక్షుడు కలువల జగన్ , నిట్టూరి ప్రవీణ్ , తాళ్లపల్లి మల్లేష్, నిట్టూరి ఓదెలు, చిలుముల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల ఐక్యతను కొనసాగిద్దాం..



**- జర్నలిస్టుల పిలుపు**

**సుల్తానాబాద్,(పెద్దపల్లి జిల్లా), ఆగష్టు 26, అక్షరం న్యూస్:** జర్నలిస్టుల ఐక్యతను కొనసాగిద్దామని సీనియర్ జర్నలిస్టులు సాదుల సుగుణాకర్ టీ.కే .శ్రీనివాస్ సామల హరికృష్ణ కొమురవెల్లి భాస్కర్ న్యాతరి శ్రీనివాస్ మెరుగు యాదగిరి బోయిరి అశోక్ ,టి.కే. రమేష్ తోట్ల తిరుపతి యాదవ్ తదితరులు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక వైశ్య భవన్ లో జరిగిన జర్నలిస్టుల సమావేశంలో జర్నలిస్టుల ఐక్యత కోసం పలు తీర్మానాలు చేశారు. ఈ సమావేశంలో జర్నలిస్టుల హక్కుల కోసం నివేషణ స్థలాలు, హెల్త్ కార్డులు, అక్రిడియేషన్ కార్డులు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, జర్నలిస్టుల భద్రత, ప్రమాద బీమా, జర్నలిస్టులపై దాడుల పట్ల చర్యల పై పలువురు జర్నలిస్టుల అభిప్రాయాలను తీసుకొని చర్చించారు. ముఖ్యంగా జర్నలిస్టులను అగౌరవ పరచడం, అవమానించడం, చులకన భావంగా చూడడం లాంటి విషయాలను సహించేది లేదని తీర్మానించారు. ప్రెస్ క్లబ్ ఏర్పాటుకు జర్నలిస్టులందరూ ఐక్యంగా ముందుకు వచ్చి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు. జర్నలిస్టులకు వార్త సేకరణ విషయంలో జరిగే అవమానాలు దాడులపై కూడా సమావేశంలో చర్చించి ఐక్యంగా ఎదుర్కొనేందుకు పలు నిర్ణయాలను తీసుకున్నట్లు వారు స్పష్టం చేశారు. ప్రెస్ క్లబ్ ఏర్పాటు తర్వాత వాట్సప్ వార్తల నిషేధం పై ఏకాభిప్రాయంతో ముందుకు వెళ్లేందుకు జర్నలిస్టులందరూ ముందుకు రావాలని నిర్ణయించారు. జర్నలిస్టుల నిధి సమాలోచనలు చేసి నిర్ణయం తీసుకోనున్నట్లు వారు తెలిపారు. సమాజంలో జరిగే అవినీతి అన్యాయాలపై జర్నలిస్టులు అందరూ కలిసికట్టుగా వార్తలు సేకరించి ప్రజలకు న్యాయం జరిగే విధంగా సమావేశంలో కీలక నిర్ణయాలను తీసుకొని అమలుపరచనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా సూర్య పత్రిక జర్నలిస్ట్ సామల రాజేందర్ ప్రసాద్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు జంజీరాల లక్ష్మణ్, మంద నాగార్జున, పల్లా మహేష్, ముంజ శ్రీనివాస్, సామల రాజేంద్ర ప్రసాద్, బోయిని వినోద్, కల్లేపల్లి దేవేందర్, ఆకుల కరుణాకర్, సుంక మహేష్, మంథని రమేష్, కట్ట సత్యం, రాపోలు రాజు, చొప్పరి సుమన్, కుర్మ అరుణ్, ఎల్లె శివ, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# గీత కార్మికుల భద్రత, సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు తెలిపిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి





**- గీత కార్మికులకు కాటమయ్య రక్ష కిట్ల పంపిణీ చేసిన మంత్రి పొంగులేటి...**

**ఖమ్మం /తల్లాడ ఆగస్టు 26 (అక్షరంన్యూస్):** గీత కార్మికుల భద్రత, సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం కూసుమంచి క్యాంపు కార్యాలయంలో మంత్రి, గీత కార్మికులకు కాటమయ్య రక్ష కిట్ల పంపిణీ పథకాన్ని ప్రారభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కల్లు గీత కార్మికులు తాటి చెట్లు ఎక్కినప్పుడు ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు ఆధునిక టెక్నాలజీ తో రూపొందించిన కిట్లను ప్రభుత్వం అందజేస్తుందన్నారు. హైదరాబాద్ ఐఐటి ప్రత్యేకంగా ఇట్టి కిట్ల రూపకల్పన చేసిందని ఆయన తెలిపారు. బిసి కార్పొరేషన్, ఎక్సైజ్ శాఖల ద్వారా తెలంగాణ కల్లు గీత కార్మికుల సహకార ఆర్థిక సంఘం, హైదరాబాద్ సహకారంతో సేఫ్టీ కిట్లను లబ్దిదారులకు అందజేస్తున్నట్లు మంత్రి అన్నారు. గీత కార్మికులను ఆదుకోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, వారిని ఆపద నుంచి కాపాడేందుకు ఐఐటీ నిపుణులతో 'కాటమయ్య రక్షణ కవచం(మోకులు)' సేఫ్టీ కిట్లను తయారు చేయించామని ఆయన అన్నారు. కులవృత్తులకు అన్ని విధాలా చేయూత అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బలహీనవర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి తెలిపారు. కల్లు గీత కార్మికుల ప్రాణాలకు ప్రజా ప్రభుత్వం అభయ హస్తం కాటమయ్య రక్షణ కవచమని ఆయన అన్నారు. ఈత, తాటి వనాల పెంపు ద్వారా గీత కార్మికుల కుటుంబాలకు ఆర్థిక చేయూత అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన తెలిపారు. కల్లు గీత కార్మికుల రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసిందని, ఇక నుంచి ఎవరూ చెట్టుపై నుంచి కిందపడి ప్రాణాలు కోల్పోకుండా ఉండేందుకు ప్రత్యేక కిట్లను తయారు చేసిందని, కాటమయ్య రక్షణ కవచం పేరిట 6 పరికరాలున్న కిట్‌ను సిద్ధం చేసిందని పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ భూముల్లో తాటి, ఈత చెట్లు పెంచేలా చర్యలు తీసుకుంటామని, వన మహోత్సవంలో భాగంగా తాటి, ఈత చెట్ల పెంపకం చేపట్టాలని మంత్రి అన్నారు. రియల్ ఎస్టేట్ వెంచర్లలోని రోడ్ల పక్కన, చెరువుగట్లు, కాలువ గట్ల దగ్గర తాటి, ఈత చెట్లు పెంచేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రమాదానికి గురై మరణించిన గీత కార్మికులకు రూ. 5 లక్షలు ఎక్స్ గ్రేషియా ఇస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, ఖమ్మం ఆర్డీవో జి. గణేష్, జిల్లా బిసి సంక్షేమ అధికారిణి జ్యోతి, జిల్లా సహాయ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వేణుగోపాల్ రెడ్డి, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సరిత, ఆర్ అండ్ బి ఎస్ఇ హేమలత, ఇర్రిగేషన్ ఇఇ వెంకటేశ్వర రావు, తహశీల్దార్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నిజాలను వెలికితీయడంలో జర్నలిస్టుల పాత్ర కీలకం...

**- పాల్వంచ ప్రెస్ క్లబ్ ప్రారంభోత్సవంలో మంత్రి పొంగులేటి వ్యాఖ్యలు...**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆగస్టు 26 (అక్షరంన్యూస్) పాల్వంచ :** జర్నలిస్టులు నిజాలను వెలికి తీయడంలో కీలకపాత్ర పోషిస్తారని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో జెన్ కో కేటాయించిన స్థలంలో శ్యామల గోపాలన్ ఫౌండేషన్ చైర్మన్ సురేష్ రెడ్డి నేతృత్వంలో నూతనంగా నిర్మించిన ప్రెస్ క్లబ్ ను మంత్రి పొంగులేటి స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభు త్వానికి వ్యతిరేకంగా వార్తల రాసిన జర్నలిస్టులపై కేసులు పెట్టిన చరిత్ర ఉందని, తమ ప్రభుత్వంలో విలేకరులు స్వేచ్ఛగా వార్తలు రాసుకునే వీలుందన్నారు. ఆ ట్యూబులు ఈ ట్యూబులు పేరిట తమ ప్రభుత్వంపై బురద చల్లేవారు ఆత్మ విమర్శ చేసుకోవాలని సూచించారు. తప్పులు ప్రభుత్వం చేసిన ప్రతిపక్షం చేసిన విలేకరులు ధైర్యంగా వార్తలు రాసి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వైయస్ హయాంలో హైదరాబాదులో 72 ఎకరాల భూమిలో 1050 మంది విలేకరులకు ఇంటి పట్టాలు ఇచ్చిన గత ప్రభుత్వంలో కోర్టులో విలేకరులకు స్థలాలు ఇచ్చే విధంగా తీర్పు వచ్చినా ప్రభుత్వం ఆ పని చేయలేదన్నారు. తమ ప్రభుత్వంలో త్వరలోనే జవహర్ సొసైటీకి ఈ స్థలాలను భారీ బహిరంగ సభ నిర్వహించి వారి సమక్షంలో అందజేస్తామన్నారు. కొన్ని పింక్ పేపర్లు తమపై వ్యతిరేకంగా వార్తలు రాసిన పట్టించుకోమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చే బాధ్యత తమ ప్రభుత్వానిదేనన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్లు ఇస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం మాటలు చెప్పిందని తమ ప్రభుత్వం చేతల ద్వారా చేస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించారు. పాల్వంచ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల కొండలరావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో కే టి పి ఎస్ ట్రైనింగ్ సెంటర్ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస బాబు, మార్క్ ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరా వు, ఏపీఆర్ఓ అస్గర్ హుస్సేన్ ,సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, ప్రెస్ క్లబ్ నిర్మాణదాత నల్ల సురేష్ రెడ్డి, ప్రెస్ క్లబ్ కార్యదర్శి షేక్ సుభాని, గౌరవాధ్యక్షులు సంజీవ్ కుమార్, సలహాదారులు చంద్ర నరసింహారావు, కోశాధికారి రజాక్, ఉపాధ్యక్షులు వెంకటనారాయణ, ఏ. అబ్బురామ్, ఆర్ కృష్ణమూర్తి, జైనుల్లాబుద్దీన్, జగదీష్, వాజిద్, వై. శ్రీనివాసరావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టీయూడబ్ల్యూజే యూనియన్ అధ్యక్షులు కల్లోజి శ్రీనివాస్, ఉదయ్ కుమార్, బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి ఎర్ర కామేష్, జిల్లా కాంగ్రెస్ నాయకులు కోనేరు చిన్ని, దేవి ప్రసన్న, నాగా సీతారాములు, సిపిఎం, సిపిఐ పట్టణ మండల కార్యదర్శులు దొడ్డా రవికుమార్, సాయిబాబు, వీసంశెట్టి పూర్ణ, మాస్ లైన్ నాయకులు నిమ్మల రాంబాబు, ఐ ఎన్ టీ యు సి రాష్ట్ర కార్యదర్శి ఎస్ ఏ జలీల్, 15 35 జాతీయ అధ్యక్షులు ఎంఏ వజీర్, టిఆర్వికేఎస్ రాష్ట్ర కార్యదర్శి చారుగుండ్ల రమేష్, 327 రాష్ట్ర కార్యదర్శి ఎంఏ మజీద్, 1104 రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు రాజేందర్, కోటే శ్వరరావు, సిఐటియు రాష్ట్ర నా యకులు అంకిరెడ్డి నరసిం హారావు, పలువురు నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరైన అతిథులను ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో శాలువాలు పూలమాలతో సత్కరించి, మెమొంటోలను అందజేశారు.





# ప్రజా సమస్యల పరిష్కారంలో సోషల్ మీడియాదే కీలకపాత్ర

**- సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం**

**ఖమ్మం/తల్లాడ ఆగస్టు 26 (అక్షరంన్యూస్):** ప్రజలు సమస్యలు పరిష్కరించడంలో సోషల్ మీడియా కీలక పాత్ర పోషిస్తుందని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. సోషల్ మీడియా రాష్ట్ర స్థాయి రెండు రోజులు రాజకీయ శిక్షణా తరగతులు సుందరయ్య భవన్ లో ప్రారంభం అయ్యాయి. సోషల్ మీడియా రాష్ట్ర నాయకులు పిట్టల రవి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన మీడియా కార్పొరేట్ కనుసన్నల్లో మెలుగుతున్న దశలో సోషల్ మీడియా గ్రామీణ స్థాయిలో ప్రజా ఇబ్బందులను వెలుగు తీయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వాల లో దివాలా కోరు విధానాలను ఎండగట్టాలన్నారు. ఖమ్మంలోని సోమవారం సుందరయ్యభవన్‌లో ఏర్పాటు చేసిన సిపిఎం రాష్ట్ర సోషల్ మీడియా శిక్షణా తరగతులలో తమ్మినేని ప్రారంభ ఉపన్యాసం చేశారు. సోషల్ మీడియాతో యువత ప్రభావితమవుతోందని, అందుకే ఆధునిక ఆలోచనలతో కూడిన పార్టీ కార్యక్రమాలను మీడియా ద్వారా తెలియజేయనున్నట్లు చెప్పారు. గత ఐదేళ్లుగా సామాజిక మార్పులో సోషల్ మీడియా కీలక భూమిక పోషించిందని అన్నారు. కొన్ని రాజకీయ పార్టీల కార్యకర్తలు సోషల్ మీడియాను వేదికగా చేసుకొని ముందుకుసాగుతున్నారని తెలిపారు. పార్టీ పనివిధానం, సిద్ధాంతాలను ప్రజలకు తెలియజేయడంలో సరైన కార్యాచరణ లేక తమ నాయకత్వం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటుందని అన్నారు. దేశంలో బిజెపి ప్రభుత్వం మూడోవ సారి అధికారంలోకి వచ్చిన తర్వాత సోషల్ మీడియాలో పిచ్చి అబద్దాలతో సోషల్ మీడియాలో విషం వెదజల్లే పనిలోబిజెపి శ్రేణులు వున్నారు అని విమర్శించారు. ఫేక్ వీడియోలతో విద్వేషాలు నింపే పనిలో వున్నారు అని విమర్శించారు. ప్రజలకు వాస్తవాలు చెప్పే విధంగా సోషల్ మీడియాలో పార్టీ శ్రేణులు పని చేయాలని కోరారు. రాష్ట్ర పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు అబ్బాస్ , ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు బండారు రవికుమార్, జగదీష్, వై విక్రమ్, సుందర్, శంకర్ , నర్సిరెడ్డి , గొడుగు వెంకట్ యాటలసోమన్న తదితరులు పాల్గొన్నారు.






# నిరుపేదలకు అండగా వైరా లయన్స్ క్లబ్...



**ఖమ్మం/వైరా ఆగస్టు 26 (అక్షరంన్యూస్):** నిరుపేదలుగా ఉంటూ ఎటువంటి పనులు చేసుకోలేక ఇబ్బందిపడుతున్ననిరుపేదలను లయన్స్ క్లబ్ ఆఫ్ వైరా ఎల్లవేళలా అందిస్తుందని లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ పెనుగొండ ఉపేంద్ర రావు అన్నారు. క్లబ్బు ఉపాధ్యక్షులు కొల్లా రాంబాబు అధ్యక్షతన జరిగిన రాయపూడి వెంకటేష్ రజనీ దంపతుల పెళ్లిరోజు పురస్కరించుకొని వారి సహకారంతో నిత్యవసర సరుకులు అందజేసారు. అనంతరం కేక్ కటింగ్ చేసి పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మదర్ తెరిసా జయంతి వేడుకల సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డాక్టర్ కోటయ్య మదర్ తెరిసా విగ్రహానికి పూలమాల వేసారు మదర్ తెరిసా చేసిన సేవలు సృష్టి ఉన్నంతకాలం గుర్తుంచుకునే విధంగా చేశారని ఎంతోమంది కుష్టు వారిని ఆదరించి వారికి అండగా ఉన్నారని నేటికీ ఆమె స్థాపించిన సంస్థల ద్వారా సేవలు కొనసాగటం చాలా అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ పిఆర్ఓ ఏపూరి రాజారావు నూకల ప్రసాద్ రావు చింతోజు నాగేశ్వరరావు నాళ్ల నాగేశ్వరరావు నాగమల్లేశ్వరి రాయపుడి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.




## వైరా గ్రేట్ విజన్ క్లబ్ అధ్వర్యంలో ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు ఆర్థిక సహాయం..




**ఖమ్మం/ వైరా ఆగస్టు 26 (అక్షరంన్యూస్):** వైరా గ్రేట్ విజన్ క్లబ్ అధ్యక్షులు లయన్ తోటకూర శ్రీకాంత్ అధ్వర్యంలో ఇంటర్మీడిట్ చదువుతున్న విద్యార్థులు పెనుగొండ రుషి , బానోత్ గీతా శ్రీ కు లయన్స్ విద్యా ట్రస్ట్ ద్వారా ఆర్థికసహాయం అందించారు. ఈ కార్యక్రమం లో పాస్ట్ డిస్టిక్ గవర్నర్ లయన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ మాట్లాడుతూ ఎంతో మంది విద్యార్థులకు వున్నత చదువుల నిమిత్తం లయన్స్ విద్యా ట్రస్ట్ ద్వారా ఆర్థికసహాయం 20,000/-అందించాము అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిఎస్ టి కోఆర్డినేటర్ ఉంద్రు శ్యామ్ బాబు, డిజెఎస్ లగడపాటి ప్రభాకరరావు, జెసి ఉంద్రు వరలక్ష్మి, డిసి కొంకమల్లి విశ్వేశ్వరావు, గంగవరపు కిషన్, సెక్రటరీ జాలా పుల్లారావు, ట్రెజరర్ వుయ్యురు రామకృష్ణ, జాలా మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ



**జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్ ) ఆగస్టు 26 :** లయన్స్ క్లబ్ అఫ్ రఘునాథపల్లి కోశాధికారి లయన్ కోళ్ల రాజు గౌడ్ పెళ్లి రోజు ను పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ రఘునాథపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం రోగులకు పండ్లు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు కందుల అనిల్ కుమార్, కార్యదర్శి ప్రదీప్ కుమార్, కోశాధికారి కోళ్ల రాజు గౌడ్ లు హాజరైనారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు కందుల అనిల్ కుమార్ మాట్లాడుతూరోగులకు చేసేటువంటి సేవ పరమావధిగా లైన్స్ క్లబ్ ముందుకు సాగుతుందని అన్నారు. క్లబ్ లోని సభ్యులు వారి జన్మదినం, పెళ్లి రోజులకు ఏదేని ఒక సేవా కార్యక్రమాన్ని చేసుకుంటూ వెళ్లడం ఆనవాయితీగా మారిందని అన్నారు. ప్రార్థించే పెదవుల కన్నా సహాయం చేసే చేతులు మిన్న అనే నానుడిని లయన్స్ క్లబ్ ఆఫ్ రఘునాథపల్లి తూచా తప్పక పాటిస్తుండడం హర్షించదగ్గ విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ పూర్వ అధ్యక్షులు శంకర్ రెడ్డి, లక్ష్మీనారాయణ,అశోక్, రహీం పాషా, శ్రీనివాస్, కృష్ణ, ఆసుపత్రి సిబ్బంది విష్ణువర్ధన్ రెడ్డి, అయోధ్య తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మకుమారిస్‌లో కృష్ణాష్టమి వేడుకలు

**- అర్చకులకు సన్మానం...**





**ఖమ్మం/వైరా ఆగస్టు 26 (అక్షరంన్యూస్):** వైరాలో ని బ్రహ్మకుమారిస్ లో కృష్ణాష్టమి సందర్భంగా 16 మంది పురోహితులకు సమాజం తరఫున ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కృష్ణాష్టమి ప్రాముఖ్యత కన్నయ్య లీలలు గురించి బ్రహ్మకుమారిస్ అక్కయ్యలు వివరించారు. కృష్ణుడు అంటే ప్రేమని కృష్ణుడు అంటే స్నేహమని కృష్ణుడు అంటేనేనమ్మకమని తెలిపారు. మానవులు తెలిసి కొంత తెలియకుండా పాపాలు చేస్తూనే ఉంటారని మరి ఈ పాపాలు పోవడానికి ప్రాయశ్చిత్తం చేసుకోవాలని అదొక కిష్ట నామంతోనే జపిస్తే చాలని వివరించారుప్రతి మానవుడు లాభాల్లో నష్టాల్లో కష్టాల్లో సుఖాల్లో నీ మనసును అటు ఇటు పరిగెత్తించకుండా సాధ్యం ఎంతవరకు ప్రశాంతంగా ఉండటం మంచిదని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారిస్ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**హనుమకొండ/భీమదేవరపల్లి/ఆగస్టు 26(అక్షరం న్యూస్):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో ముల్కనూర్ ఎస్సై సాయిబాబు పాల్గొన్నారు. అదేవిధంగా వంగర గ్రామంలోని పివి రంగారావు బాలికల విద్యాలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా పాఠశాల ఇంచార్జ్ ప్రిన్సిపల్ అఫ్రీన్ సుల్తానా మాట్లాడుతూ శ్రీకృష్ణ జన్మాష్టమి పండుగ హిందువులకు ఎంతో ముఖ్యమైనదని అన్నారు. విద్యార్థులను శ్రీకృష్ణుని, గోపికల వేషధారణ వేయించి దేవునిపై తమ ప్రీతిని చాటుకున్నారు. అనంతరం చిన్నారులు, విద్యార్థులు ఉట్లు కొట్టి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ప్రిన్సిపల్ అఫ్రీన్ సుల్తానా, అధ్యాపక బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, at Sri Venkateshwara Printers. Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Districrt : Khammam Editor: Shaik Yacoob Pasha, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609